# మళ్ళీ ఎప్పుడో..ఎక్కడో..!

నవల

## కొమ్మూరి సాంబశివ రావు





శ్రీ

కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 56






## అర్థశతాబ్దం క్రిందటి అద్భుతమైన నవల

**అంతరాంతరాల్లో మధురబాధా తంత్రుల్ని మీటే టైటిల్.."మళ్ళీ..ఎప్పుడో! ఎక్కడో!!".**

కొమ్మూరి సాంబశివరావుగారికి అత్యంత ప్రీతిపాత్రమైన పేరు ఇది. ఈ నవలమీద ఆయనకి ఎంత గాఢమైన అనురాగమంటే - 1975లో ఇదే పేరుతో ఈ నవలని సినిమాగా, తాను నిర్మాతగా, రూపొందించారు. అదీ ఒకేసారి కన్నడ, తెలుగు భాషల్లో. జయంతి హీరోయిన్. తరువాతి కాలంలో కళాతపస్వి కె.విశ్వనాథ్‌గారి వద్ద సహాయకుడిగా పనిచేసిన గురుదేవ్ ఈ సినిమాకి దర్శకులు. అప్పటి ప్రముఖ సంగీతదర్శకులు పెండ్యాలగారు సంగీతం సమకూర్చారు. శ్రీశ్రీ గారు పాటలు వ్రాశారు. టైటిల్ సాంగ్ "ఎవరు నీవు..ఎవరు నేనని అడిగేది ఎవరు - ఎన్నాళ్ళీ పయనమో ఎవరికి తెలుసు - మళ్ళీ ఎప్పుడో..ఎక్కడో..అంతే బ్రతుకు..!" ఇలా సాగుతుంది.

ఇంత అద్భుతమైన ప్రోజెక్టు ఎదుర్కొన్న విషాదమేమిటంటే ఈ సినిమా విడుదలకి నోచుకోలేదు. కొన్ని దశాబ్దాల తర్వాత రావాల్సిన సినిమాని ముందుగానే తీశానేమోనని అనుకుంటుండే వారు సాంబశివరావుగారు. అయన సంపాదనంతా ఈ సినిమా నిర్మాణంలో పెట్టేశారు. దీని వైఫల్యం.. తర్వాత తర్వాత ఆయన ఆర్థిక పరిస్థితుల మీద, ఆరోగ్యం మీదనే కాక ఆయన రచనా శక్తి మీద కూడా తీవ్రప్రభావాన్ని కలిగించింది.

ఈ అద్భుతమైన నవలని ఆనాటి యువతరానికే కాదు, ఈనాటి తరానికి కూడా నిలిచేలా అందించిన కొమ్మూరి సాంబశివరావు గారిని తెలుగు పాఠకులు ఎప్పటికీ మర్చిపోలేరు.

ఈ నవలని 'కౌముది'లో ప్రచురణకి ప్రత్యేక అనుమతినిచ్చిన కొమ్మూరి సాంబశివరావుగారి కుమారుడు వెంకట్‌గారికి ప్రత్యేక కృతజ్ఞతలు..

## 1

**"ఎవరయినా వస్తారు!" అన్నది మీనాక్షి, తలవంచుకుని**

"ఎవరు వస్తారు! కర్టెన్ వేసి ఉన్నదిగా!" అంటూ ఆమె చెయ్యి వదిలి నడుం చుట్టూ చెయ్యివేసి దగ్గరకి లాక్కున్నాడు ఆమెని.

అతని చెయ్యి తన ఒంటికి తగలగానే మీనాక్షి రక్తం ఉడికిపోయింది. గజగజ వణికిపోయింది. ఉక్కిరి బిక్కిరి అయి ఊపిరి ఆడనట్లయింది.

"నాన్నగారు వస్తారు" అన్నది రహస్యంగా. అతని మొహంలోకి చూడడం లేదు. సిగ్గు.

నాగరాజు చిన్నగా నవ్వి "అబద్ధం. మీ నాన్నగారు ఇప్పుడప్పుడే రారు. నాకు తెలుసు." అన్నాడు ఆమెని దగ్గరకి లాక్కుంటూ.

"ఇంకెవరయినా వస్తారు..." అభ్యంతరం కాదు అది, అతనికి ఆ విషయం తెలుసు. ఏవో సాకులు వెతుకుతోంది. అతనికి ధైర్యం ఎక్కువైంది.

"వస్తే రానియ్యి మనకేం! భయమా?" అంటూ ఆమె భుజాల మీద ముద్దు పెట్టుకున్నాడు. మీనాక్షి తల పైకెత్తి అతని కళ్ళల్లోకి చూసింది. నల్లని అతని సాఫీ జుట్టు నుదుటి మీద పడుతోంది. వేళ్ళ కొనలతో అతని జుట్టు వెనక్కి తోసి పట్టుకున్నది. విశాలమైన అతని నుదురు చిన్నవయినా లోతుగా నల్లగా ఉన్న అతని కళ్ళు, సన్నగా పొడుగ్గా ఉన్న అతని ముక్కు; బిగించి వున్న పెదిమలు; గట్టిగా ఉన్న అతని గెడ్డం; అన్నీ చూస్తూ ఊరుకోలేక అతని ఛాతీమీద తల వాల్చింది.

"మీనా!" అంటూ అతను ఆమె నుదుటిని తన పెదిమలతో అదిమి తల పైకి ఎత్తి ఆమె కళ్ళల్లోకి చూస్తూ "నువ్వు ఎంత అందమైన దానివో తెలుసా?" అన్నాడు. ఆమె జవాబు కోసం కాచుకోలేదు. నుదుటి మీద నుంచి పెదిమలు మృదువుగా కిందకి తీసుకెళ్ళాడు. ఆమె కనుబొమలని పెదిమలతో దిద్దాడు; రెండు చేతులతో ఆమెని పట్టుకుని గట్టిగా అదుముకుంటూ ఆమె చెంపలని తడిచేశాడు. అలా ఆమె చెంపలని ముద్దులు పెట్టుకుంటూ ఆమె పెదిమలని చేరుకున్నాడు. మొదట నెమ్మదిగా మృదువుగా ఆమె పెదిమలని తన పెదిమలతో స్పర్శించాడు. పెదిమలు విప్పింది; గట్టిగా తన పెదిమలని ఆమె పెదిమల మధ్య బిగించి వాటిలోని మాధుర్యాన్ని తాగేస్తున్నాడు. అతని చేతుల్లో బలం చాలడం లేదు ఆమెని గట్టిగా కావలించుకోడానికి. ఆమె ఊపిరి ఆడకపోయినా ఇంకా బలంగా అతను తనని బిగించాలని, అతనికి ఇంకా దగ్గరవాలని ముందుకి వాలిపోతోంది.

చటుక్కున ఆమె నడుం మీదనుంచి చేతులు తీసేశాడు. ఆశ్చర్యంతో చూసింది. ఏమైంది? ఎందుకు ఈ నిరాదరణ? అనుకున్నది. అతను నవ్వుతూ ఆమె భుజం మీద ఒక చెయ్యి, ఆమె తొడకింద ఒక చెయ్యివేసి ఎత్తుకున్నాడు ఎత్తుకున్నాడు రెండు చేతులతోనూ.

"ఏమిటిది? నేను చిన్నపిల్లని కాదు" అన్నది నవ్వుతూ.

"చిన్నపిల్లవే!"

"నాకు పాతికేళ్ళు" అన్నది అతని మెడలో మొహం పెట్టి.

"పదహారేళ్ళ పిల్లలా ఉన్నావు?" ఎత్తుకుని లోపల గదిలోకి, పడక గదిలోకి తీసుకు వెళుతున్నాడు.

"ఎక్కడికి?" అడిగింది మీనాక్షి కాస్త కంగారుగా.

నవ్వుతూ ఆమెని ముద్దు పెట్టుకున్నాడు. ఆ ముద్దుతో మీనాక్షి కంగారు పోయింది. ఒళ్ళు తెలియని ఆవేశంలో వివేకమూ పోయింది.

జాగ్రత్తగా ఆమెని మంచం మీద పడుకోబెట్టాడు.

ఒద్దు అన్నట్టు నెమ్మదిగా తల తిప్పింది మీనాక్షి. అంతకన్నా అభ్యంతరం చెప్పడానికి ఆమెకి శక్తి లేదు. అతను ఆమె పక్కన కూర్చున్నాడు ఒకసారి ఆమెని పాదాల నుంచి జుట్టూ వరకూ పరీక్షగా చూశాడు. "ఎంత అందం!" అన్నాడు.

మీనాక్షి ఏదో అనబోయింది. మాట రాలేదు. గుటకవేసింది. పెదిమలు తడి చేసుకున్నది.

అతను తలవంచి ఆమె పెదిమలను అందుకున్నాడు. ఆమె పెదిమలు అతని పెదిమల వేడికి కరిగిపోతున్నాయి. అతని చేతులు ఆమె వంటిమీదకి పాకి, ఎక్కడెక్కడో వెతికి, ఏవేవో కోరికలు, వాటి అర్థం చెపుతున్నాయి. మీనాక్షికి పిచ్చి ఎక్కినట్టయింది. ఎన్నేళ్ళ నుంచో నీతి, వివేకం వల్ల అణుచుకున్న వాంఛ వాటిని జయించి ఆమెని స్వాధీనం చేసుకుంటున్నది.

అదేమిటి? ఎలా ఉంటుంది? అందులో ఆనందం ఎంత? అనే క్యూరియాసిటీతో ఆమె వళ్ళు వెయ్యి పువ్వులయి విచ్చుకుని అతనిని ఆహ్వానిస్తున్నది.

సరిగ్గా ఆ సమయాన చెప్పులు చప్పుడయి ఇద్దరూ ఉలిక్కిపడి మంచం మీద నుంచి లేచారు. మరుక్షణం మీనాక్షి తండ్రి చక్రవర్తి దగ్గు వినిపించింది. నాగరాజు జుట్టు సర్దుకుంటూ హాల్లోకి పరిగెత్తాడు.

"నువ్వా? ఏమోయ్!" అంటూ చక్రవర్తి చెప్పులు వదిలి హాల్లో పడక కుర్చీలో కూర్చున్నాడు.

మీనాక్షి అద్దం ముందుకి వెళ్ళి, కురులు సరిచేసుకుని, పమిట సర్దుకుని, పెదిమలు పరీక్ష చేసుకుని, చెంపలకి పౌడర్ అద్దుకుని వంట ఇంట్లోకి వెళ్ళి "నాన్నా! నీకూ కాఫీ కావాలా?" కేకేసింది.

"ఉంటే ఇయ్యి!" అన్నాడు చక్రవర్తి.

సరిగా సమయానికి తండ్రి వచ్చాడు. లేకపోతే!? తలుచుకుంటేనే మీనాక్షి మొహం ఎర్రనవుతోంది, పెదిమలు వణుకుతున్నాయి. తండ్రి ఆ సమయంలో ఇంటికి వచ్చినందుకు మీనాక్షి విసుక్కోలేదు. చింతించలేదు. అదృష్టం అనుకున్నది. ఇన్నేళ్ళు తను జాగ్రత్తగా కాపాడుకున్న తన నైర్మల్యం కాపాడాడు తండ్రి. తండ్రికి మనస్సులో ధన్యవాదాలు చెప్పుకున్నది. ఈసారి జాగ్రత్తగా ఉండాలి. ఇలా ఆవేశానికి లొంగిపోకూడదు. వివేకం పోగొట్టుకోకూడదు. పెళ్ళి కానిదే అలా చెయ్యడం తప్పు అని తనకి తాను బుద్ధి చెప్పుకున్నది.

## 2

మీనాక్షికి ఇరవై నాలుగేళ్ళు. బి.ఏ. పాసయింది. షార్టు హాండ్ టైప్ రైటింగ్ నేర్చుకున్నది. స్టాటిస్టికల్ బోర్డ్‌లో ఉద్యోగం చేస్తోంది. నెలకి రెండువందల నలభై రూపాయలు వస్తాయి అలవెన్సులన్నీ కలిసి.

మీనాక్షికి పెళ్ళి కాలేదు.

మీనాక్షి తండ్రి చక్రవర్తి చాలా చిన్నపుడే ఉద్యోగంలో చేరాడు. అంటే స్కూలు ఫైనలు పాసవగానే పదిహేడో ఏట గుమస్తా ఉద్యోగంలో చేరాడు. అయితేనేం గవర్నమెంటు ఉద్యోగం పోతుందని భయంలేదు. ఎక్కువ పని చెయ్యవలసిన అవసరమూలేదు. ఒక్కొక్క ఫైలు నెలల తరబడి బల్లమీద పడేసి పెట్టవచ్చు. అతని ఉద్యోగమూ అలాగే బల్లమీద ఫైలు లాగే ఉండేది. ఏడాదికి రెండున్నర రూపాయలు ఇంక్రిమెంటు. ఎడారిలో ఎండమావులు మల్లే ప్రమోషన్ దగ్గరిగా కనిపిస్తూనే ఉండేది కాని దూరం అవుతూ ఉండేది. చక్రవర్తి చిన్నతనం నుంచీ చాలా పొదుపూ, జాగ్రత్తా ఉన్న మనిషి. అతని చిన్నతనంలోనే తల్లీ తండ్రీపోయారు. పెత్తండ్రి ఇంట్లో పెరిగి ఉద్యోగం దొరకగానే తన దారిన తను వెళ్ళిపోయాడు. ఆ తర్వాత చక్రవర్తి విషయం బంధువులు ఎవరూ పట్టించుకోలేదు.

ఇరవైరెండేళ్ళప్పుడు చక్రవర్తి పెళ్ళిచేసుకున్నాడు. తనకన్నా బాగా పెద్దవాడైన తోటి గుమస్తా కూతుర్ని చేసుకున్నాడు. అయిదు వందలు కట్నం కూడా తీసుకున్నాడు. చక్రవర్తి నిలకడగా పట్టుమని రెండు సంవత్సరాలు ఏ ఒక ఊళ్ళోనూ లేడు. ఆరు నెలలకి, సంవత్సరానికి ఇంకో ఊరికి బదిలి అయ్యేది. అందువల్ల అతనికి ఆప్తమిత్రులు అనేవాళ్ళు లేకుండా పోయారు. ఎవరితోనైనా కాస్త స్నేహం అయీ అవడంతోనే ఆ ఊళ్ళోంచి ఇంకో ఊరికి వెళ్ళిపోవడం జరిగేది.

అయినా చక్రవర్తి జీవితం తృప్తిగా, సుఖంగానే గడిచేది. అతని భార్య పంకజాక్షి కూడా జాగ్రత్త మనిషి. చాలా సహనంగల మనిషి. గొప్ప అందమైన ఆడది కాకపోయినా అంత వికారికాదు. చక్రవర్తి సంపాదనతో ఇల్లు గడపడమే కాక నెలనెలా అయిదూ పదీ మిగిల్చి నగలు, పట్టుచీరలు కొనేది.

వాళ్ళకి కొరతల్లా సంతానం లేకపోవడం. పంకజాక్షి చాలామంది దేవుళ్ళకి మొక్కుకున్నది. చక్రవర్తి ఎంతమందికో జాతకం చూపించుకున్నాడు. ప్రతినెలా ఆశతో, ఆత్రంతో కాచుకునేవాళ్ళు ఆ భార్యా భర్తలు. అలా కొన్నేళ్ళు గడిచిపోయాయి- ఎనిమిదేళ్ళు.

పెళ్ళయిన ఎనిమిదేళ్ళకి - పంకజాక్షి నెల తప్పింది. తొమ్మిది నెలలు మోసి ఆడపిల్లని కన్నది. మీనాక్షి అని పేరు పెట్టాడు. ఆడపిల్ల పుట్టినందుకు ఆ దంపతులు చింతించలేదు - చాలా గారాబంగా ముద్దుగా పెంచారు.

తర్వాత పిల్లవాడు పుడతాడని చాలా ఆశపడ్డారు. కానీ అలా జరగలేదు.

ఊళ్ళు మారడం వల్ల మీనాక్షికి కూడా చిన్నతనం నుంచీ చిక్కని స్నేహాలు అంటూ లేకుండా పోయాయి. అందువల్లనేమో ఇట్టే పక్కిళ్ళవాళ్ళతో, స్కూల్లో, పిల్లలతో స్నేహాలు చేసుకునేది. మీనాక్షి వల్ల ఆ తల్లి తండ్రులకి ఏనాడూ ఏ చికాకు కలిగేది కాదు. ఎవరితోనూ పోట్లాడేది కాదు, ఎన్నడు జబ్బుపడేది కాదు, ఎప్పుడో ఏడాదికి ఓసారి తప్ప జలుబు కూడా చేసేది కాదు. ఎప్పుడూ నవ్వుతూ, ఆడుకుంటూ, అల్లికలు, కుట్లు నేర్చుకుంటూ శ్రద్ధగా చదువుకుంటూ, తల్లిదండ్రులకి చాలా తృప్తీ, గర్వం ఇచ్చేది. మీనాక్షి పుట్టగానే చక్రవర్తికి ప్రమోషన్ వచ్చింది. మీనాక్షికి పదేళ్ళు వచ్చేటప్పటికి ఇంకో రెండు ప్రమోషన్లు వచ్చాయి.

మీనాక్షి తమకి అదృష్టం తెచ్చి పెట్టిందని చక్రవర్తి చాలా సంతోషించేవాడు.

మీనాక్షికి పదకొండేళ్ళప్పుడు తల్లిపోయింది. పెద్ద జబ్బేమీ చెయ్యలేదు - నెలలపాటు మంచం పట్టి శుష్కించలేదు. రెండేరోజులు తీవ్రంగా జ్వరం వచ్చి మూడో రోజున పోయింది.

తండ్రీ కూతురు గుండెలు చిల్లు పడేటట్లు ఏడ్చారు. మూడు రోజుల క్రితం నవ్వుతూ వంట వడ్డించిన మనిషి సరిగా మూడు రోజుల తర్వాత ఎలా చచ్చిపోయిందో అర్థం కాలేదు వాళ్ళకి.

చావంటే ఏమిటి? చచ్చిపోయిన వాళ్ళు మళ్ళీ పుడతారా? పుట్టేంతవరకూ ఎక్కడ ఉంటారు? వాళ్ళకి విచారం దుఃఖం ఉంటాయా?

ఇలాంటి ప్రశ్నలతో, ఊహలతో, అర్థంపర్థంలేని ఆలోచనలతో ఓ నెల రోజులపాటు ఆ తండ్రీ కూతురూ ఇంట్లోంచి కదలలేదు. నెల రోజుల సెలవు అయిపోయిన తర్వాత చక్రవర్తి మళ్ళీ ఆఫీసుకి వెళ్ళడం ప్రారంభించాడు. మీనాక్షి స్కూలుకి వెళ్ళడం మొదలు పెట్టింది.

రోజులు, నెలలూ, సంవత్సరాలూ గడిచిపోతున్న కొద్దీ ఆ ఇద్దరికి శోకం భ్రమ తగ్గిపోయింది. కళ్ళనీళ్ళు కార్చకుండా, గుండె బరువు ఎక్కకుండా పంకజాక్షిని గురించి మాట్లాడడం అలవాటయింది.

మీనాక్షి స్కూలు ఫైనల్ పాసయింది పదహారేళ్ళు వచ్చాయి.

****

**వయస్సు వచ్చేటప్పటికి అందరు ఆడపిల్లలూ అందంగా తయారవుతారని అంటారు**. అందరి విషయంలో నిజమైనా కాకపోయినా మీనాక్షి విషయంలో మాత్రం అది నిజం. నల్లని నొక్కుల జుట్టు పిరుదలవరకూ ఒత్తుగా పెరిగింది. నూనె పూసి ఎంత బిగించి జడవేసుకున్నాకూడా జడలోంచి తప్పించుకుని ఉంగరాలు నుదుటిమీదా, చెంపలమీదా ఆడుకుంటూ ఉంటాయి. చామనఛాయ అయినా నిగనిగ మెరవడం వల్ల జామపండులా ఉండేది ఆమె ఒళ్ళు. దాదాపు తండ్రి అంత పొడుగు అయింది. అయిదడుగుల అయిదున్నర అంగుళాలు. ఆ పొడుక్కి తగ్గ లావు. అందమైన బట్టలు వేసుకునేది. చక్రవర్తి తన కూతురిని చూసి తనే ఆశ్చర్యపోయేవాడు. మీనాక్షికి పదహారేళ్ళేననీ చిన్నపిల్లేననీ ఎన్నిసార్లు తనకి తను చెప్పుకున్నా మీనాక్షిని చూడగానే కూతురికి ఇక పెళ్ళి విషయం ఆలోచించాలని అనేవాడు. పదహారేళ్ళ మీనాక్షి పద్దెనిమిదేళ్ళ పిల్లలా కనపడేది.

"మీనా!" అని పిలిచాడు చక్రవర్తి స్కూలు ఫైనల్ పరీక్షా ఫలితాలు వచ్చిన వారం రోజులకి.

"ఆ!" అన్నది మీనాక్షి వంట ఇంట్లోంచి వస్తూ.

"ఏం చేస్తున్నావు?"

"కూర తరుగుతున్నాను"

"చెయ్యి కోసుకుంటావు వద్దని చెప్పలేదూ!"

"నువ్వు ఏదో ఆలోచిస్తూ కూర్చున్నావు. నీకు ఆఫీసుకి ఆలస్యం అవుతుందని.." అన్నది మీనాక్షి నవ్వుతూ.

"చెపితే నే వచ్చి తరిగే వాణ్ణిగా! అయినా నేను ఇవాళ ఆఫీసుకి వెళ్ళడం లేదు."

"ఎందుకు?"

చక్రవర్తి నవ్వి "బెజవాడనుంచి సుబ్బారావుగారు వస్తున్నారు" అన్నాడు.

"ఎవరా సుబ్బారావుగారు?"

"మీ అమ్మ తరపు బంధువు. చాలా దూరపు బంధువులే, వరసకి నీకు మామ అవుతాడు"

"ఆయన వస్తే నువ్వు ఆఫీసు మానెయ్యడం దేనికి?"

"నాతో మాట్లాడడానికీ, నిన్ను చూడడానికి?" ఇంతదూరం వస్తున్నాడు ఆయన.

"నన్ను చూడడానికా?" అడిగింది ఆశ్చర్యంతో.

చక్రవర్తి మళ్ళీ నవ్వాడు "అవును. ఆయనకి ముగ్గురు కొడుకులు. పెద్దవాడు పి.డబ్ల్యు.డిలో ఇంజనీర్. పెళ్ళయి రెండేళ్ళయింది. రెండోవాడు రేడియో ఇంజనీర్. పేరు ముకుందరావు. రెండు నెలల క్రితమే గవర్నమెంటు ఉద్యోగం అయింది. నూట ఇరవై జీతం. ఇరవై రెండేళ్ళు కుర్రాడికి" అని చెప్పాడు.

మీనాక్షి మౌనంగా ఉండిపోయింది.

"ఏమిటమ్మా! మాట్లాడవేం?" అన్నాడు తండ్రి.

మీనాక్షి తండ్రిని విసుగ్గా చూసింది.

"చెప్పమ్మా! ఏమిటి సందేహిస్తున్నావు?"

"నాకు చదువుకోవాలని ఉంది" అన్నది మీనాక్షి. ముక్తసరిగా.

"అంటే? పెళ్ళిచేసుకోనంటావా?"

"ఇప్పుడు వద్దు." అనేసి మీనాక్షి అక్కడినుంచి వెళ్ళిపోయింది ఇక ఆ విషయం చర్చించవలసిన అవసరం లేదన్నట్లు.

చక్రవర్తి పదినిమిషాలు కూర్చున్నాడు. అతని సమస్యలు అతనివి. అతనికి యాభై రెండేళ్ళు ఇంకా మూడేళ్ళు సర్వీసున్నది. దాదాపు ఎనిమిది వేలరూపాయలు సేవింగ్స్‌బాంక్‌లో వేశాడు. మీనాక్షి పెళ్ళికోసమే కూడపెట్టాడు. కట్నం ఇవ్వనిదే మంచి సంబంధం దొరకదని తెలుసు. అయిదువేల రూపాయలు కట్నం ఇవ్వడానికి నిశ్చయించుకున్నాడు. మిగతా మూడువేలూ పెళ్ళికి ఖర్చు చెయ్యాలని అనుకున్నాడు.

అంతేకాదు మూడు నెలలకీ, ఆరు నెలలకీ ఇంకో ఊరుకి బదిలీ అవుతుంటాడు. ఈడొచ్చిన పిల్లని వెంటపెట్టుకుని తిరగడమూ; ఇంట్లో ఒంటిగా వదిలి తను ఆఫీసుకి వెళ్ళడమూ; ఇంట్లో ఒంటిగా వదిలి తను ఆఫీసుకి వెళ్ళడమూ అతనికి అసలు ఇష్టం లేదు. ఈ సమస్యలన్నిటికి పరిష్కార మార్గం మీనాక్షికి పెళ్ళిచెయ్యడమేననీ, తను రిటయిర్ అయిన తర్వాత, మీనాక్షి, ఇంట్లోనే ఉండవచ్చనీ అనుకున్నాడు.

ఇప్పుడు మీనాక్షి ఇలా అంటోంది. ఏం చెయ్యాలి ఆలోచిస్తున్నాడు.

వంట ఇంట్లోకి వెళ్ళి కూర కలియపెడుతూ మీనాక్షి ఈ విషయమే ఆలోచిస్తోంది. అనాలోచితంగా, తొందరపడి తను తండ్రికి అలా చెప్పలేదు. చదువుకోవాలనీ, చదువుకుని ఉద్యోగం చెయ్యాలనీ, ఆడదానికి ఆర్థిక స్వాతంత్ర్యం ఉండాలనీ, అప్పుడే భర్తతో సమానంగా సంసారం గడువుకు రావచ్చనీ, జీవన వ్యయం పెచ్చు పెరిగిపోయిన రోజుల్లో భార్యా భర్తలు ఇద్దరూ సంపాదిస్తేనే కాని బతకడం కష్టం అనీ మీనాక్షి అభిప్రాయం. ఈ అభిప్రాయాలన్నీ తనంతట తను ఆలోచించుకుని ఏర్పరుచుకున్నవి కావు. తనతో చదువుకుంటున్న పిల్లలతో చర్చించిన ఫలితంగా ఏర్పడిన అభిప్రాయాలు కొన్ని, పత్రికలలో చదివి ఏర్పరుచుకున్న అభిప్రాయాలు కొన్ని, ఉపన్యాసాలు విని తెలుసుకున్నవి మరికొన్ని.

"మీనాక్షీ! మీనా!" అని తండ్రి పిలవగానే మీనాక్షి కూరపొయ్యి మీదనుంచి దింపేసి హాల్లోకి వెళ్ళింది.

"అలా అనేసి వెళ్ళిపోయావేం అమ్మా!"

"అవును నాన్నా! నాకు చదువుకోవాలని ఉంది."

"ఏం చదవాలని ఉంది?"

"బి.ఏ పూర్తి చేస్తాను. తర్వాత వీలుంటే ఎం.ఏ చదువుతాను"

"అబ్బో చాలా పెద్ద ఆలోచనే.." అన్నాడు చక్రవర్తి.

మీనాక్షి నవ్వింది.

"ఎందుకమ్మా? చదివి ఏం చేస్తావు? ఉద్యోగం చేస్తావా?" అడిగాడు

మీనాక్షి తల ఊపింది.

"మరి పెళ్ళి! పెళ్ళి చేసుకోవూ?"

"ఏమో చేసుకుంటానేమో! అదంతా తరవాత"

"తర్వాత అంటే! ఈడు దాటిపోతే పెళ్ళికావడం ఎంత కష్టమో నీకు తెలియదు."

"అవును. నాకు తెలియదు నిజమే. కాని ఇప్పుడు పెళ్ళి చేసుకుంటే బతుకు ఎంత కష్టంగా ఉంటుందో బాగా తెలుసు"

"అదేమిటి? పెళ్ళిచేసుకుంటే బతుకు కష్టంగా ఎందుకు ఉంటుంది.?"

"నూట ఇరవైరూపాయల జీతంతో ఈ రోజుల్లో ఇల్లు ఎలా గడుస్తుంది నాన్నా? ఇద్దరో ముగ్గురో పిల్లలు కూడా పుడితే ఎలా ఉంటుందో ఆలోచించు!"

చక్రవర్తి నవ్వాడు "ప్రపంచం అంతా అనుభవంతో కాచి వడపోసినట్లు మాట్లాడుతున్నావు!" అన్నాడు.

మీనాక్షి కూడా నవ్వి "డబ్బు గురించి తెలుసుకునేందుకు అంత అనుభవం అవసరం!" అన్నది.

"నేను ఊళ్ళూళ్ళు తిరుగుతూ ఉంటాను కదా! నువ్వు కాలేజీలో ఎలా చదువుతావు?"

"హాస్టల్లో ఉంటాను"

"అంతా ఆలోచించి పెట్టేసుకున్నావన్నమాట నేను హోటలు తిండి తింటూ - నువ్వు హాస్టల్ తిండి తింటూ -"

"ఇక మూడేళ్ళేగా సర్వీస్ - తర్వాత నువ్వు మద్రాస్ వచ్చెయ్యొచ్చు"

చక్రవర్తి ఆలోచిస్తున్నాడు.

"ఏమిటి నాన్నా ఆలోచిస్తున్నావు? డబ్బు విషయమా? హాస్టల్లో ఉంటే కాలేజీ చదువుకి చాలా డబ్బు అవుతుందనికదూ!"

తలవూపాడు ఆయన.

"పెళ్ళికోసం నువ్వు దాచి పెట్టిన డబ్బున్నదిగా! అంత చదువు చదివాక కూడా కట్నం ఇచ్చే వరుణ్ణి తెచ్చుకోవలసి ఉంటుందా!"

తను పెద్ద చదువు చదువుకోలేదు. తన కూతురయినా పెద్ద చదువు చదువుకోవాలనీ, పెద్ద ఉద్యోగం చెయ్యాలనీ చక్రవర్తికి లోపల ఉన్న కోర్కె అతన్ని ఒప్పించింది.

## 3

మర్నాడే మద్రాసులో నాలుగు ఆడవాళ్ళ కాలేజీలకి అప్లికేషన్స్ వేశాడు చక్రవర్తి మీనాక్షికి సీటుకోసం. వారం రోజులలో రెండు కాలేజీల నుంచి సీటు ఇచ్చినట్లు, వెంటనే వచ్చి జీతం కట్టి చేరమనీ ఉత్తరాలు వచ్చాయి. ఉత్తరాలు వచ్చిన మర్నాడే చక్రవర్తి కూతుర్ని వెంట పెట్టుకుని మద్రాసుకి బయలుదేరాడు. నైవేలీ నుంచి మద్రాసుకి ఒకరాత్రి ప్రయాణం, ఆ రాత్రంతా ఆ తండ్రీ, కూతురూ నిద్రపోలేదు. హాస్టల్ భోజనం మీనాక్షికి పడుతుందోలేదో, ఒంటిగా ఉండగలదో లేదో, జబ్బు చేస్తే హాస్టల్లో సరిగా చూసుకుంటారో లేదో ఇలాటి భయాలతో అతను కన్నుమెయ్యలేదు.

మీనాక్షి ఎక్సయిట్‌మెంట్‌తో నిద్రపోలేదు. హోటల్లో దిగారు. పదిగంటలకి కాలేజీకి వెళ్ళారు హాస్టల్‌కీ, కాలేజీకి డబ్బు కట్టాడు చక్రవర్తి తర్వాత బజారుకి తీసుకెళ్ళి చీరలు, పరికిణీలు, తువ్వాళ్ళు, దుప్పట్లు, ఇంకా కావలసిన బట్టలు కొన్నాడు.. కూతుర్ని సాయంకాలం నాలుగు గంటలకి హాస్టల్లో దింపి, యాభై రూపాయలు ఇచ్చి "నీకు కావలసినవి కొనుక్కో. పళ్ళు, బిస్కట్లు కొని తెచ్చిపెట్టుకో. డబ్బు ఖర్చు అవుతుందని వెనకాడకు తెలిసిందా! నీకు బెంగగా ఉంటే ఒక కార్డు రాయి. వచ్చి చూసి వెళతాను." అని ఇరవై కార్డులు, ఇరవై ఇన్‌లాండ్ కవర్లు ఇచ్చాడు. హాస్టల్ మ్యాట్రన్‌ని కలుసుకుని "కాస్త జాగ్రత్తగా చూసుకోండి! ఒక్కతే కూతురు గారాబంగా పెంచాను" అని మరీ మరీ చెప్పాడు.

ఓ వారం రోజులు మీనాక్షికి ఆ హాస్టల్ వాతావరణం క్రొత్తగా ఉంది. రకరకాల వేషాలు వేసుకున్న ఆడపిల్లలు; ఇంగ్లీషులో తప్ప ఇంకో భాషలో మాట్లాడని ఆడపిల్లలు; నవ్వుతూ, గెంతుతూ, ఉషారుగా తిరిగే ఆడపిల్లలు; రెండు వందలమంది ఒకసారిగా కలిసి కూర్చుని భోజనం చెయ్యడం; "నువ్వు అన్నం తిన్నావా! నీళ్ళుపోసుకున్నావా!" అని అడిగేవాళ్ళు లేకపోవడం అవన్నీ కొత్తగా ఉన్నాయి. ఒక రకమైన స్వతంత్రంతో పాటు కొన్ని బాధ్యతలు కూడా వచ్చాయి.

మీనాక్షి స్వతహాగా కలుపుగోలు మనిషి. దానికి తోడు ఇట్టే స్నేహం చేసుకునే చాకచక్యం బాగా ఉన్నది. తనతో పాటు ఒకే రూంలో ఉన్న మళయాళీ అమ్మాయి రూపమతితో వారం రోజుల్లో బాగా స్నేహం అయింది. తన చిన్నతనం నుంచీ, తన పదహారేళ్ళ జీవితం జ్ఞాపకమున్నంత వరకూ పూసగుచ్చినట్లు ఆ అమ్మాయికి చెప్పి, ఆ అమ్మాయి సంగతులు అన్ని అడిగి తెలుసుకున్నది.

తను శ్రద్ధగా చదవాలి పరీక్ష పాసవాలి అనే దీక్షతో ఉంది కనక చదువు నిర్లక్ష్యం చేయలేదు. రెండు రోజులకోసారి తండ్రికి ఉత్తరం రాసేది.

నెలరోజుల తరువాత కూతురుని చూడకుండా ఉండలేక చక్రవర్తి మద్రాసుకి వచ్చాడు. నవ్వుతూ, కళకళలాడుతూ ఉన్న మీనాక్షిని చూసి తృప్తిపడి వెళ్ళిపోయాడు.

****

మీనాక్షి ఫస్ట్‌క్లాసులో పి.యు.సి పాసయింది. మీనాక్షికన్నా ఆమె తండ్రి ఎక్కువ గర్వపడ్డాడు. శెలవలు అవగానే మళ్ళా మద్రాసుకి వెళ్ళి బి.ఎలో చేరింది మీనాక్షి.

చక్రవర్తికి నైవేలీ నుంచి మధురకి ట్రాన్స్‌ఫర్ అయింది. అతను ప్రతివారం కూతురికి ఉత్తరం రాసేవాడు. ప్రతివారం మీనాక్షి తండ్రికి ఉత్తరం రాసేది. క్రితం ఏడాది అంతా తనతోపాటు ఒకే గదిలో ఉన్న రూపమతి తల్లితండ్రులు మద్రాసుకి వచ్చి కాపరం పెట్టారు. రూపమతికీ, మీనాక్షికీ ఆ ఏడాదిలో చాలా స్నేహం ఐంది. - అపేక్ష పెరిగింది. అందువల్లే ప్రతీ శని, ఆదివారాలు రూపమతి మీనాక్షిని తన ఇంటికి తీసుకెళ్ళేది. ఇద్దరూ కలిసి సినిమాలకి, షికార్లకీ వెళ్ళేవాళ్ళు. రూపమతి బాగా ధైర్యమూ, చొరవా ఉన్న మనిషి - మొగాళ్ళంటే భయంలేదు.

మీనాక్షి, రూపమతీ బీచ్ రోడ్ మీద నడుస్తున్నప్పుడు ఒకసారి ఓ కుర్రాడు వాళ్ళిద్దరి ప్రక్కనుంచీ ఈల వేసుకుంటూ రెండుసార్లు వెళ్ళాడు.

"ఈసారి వాడు ఇటు వస్తే వాడికి బుద్ధి చెపుతాను చూడు!" అన్నది రూపమతి.

"ఏం చేస్తావేమిటి?" అడిగింది మీనాక్షి నవ్వుతూ.

"చూస్తావుగా!" అని రూపమతి అంటూండగానే ఆ కుర్రాడు వెనక్కి తిరిగివచ్చి, ఈలవేస్తూ, ఈసారి ఇంకా కాస్త ధైర్యం చేసి భుజానికి భుజం రాస్తూ వెళ్ళాడు.  అతను తమని దాటి వెళ్ళేలోపున రూపమతి అతన్ని భుజం పట్టుకుని వెనక్కి తిప్పింది. ఏమీ అడగలేదు. తిట్టలేదు. కోపంగా కూడా చూడలేదు. కాలికున్న హైహీల్ చెప్పుతీసి ఈ దవడా, ఆ దవడా వాయించింది. ఆ కుర్రాడు బెదిరిపోయి, సిగ్గుపడిపోయి, నలుగురూ చేరి తనని చితకబాదుతారని భయపడిపోయి, రూపమతి పట్టు వదిలించుకుని పరుగుతీడాడు మళ్ళీ వెనక్కి చూడకుండా.

రూపమతి విరగబడినవ్వుతూ "రాస్కెల్! మళ్ళీ వాడు ఈ జన్మలో ఆడపిల్లలని అల్లరి చెయ్యడు" అన్నది. మీనాక్షి సిగ్గుపడిపోయింది. నలుగురూ చేరి ఏం జరిగిందని అడిగే సరికి రూపమతి ధైర్యంగా చెప్పింది.

"బాగా చేశావమ్మా! మరీ కుర్రాళ్ళు మితిమీరి పోతున్నారు" అన్నాడు ఒక వృద్ధుడు.

"మరీ చాలా సీరియస్‌గా పనిష్ చేశారు!" అన్నాడు ఇంకో పెద్దమనిషి.

"ఏమిటి రూపా! అలా రాక్షసిలా ప్రవర్తించావు?" అడిగింది మీనాక్షి బస్సు ఎక్కాక.

"ఒంటిగా ఆడవాళ్ళు బయటికి వస్తే ఈగల్లా ముసురుతారు - పోనీ చూసి వెళ్ళపోతే ఫర్వాలేదు, ధైర్యంగా వచ్చి పలకరించినా సంతోషిస్తాను కాని ఈ రౌడీ చేష్టలు నేను భరించలేను" అన్నది రూపమతి. అప్పట్నించీ రూపమతి మీనాక్షికి లోకల్ గార్డియన్‌లా తయారయింది. కాస్త జ్వరమో ఇంకేదయినా సుస్తీ అయినా మీనాక్షికి చేస్తే తనతో ఇంటికి తీసికెళ్ళి తగ్గేటంతవరకూ తన ఇంట్లో అట్టే పెట్టుకునేది. రూపమతి తల్లిదండ్రులు కూడా మీనాక్షిని చాలా ముద్దు చేసేవాళ్ళు.

బి.ఏ. రెండో సంవత్సరం చదువుతుండగా మీనాక్షికి జోసఫ్ పరిచయం అయ్యాడు. రూపమతి బంధువు బాలకృష్ణన్ బి.ఏ. చదువుతున్నాడు. అప్పుడప్పుడు అతను రూపమతి ఇంటికి వస్తుండేవాడు. ఒకటి రెండుసార్లు రూపమతీ, మీనాక్షి అతన్ని తను కూడా సినిమాలకి తీసుకెళ్ళారు.

జోసఫ్ బాలకృష్ణన్ స్నేహితుడు అతను బి.ఏ ఫైనల్ చదువుతున్నాడు. సామాన్యంగా ఇరవైఏళ్ళ కుర్రాళ్ళలో ఉండే కుర్రతనం, చిలిపితనం జోసఫ్‌లో మీనాక్షికి కనిపించలేదు. చాలా హుందాగా కనిపించాడు.

ఎక్కువ మాట్లాడాడు. కాలేజీ పాఠ్య పుస్తకాలు మాత్రమే కాక ఇంకా అనేక విషయాల మీద పుస్తకాలు చదివినట్లు ఆ కొద్ది సంభాషణలోనూ మీనాక్షి గ్రహించింది. నల్లగా, సన్నగా,పొడుగ్గా ఉన్నా అతనిలో విచిత్రమైన ఆకర్షణ కనిపించింది ఆమెకి.

రూపమతి ఇంట్లో హాల్లో కూర్చుని మాట్లాడుతున్నారు నలుగురూ ఓ ఆదివారం. అతను తను చదివిన పుస్తకాల గురించీ, గొప్ప గొప్ప ఇంగ్లీషు రచయితల గురించీ చెప్పాడు. రూపమతి, బాలకృష్ణన్ అతని మాటలు అంత శ్రద్ధగా వినకపోయినా మీనాక్షి రెండు చెవులూ, రెండు కళ్ళూ అతనికి అప్పచెప్పింది.

ఆ పై ఆదివారం కూడా అతను బాలకృష్ణన్‌తో వచ్చాడు రూపమతి ఇంటికి.

"పిక్చర్‌కి వెళదాం?" అన్నది రూపమతి.

"నేను రాను!" అన్నది మీనాక్షి.

"ఎందుకు రావు?" అని రూపమతి అడిగితే మీనాక్షి జవాబు చెప్పలేదు. రూపమతి ఊరుకోలేదు. రెట్టించి అడిగింది.

"పరాయి మొగాళ్ళతో సినిమాలకి వెళ్ళడం నాకు ఇష్టంలేదు" అన్నది మీనాక్షి.

రూపమతి పకపక నవ్వి "వాట్ ఏ విలేజ్ బ్రూట్! పరాయి మొగాళ్ళతో కాక తండ్రితోనో, అన్నదమ్ములతోనో సినిమాలకి వెళితే ఏం బావుంటుంది! అయినా కలిసి సినిమాకి వెళితే ఏం బావుంటుంది! అయినా కలిసి సినిమాకి వెళ్ళినంత మాత్రాన ఏమవుతుంది? పిచ్చి వేషాలు వెయ్యక, పద!" అని బలవంతం చేసి మీనాక్షిని కూడా తీసుకెళ్ళింది.

బాలకృష్ణన్ ఒక చివర్న, జోసఫ్ ఇంకో చివర్న కూర్చున్నారు. జోసఫ్ పక్కన మీనాక్షీ, బాలకృష్ణన్ పక్కన రూపమతి సినిమా చూస్తూ తెగ కబుర్లు చెప్పుకుంటున్నారు. చేతిలో చెయ్యి వేసుకున్నారు కాసేపు; బాలకృష్ణన్‌లా అంత చనువుగా ఎక్కడ ప్రవర్తిస్తాడో అని మీనాక్షి భయపడింది. కాని జోసఫ్ చేతులు కదల్చలేదు.

****

**నలుగురూ సినిమా హాలులోంచి** బయటకి వచ్చి బస్ స్టాప్ వద్ద నిలబడ్డారు.

"ఎలా ఉంది పిక్చర్?" అడిగింది మీనాక్షి రూపమతిని.

"నేను సినిమా సరిగా చూస్తేగా!"

"సినిమా చూడలేదా!" అడిగింది మీనాక్షి ఆశ్చర్యంతో!

"అంతకన్నా ఇంట్రస్టింగా కాలం గడిచింది."

మీనాక్షి మొహం ఎర్రనయింది. ఏమనాలో తోచక "బస్సు వస్తున్నట్లున్నదే!" అన్నది.

"యస్! మన బస్ వచ్చింది" మీనాక్షితో అని "అయితే రేపు పొద్దున్నే ఆరుగంటలకి వస్తారా! గుడ్ గుడ్ నైట్." అన్నది రూపమతి మీనాక్షిని చెయ్యి పట్టుకుని బస్ వైపు తీసికెళుతూ.

బస్ ఎక్కాక అడిగింది మీనాక్షి. "పొద్దున్న ఆరుగంటలకి వస్తారా! ఎందుకు?" అని.

"మనం నలుగురం రేపొద్దున్నే బయలుదేరి ఎన్నూర్‌కి పిక్నిక్‌కి వెళుతున్నాం."

"పిక్నిక్కా? మనం నలుగురమూనా! నీకు మతిపోయిందా?" మీనాక్షి చాలా కోపంగా అడిగింది.

"ఉష్. ఇది బస్. ఇంటికి వెళ్ళి మాట్లాడుదాం" అన్నది రూపమతి.

ఆ రాత్రి దాదాపు ఒంటిగంట వరకూ ఆ స్నేహితురాళ్ళిద్దరూ మాట్లాడుతూనే ఉన్నారు. మర్నాడు పిక్నిక్‌కి వెళ్ళే విషయంతో ప్రారంభమై అసలు స్త్రీ పురుషుల సంబంధ బాంధవ్యాల గురించీ, మన దేశంలో ఆచారాల గురించీ, ఆడవాళ్ళ ఇబ్బందుల గురించీ అన్ని విషయాలూ మాట్లాడుకున్నారు.

"నువ్వు లక్ష చెప్పు! నేను రాను." అన్నది మీనాక్షి.

"స్టుపిడ్‌లా మొడితనం చెయ్యక. పిక్నిక్‌కి వచ్చినంత మాత్రాన ఏమవుతుంది?" అడిగింది రూపమతి.

"పెళ్ళి కానిదాన్ని ఇలా కుర్రాళ్ళతో తిరిగితే చెడ్డపేరు వస్తుంది."

"మీనాక్షీ! నువ్వు చాలా అమాయకురాలివి. మనం బి.ఏలు, ఎం.ఏలు చదివిన తర్వాత కూడా మన తల్లి తండ్రులు వెతికి మనకి పెళ్ళి సంబంధాలు తీసుకురావాలంటావా? ఒకవేళ వాళ్ళు కష్టపడి, వరుళ్ళని వెతికి తెచ్చినా మనకి నచ్చకపోవచ్చు. కనుక మనమే కుర్రాళ్ళతో స్నేహం చేసుకుని, వాళ్ళతో తిరిగి మనకి నచ్చినవాణ్ణి ఏరి పెళ్ళి చేసుకోవాలి!" అన్నది రూపమతి.

"కులాసాగా మనతో తిరిగి తీరా పెళ్ళి విషయం వచ్చాక చల్లగా జారుకుంటారు ఈ మొగాళ్ళు. మనకి చెడ్డపేరు మాత్రం మిగులుతుంది."

"మనం చేతకాని దద్దమ్మలమయితే అలాగే జరుగుతుంది. మొగాడు అంత దగ్గరిగా వచ్చాక, ఒక మగాణ్ణి ఆకర్షించడానికి మనకి అంత అవకాశం దొరికిన తర్వాత ఆ మొగాడు మనల్ని పెళ్ళిచేసుకునేటట్లు చెయ్యకపోతే మనం ఎందుకూ కొరగాని వాళ్ళం అన్నమాట"

"వాళ్ళని ఆకర్షించడం పోయి మనమే ఏ మొగాడి ఆకర్షణలోనో పడి, పాడు పని చేస్తే అప్పుడు తెలుస్తుంది!"

"ఏమిటి పాడు పని? దాన్ని పాడు పని అంటారా! అయితే దాదాపు అందరూ చేస్తూనే ఉన్నారు"

"పెళ్ళి కాకుండా చెయ్యడం పాడు పనే."

"కడుపు వస్తుందన్న భయంవల్ల పాడు పని అంటారు. పెళ్ళికాకుండా చేసినా, పెళ్ళి అయిన తర్వాత చేసినా అంతా ఒకటే. తేడా అల్లా పెళ్ళి అయిన తర్వాత చేస్తే కడుపు వస్తుందనే భయం ఉండదు."

"కడుపు రావడం గురించి కూడా ఆలోచించాలి కదా!"

"జాగ్రత్త పడాలి - అంతే"

మీనాక్షి తల విదిలించింది. "కాదు రూపా, నువు అంటున్నది సరి అయినది కాదని నాకు తెలుసు. పెళ్ళి అయిన తర్వాత భర్తతో పొందే సుఖానికి, పెళ్ళికాకుడా ఇంకో మొగాడితో అనుభవించే సుఖానికి చాలా తేడా ఉంది"

"ఏమిటి ఆ తేడా?"

"పెళ్ళి కాకుండా నైర్మల్యం పోగొట్టుకుంటే రేపు పెళ్ళయిన తర్వాత భర్తని వంచించినట్లు అవుతుంది."

"అదా! వంచించక - ముందే చెప్పెయ్యి."

"ముందుగానే చెపితే ఎవడు చేసుకుంటాడు?"

"ఆడవాళ్ళల్లా మొగాళ్ళు కూడా పెళ్ళి చేసుకునేటంత వరకూ ఎవర్నీ ముట్టుకోకుండా భార్య కోసం కాచుకుంటున్నారని అంటావా!"

"అలా ఉంటున్నారో లేదో నాకు తెలియదు కాని అలా ఉండాలి. అదే సరయిన ప్రవర్తన" అన్నది మీనాక్షి.

"నువ్వు బి.ఏ చదువుతున్న పిల్లలా మాట్లాడడం లేదు. పతివ్రతల కథలు, పురాణాలూ విన్న పల్లెటూరిపిల్ల మల్లే మాట్లాడుతున్నావు."

"మనం చదివే చదువువల్ల మనకి వివేకం, జ్ఞానం, ధర్మం ఇలాటివి ఇంకా ఎక్కువగా తెలుస్తాయని అనుకుంటున్నాను. నీతిరహితంగా బతకడం, అలా బతికే ధైర్యం మనకి కాలేజీ చదువు నేర్పిస్తుందని నేను అనుకోలేదు."

"ఇంతకీ రేపు ఎన్నూర్‌కి రానంటావా?"

"అవును"

"డోంట్ బి సిల్లీ! మొగాళ్ళతో సమానంగా ఉండడం ఈ చదువువల్ల రావాలి! ఇప్పుడు నువ్వు పిక్నిక్‌కి వచ్చినంత మాత్రాన నీకు చెడ్డపేరు రాదు. నీ కన్యత్వంపోదు."

"నేను రాను" అన్నది మీనాక్షి.

రూపమతి మొహం ఎర్రనయింది. "నా కోసం కూడారావా?"

"నీ కోసమా! నీకోసం నేనెందుకు? వాళ్ళతో నువ్వు వెళ్ళు" అడిగింది.

"అమ్మా, నాన్న నన్ను ఒంటిగా వెళ్ళనివ్వరు. నువ్వూ నేనూ కలిసి వెళితే వెళ్ళనిస్తారు."

"ఇద్దరం మానేద్దాం" అన్నది మీనాక్షి.

"నాకు వెళ్ళాలని ఉంది. ప్లీజ్! నా కోసం!" దిగులుగా, జాలిగా ప్రాధేయపడుతూ అడిగింది రూపమతి. అలా ఎన్నడూ మీనాక్షిని అడగలేదు.

"ఇంకెపుడూ ఇలా అడగక ఈ ఒక్కసారి..." మీనాక్షి అనగానే రూపమతి మీనాక్షిని కావలించుకుని "థాంక్స్" అన్నది.

## 4

ఎన్నూరులో ఎన్నో టూరిస్ట్ బంగళాలున్నాయి.

వాటిలో గదులు రోజుకి అయిదురూపాయలకి అద్దెకి ఇస్తారు. కూడా తెచ్చుకున్న బట్టలు ఒక గదిలో పెట్టి నలుగురూ షికారుకి వెళ్ళి ఒక గంట తర్వాత తిరిగి వచ్చారు.

"ఇప్పుడిక ఏం చేద్దాం?" అడిగింది రూపమంతి.

"షికారుకి సాయంకాలం వెళ్ళవలసింది. నిజానికి ఇప్పుడు సముద్ర స్నానం చెయ్యాలి" అన్నాడు జోసఫ్.

"ఇప్పుడు మాత్రం మునిగిపోయిందేమున్నది సముద్ర స్నానికి వెళదాం." అని రూపమతి సముద్రపు ఒడ్డుకి దారితీసింది.

"నేను స్విమ్మింగ్ సూట్ తెచ్చుకుంటాను" అని జోసఫ్ బంగళావైపు వెళ్ళాడు.

"మనం ఎవరం బేతింగ్ సూట్స్ తెచ్చుకోలేదు. ఎలా?" రూపమతి అనగానే "పరికిణీ వెనక్కి లాగి గోచీ పెట్టుకో." అన్నాడు బాలకృష్ణన్.

"యస్! వెరీగుడ్ ఐడియా!" అని సిగ్గు, సంకోచమూ లేకుండా రూపమతి చీరవిప్పి, ఒడ్డున పెట్టి పరికిణీ, బాడీతో నీళ్ళల్లోకి దిగింది. బాలకృష్ణన్ లాగుతో నీళ్ళల్లోకి దూకాడు.

"నువ్వు స్నానం చెయ్యవూ?" అడిగింది రూపమతి నీళ్ళల్లోంచి మీనాక్షిని.

తల విదిలించింది మీనాక్షి. రూపమతిని చూసి సిగ్గుపడిపోయింది.

"మీరు స్నానం చెయ్యరా? అడిగాడు జోసఫ్ మీనాక్షిని. అతని గొంతు వినగానే అదిరిపోయి లేచి నిలబడి అతన్ని చూసి, మరింత సిగ్గుపడి తలవంచుకున్నది. జోసఫ్ గోధుమరంగు స్విమ్మింగ్ సూట్ వేసుకున్నాడు. కండలు తిరిగిన అతని జబ్బలు, నల్లని వెంట్రుకలతో రాళ్ళలా ఉన్న అతని పిక్కలూ, గుబురుగా పెరిగిన వెంట్రుకలతో చర్మం కనిపించని అతని ఛాతీ చూసి ఎర్రనయింది మీనాక్షి మొహం."ఒంటిగా ఇక్కడే కూర్చుంటారా?"

తల ఊపింది మీనాక్షి.

"ఏం తోస్తుంది? నీళ్ళల్లో దిగిన వాళ్ళు రెండు మూడు గంటల వరకూ బయటికి రారు. పోనీ నేను మీకు తోడుగా ఇక్కడ కూర్చుంటాను."

"ఒద్దు అవసరం లేదు."

"ఈదాలని నాకు అంతగా పట్టింపు లేదు."

"ప్లీజ్ - మీరు వెళ్ళండి"

"పోనీ, బంగళాకి వెళ్ళి రెండు పత్రికలు తెచ్చి ఇవ్వనా!? "

"నేను తెచ్చుకుంటాను కావాలనిపిస్తే -" మొహం పైకెత్తి అతన్ని చూడలేకుండా ఉన్నది. కండలు తిరిగిన అతని ఒంటిని చూస్తుంటే తన నరాలు ఎవరో పట్టి గిల్లుతున్నట్లయింది. మీనాక్షి చెంపలు ఎరుపు అతను చూశాడు. తల వంచుకుని మాట్లాడకుండా నీళ్ళల్లోకి వెళ్ళిపోయాడు.

అయిదు నిమిషాల తర్వాత మీనాక్షి తల ఎత్తింది. అతను దూరాన మెడలోతు నీళ్ళల్లో ఉన్నాడు. రూపమతి బాలకృష్ణకోసం కలయచూసింది. ఎక్కడా కనిపించలేదు.

ఎక్కువ ఎండలేదు కాని చల్లగా మాత్రం లేదు. ఇసక వేడెక్కింది. దగ్గర్లో నీడ ఎక్కడయినా ఉందా అని వెతికింది మీనాక్షి. కాస్తదూరంలో ఒక పడవ ఒడ్డున ఇసుకలో ఉన్నది. మీనాక్షి లేచి అక్కడికి వెళ్ళి ఆ పడవ పక్కన నీడలో కూర్చున్నది. రెండుసార్లు జోసఫ్ చెయ్యి ఊపాడు మీనాక్షిని చూసి. మీనాక్షి నవ్వి ఊరుకున్నది. తన నవ్వడం అతనికి కనిపించదని మరిచి పోయింది జోసఫ్ బాగా దూరంగా వెళతాడు ఈదుకుంటూ - మళ్ళీ వెనక్కి వస్తాడు.

"మిస్ మీనాక్షి" అని కేకేశాడు ఒకసారి బాగా దగ్గరికి వచ్చి.

మీనాక్షి లేచి నిలుచున్నది.

"వాళ్ళు ఏరీ? కనిపించరేం?" అడిగాడు.

"ఏమో! నాకు తెలియదు"

"బంగళాకి వెళ్ళిపోయారా?" అడిగాడు మోకాళ్ళలోతు నీళ్ళల్లో నిలబడి

మీనాక్షి చటుక్కున వెనక్కి తిరిగి "నేను చూసి వస్తాను" అని బంగళావైపు పరిగెత్తింది. బంగళావరకూ ఆగకుండా పరిగెత్తింది.

"ఏమమ్మా! ఏమైంది?" అని బంగళా వాచ్‌మన్ అడిగేటప్పటికి "ఏమీలేదు. ఊరికినే పరిగెత్తాను. " అని గడియవైపు చూసింది. తలుపు వేసి ఉంది. తాళం లేదు. రూపమతి వచ్చి బట్టలు మార్చుకుంటూ ఉండాలి అనుకుని తలుపు తట్టింది.

"ఎవరు?" అడిగింది రూపమతి.

"నేనే. మీరు అక్కడ కనిపించక పోయేటప్పటికి ఏమైనారా అని వచ్చాను."

రూపమతి నవ్వి "క్షేమంగానే ఉన్నాము. నువ్వు వెళ్ళి సముద్రంలో స్నానం చేయరాదూ?" అన్నది. తలుపు తీయదలచుకోలేదని మీనాక్షి గ్రహించి వెనక్కి తిరిగింది. బాలకృష్ణన్ కూడా గదిలో ఉన్నాడా అనే సంశయం కలిగినా ఆ ఆలోచన రానివ్వలేదు. నెమ్మదిగా సముద్రపు ఒడ్డుకి వెళ్ళింది. దూరాన్నించి జోసఫ్ మీనాక్షి రావడం చూసి, నీళ్ళల్లో పడుకుని "ఏమయారు?" కేకేశాడు.

"రూప గదిలో ఉంది."

"బాలకృష్ణన్?"

"తెలియదు."

"రూప ఒక్కతే ఉందా గదిలో?"

"అదీ తెలియదు." అన్నది మీనాక్షి విసుగ్గా.

సూర్యుడు పైకి ఎగబాకుతున్న కొద్దీ పడవ పక్కన ఉన్న నీడ తగ్గిపోతోంది. ఎండ ఎక్కువ అవుతోంది. మీనాక్షికి ఒళ్ళు చిటపటమంటున్నది.

"ఇక నేను వచ్చేస్తున్నాను ఇదు నిముషాలలో. మీరు వెళ్ళి, రూపని త్వరగా డ్రెస్ చేసుకోమని చెప్పండి" అని అరిచాడు జోసఫ్.

తను నీళ్ళల్లోంచి బయటికి వస్తే మరీ సిగ్గుపడిపోతుందని గ్రహించి ఆమెని వెళ్ళమని సూచించాడు. మీనాక్షి బంగళావైపు వెళ్ళింది కాని గది ప్రాంతాలకి వెళ్ళలేదు. తనే ఏదో తప్పు పనిచేస్తున్నట్లు అనిపిస్తోంది. బంగళా వెనక ఉన్న కొబ్బరి చెట్ల కిందకి వెళ్ళి నిలుచున్నది.

పదిహేను నిమిషాల తర్వాత గదివైపు చూసింది. తలుపు తెరిచి ఉండటం గమనించి ముందుకి కదిలింది ధైర్యంగా.

బాలకృష్ణ, రూపమతి మంచం మీద చెరొకవైపూ కూర్చునున్నారు. జోసఫ్ బట్టలు వేసుకుని, తల తుడుచుకుంటున్నాడు.

"ఎక్కడికి వెళ్ళావు? ఆకలేస్తోంది, నీకోసమే కాచుకున్నాం" అన్నది రూపమతి.

"అలా తిరుగుతున్నాను" అని మీనాక్షి బుట్టలు తెచ్చి బల్లమీద పెట్టింది. టొమాటో సాండ్ విచెస్, చపాతీలు, ఉర్లగడ్డకూర, హల్వా, అరటిపళ్ళు తెచ్చుకున్నారు. నలుగురూ ఆకలి మీద ఉన్నారు - ఆవురావురున తిన్నారు. కాగితాలూ చుట్టి బయట పారేసి చేతులు కడుక్కుని వచ్చాక మొగాళ్ళిద్దరూ సిగిరెట్లు వెలిగించారు.

"మేము మొగాళ్ళం అలా తోటలోకి వెళ్ళి చెట్టుక్రింద పడుకుంటాం - మీరిద్దరూ విశ్రాంతి తీసుకోండి!" అన్నాడు జోసఫ్.

"ఎందుకు మీరూ ఇక్కడే పడుకోండి" అన్నది రూపమతి.

"ఒద్దు. మిస్ మీనాక్షి రిలాక్స్ కాదు" అని జోసఫ్ బాలకృష్ణన్‌ని లాక్కుని వెళ్ళిపోయాడు.

రూపమతి తలుపు దగ్గరికి వేసివచ్చి పడుకున్నది. మీనాక్షి కళ్ళు మూసుకుంది.

"నిద్రా?" అడిగింది రూపమతి.

తల ఊపింది మీనాక్షి.

"నీకో శుభవార్త చెప్పనా?"

మళ్ళీ తలూపింది మీనాక్షి.

"బాలా, నేనూ పెళ్ళి చేసుకోబోతున్నాం."

"నిజంగానా! ఎప్పుడు నిశ్చయించుకున్నారు?"

"ఇందాక అడిగాడు - బి.ఏ పూర్తికాగానే చేసుకుంటాము."

"మీ అమ్మకీ నాన్నకీ ఇష్టమేనా?"

"ఎందుకు ఇష్టంలేదు - అయినా ఇప్పుడప్పుడే చెప్పను. నువ్వూ చెప్పవద్దు."

"ఏం?"

"ఇంకా దాదాపు రెండేళ్ళ వ్యవధి ఉందిగా ఇప్పుడే చెప్పడం దేనికి? అన్నట్లు జోసెఫ్‌కి నువ్వు అంటే చాలా ఇష్టం"

"ఛీ ఊరుకో"

"ఛ ఏమిటి? అతనికేం తక్కువ. బి.ఏ చదువుతున్నాడు. వాళ్ళ నాన్న డాక్టర్. వాళ్ళ అమ్మ గరల్స్ స్కూల్లో హెడ్ మిస్ట్రెస్. జోసెఫ్ రెండు కళ్ళూ అప్పగించి నిన్ను ఎలా చూస్తున్నాడో గమనించావా? నువ్వు ఎటుకదిలితే అటు తిప్పుతాడు కళ్ళు."

"ఊరుకో రూపా! అతను క్రిస్టియన్."

"అయితే నేం? అతనూ మనిషేగా? నువ్వు శ్రీకృష్ణుణ్ణి, శ్రీరాముణ్ణి దేవుళ్ళుగా భావించినట్లు, క్రయిస్టు భక్తుడు అతను. అంతే. మత బేధం పాటించేటంత సంకుచితమైన మనస్సు నీది అనుకోలేదే? " అన్నది రూప.

"సంకుచితమా, విశాలమా నా దృక్పథం అనికాదు సమస్య. అది అయినా అంతవరకూ ఆలోచించలేదు" అన్నది మీనాక్షి.

"అతను నల్లగా ఉన్నాడేమో?" అడిగింది రూపమతి.

మీనాక్షి నవ్వింది. "నువ్వు భర్తని ఏరుకున్నావు కనక త్వరగా నాకూ వరుణ్ణి నిశ్చయించాలని తొందర పడుతున్నావా?" అంది.

"అవును. బి.ఏ పూర్తి కాగానే ఏం చెయ్యాలనే సమస్య ఉండకూడదు. వరుడు రెడీగా ఉండాలి."

"అబ్బబ్బ నువ్వు రెడీగా తయారు చేసుకున్నావుగా చాలు"

"నేను చెప్పే మాటవిను. ఆ జోసెఫ్ చాలా మంచివాడు, చాలా తెలివైనవాడు. బాగా వృద్ధిలోకి వస్తాడు."

"క్రిస్టియన్ని పెళ్ళి చేసుకుంటానంటే మా నాన్న పరిగెత్తుకు వచ్చి, నన్ను చదువు మానిపించి, ఇంటికి తీసికెళ్ళిపోతాడు."

"ఏం మీ నాన్నకి క్రిస్టియన్స్ అంటే అంత భయమా?"

"నా పెళ్ళి విషయం ఇప్పుడెందుకు కాని నీ పెళ్ళి విషయం మాట్లాడుదాం" అని మాటల ధోరణి మార్చింది మీనాక్షి.

మూడు గంటల వరకూ విశ్రాంతి తీసుకుని, తర్వాత నలుగురూ అక్కడే ఉన్న హోటల్ కి వెళ్ళి, కాఫీ తాగి పడవ షికారుకి వెళ్ళారు. చీకటి పడుతుండగా మద్రాసుకి బయలుదేరారు.

"నెలకొకసారి అయినా మనం ఇలా పిక్నిక్‌కి వెళుతుండాలి" అన్నది రూప.

"చదువు అక్కర్లేదా ఏమిటి?" అన్నది మీనాక్షి.

"శని ఆదివారాలు ఏం చదువుకుంటాము?" అన్నాడు బాలకృష్ణ.

"చూద్దాంలే" అన్నది మీనాక్షి. కాని మనస్సులో నిశ్చయించుకున్నది మళ్ళీ ఇలా పిక్నిక్ కి వెళ్ళకూడదని. తను జోసెఫ్ సముద్రపు ఒడ్డున ఉండగా రూపా, బాలకృష్ణ బంగళాలో గది తలుపు వేసుకుని కొన్ని గంటలు గడిపారనే విషయం మరచిపోలేదు. రెండు మూడు సార్లు అడుగుదామని నోటి చివరవరకూ వచ్చి, తనకెందుకని ఊరుకున్నది. తను కూడా ఉండబట్టి రూప తల్లిదండ్రులు, రూపని పిక్నిక్కి వెళ్ళనిచ్చారని మీనాక్షి మరచిపోలేదు. ఒకర్నొకరు జాగ్రత్తగా కాపాడుకుంటారనే నమ్మకంతో వెళ్ళనిచ్చారు. తను రూపని కాపాడలేకపోయాననే చింతతో కుంగిపోయింది. రూప ఇలా తప్పుపని చెయ్యడానికి, తనకై తను మళ్ళీ ఇంకోసారి అవకాశం ఇవ్వదలచుకోలేదు. అందుకే ఆ పై ఆదివారం రూప ఇంటికి వెళ్ళినపుడు బీచికి వెళదామని రూప అంటే మీనాక్షి రానన్నది.

"నువ్వు రాకపోతే ఎలా? బాలన్, జోసెఫ్ బీచికి వచ్చి కాచుకుంటారు మనకోసం"

"ఎందుకు?"

"ఎందుకేమిటి? నేను రమ్మన్నాను. గాంధీజీ స్టాట్యూ దగ్గర ఉండమన్నాను సరిగా అయిదున్నరకి."

"నన్ను అడగకుండా ఎందుకు అలా చెప్పావు. నువ్వు వెళ్ళు. నేను హాస్టల్‌కి వెళతాను" అన్నది మీనాక్షి.

"మీనా! నువ్వు చాలా విచిత్రంగా ప్రవర్తిస్తున్నావు. బీచికి వెళ్ళి ఒక గంటో గంటన్నరో వాళ్ళతో కబుర్లు చెప్పుకున్నంత మాత్రాన మనం ఏమీ కాము?"

"ఈసారికి వస్తాను. ఇంకెపుడూ నన్ను అడగకుండా ఇలాటి ఏర్పాట్లు చెయ్యక" అని మీనాక్షి రూపతో బయలుదేరింది కాని ఇద్దరూ హుషారుగా లేరు. మీనాక్షి అకారణంగా తనతో స్నేహం చెడకొట్టుకుంటున్నదని రూపకి కోపం వచ్చింది. బాలన్‌ని కలుసుకోవడానికి తనని రూప ఉపయోగించుకుంటున్నదని మీనాక్షి బాధపడింది. గాంధీ స్టాట్యూ దగ్గిరే నిలుచున్నారు బాలకృష్ణన్, జోసఫ్.

"ఎంతసేపయింది మీరు వచ్చి?" అడిగింది రూప వాళ్ళని.

"పది నిమిషాలయింది -" అన్నాడు బాలకృష్ణన్. ఇసుకలోకి వెళ్ళి కూర్చున్నారు. పావుగంటసేపు ఆ కబుర్లు ఈ కబుర్లు చెప్పుకున్న తర్వాత రూపా, బాలకృష్ణా లేచి నిలుచుని "మేము అలా కాస్త తిరిగి వస్తాం" అన్నారు.

మీనాక్షి మొహం ఇబ్బందిగా పెట్టింది. జోసఫ్‌తో ఒంటిగా అలా బీచ్‌లో కూర్చునుండడం ఆమెకి ఇష్టంలేదు. ఆ విషయం జోసఫ్ గ్రహించి "నేనూ అలా వెళ్ళి సిగిరెట్ పాకెట్ కొనుక్కుని వస్తాను" అని లేచాడు.

"మీనని ఒంటిగా వదిలి అందరం వెళ్ళిపోతే ఎలా?" అన్నది రూప.

జోసఫ్ నవ్వి ఊరుకున్నాడు. "సిగిరెట్స్ నా దగ్గిర ఉన్నాయి - కూర్చోవోయ్! మేం ఇప్పుడే వచ్చేస్తాం" అన్నాడు బాలకృష్ణన్.

జోసఫ్ ఇబ్బంది మీన గమనించి "కూర్చోండి తర్వాత వెళ్ళవచ్చు" అన్నది మర్యాదకి. రూపా, బాలకృష్ణన్ వెళ్ళిపోయారు. మీనాక్షి ఇసకలో డిజైన్లు వేస్తూ తల వంచుకున్నది. జోసఫ్ సముద్రపు నీళ్ళవైపు చూస్తూ మౌనంగా ఉన్నాడు. పది నిమిషాలు గడిచాయి.

"సుండల్ - మొలగపడై - పొటాటో చిప్స్" అంటూ ఒక డబ్బా తీసుకుని వచ్చి వాళ్ళ ముందు పెట్టాడు ఒకతను.

"ఏం కావాలి?" అడిగాడు జోసఫ్.

"నాకేమీ వద్దు."

"మాట్లాడకుండా ఇలా కూర్చోవడం కష్టంగా ఉంది. కనీసం చేతులకి, నోటికీ పని కల్పిస్తే.." అని రెండు చిప్స్ పాకెట్లు కొని ఒకటి మీనాక్షికి ఇచ్చాడు.

"థాంక్స్"

"మీతో ఒక విషయం మాట్లాడుదాం అనుకున్నాను.."

"ఏమిటి?"

"ఎదురుగా ఇలా కూర్చుని మాట్లాడడానికి ధైర్యం చాలదు."

"ఏం! మీకు ధైర్యం తక్కువా?"

"అవును.. కొన్నిటిలో.. నేను చెప్పదలచుకున్న విషయం ఉత్తరం రాశాను"

మీనాక్షి మాట్లాడలేదు.

"ఇస్తాను. చదువుతారా?"

"చదవడానికేం.."

"వెంటనే జవాబు చెప్పనవసరం లేదు" అంటూ జేబులోంచి ఒక గులాబీరంగు కాగితం తీసి ఇచ్చాడు.

ఆ కాగితాన్ని చూడగానే మీనాక్షి గుండె దబదబమన్నది. మడత విప్పింది. జోసఫ్ మళ్ళీ సముద్రం వేపు చూస్తున్నాడు.

**"మీనాక్షీ!**

నువ్వు చదువుకున్నదానివి, సంస్కారం, వివేకం ఉన్నదానివే. నా ఈ ఉత్తరాన్ని అపార్ధం చేసుకోవనీ, నామీద నీకు కోపం రాదనీ నమ్మి రాస్తున్నాను. చిలవలూ పలవలూ కల్పించి పెద్ద ఉత్తరం రాయడం నాకు చేతకాదు. నేను నిన్ను అడగదలుచుకున్న విషయం - నువ్వు నన్ను పెళ్ళి చేసుకుంటావా అని. నా గురించి, నా తల్లితండ్రుల గురించి నీకు తెలుసు కనుక చెప్పనవసరం లేదు.

నన్ను పెళ్ళిచేసుకుంటావా?

ప్రేమతో జోసఫ్."

**మీనాక్షి మొహం ఎర్రనయింది** - ఊపిరి ఎగపీల్చింది. బీచి గాలిలో కూడా ఉక్కిపోతున్నట్టనిపించింది. జోసఫ్ వైపు ఎలా చూడడం! ఎలా చెప్పడం!

అయిదు నిమిషాలు నిశ్శబ్దం - ఉత్తరం మడిచి, చింపేసింది. అతను చూస్తున్నాడా! అర్ధం చేసుకున్నాడా! అతని వంక చూడలేదు.

"జవాబు చెప్పగలవా?" అడిగాడు.

మీనాక్షి తల ఎత్తలేదు. ఇసకలో రాసింది. "సారీ! క్షమించండి!" అని.

ఎందుకు తనని నిరాకరిస్తున్నదని అతను అడగలేదు. ఆ విషయం అసలు ప్రస్తావించలేదు.

## 5

"జోసఫ్ నీతో ఏం మాట్లాడాడు?" అడిగింది రూప ఆ రాత్రి ఇద్దరూ పడుకున్నాక.

"ఏం మాట్లాడలేదు."

"బాలకృష్ణ అలా చెప్పాడేం?"

"ఏం చెప్పాడు?"

"జోసఫ్‌కి నువ్వంటే చాలా ఇష్టమంట." జోసఫ్ ఇచ్చిన ఉత్తరం విషయం చెప్పేసింది.

"నువ్వేమన్నావు?"

తను ఇసకలో ఏం రాసినదీ చెప్పింది.

రూప అమాంతం లేచి కూర్చున్నది. "ఏమిటీ! సారీ అన్నావా! నీకు మతిపోయింది!" అడిగింది కోపంగా

"అవును క్రిష్టియన్ కానట్లయితే -" అని గొణిగింది మీనాక్షి.

"క్రిష్టియన్, ముస్లిం - ఎవరయితేనేం! మంచివాడు; చదువుకున్నవాడు; డబ్బున్నవాడు; తెలివైనవాడు. ఇంతకన్నా యోగ్యుడయిన భర్త నీకు దొరుకుతాడా?"

"దొరకకపోవచ్చు - అయినా క్రిష్టియన్‌ని ఎలా చేసుకుంటాను?"

"ఏం! అతను తన క్రయిస్టుని - నువ్వు నీ శ్రీరాముణ్ణి పూజ చేసుకోవచ్చుగా! క్రయిస్టు అంటే నీకు కోపం లేదుగా!"

"అలా కాదు రూపా! ఇద్దరు మనుష్యులు జీవితాంతం కలసి ఉండదలుచుకున్నపుడు."

"నాన్సెన్స్! నా మటుకు నాకు క్రయిస్టుకీ, శ్రీరాముడికీ, ఏ దేవుడికీ తేడా తెలియదు. అందరూ దేవుళ్ళే. ఏ మతమైనా ఒకటే చెడ్డపని చెయ్యమని ఏ మతం వాళ్ళూ ప్రభోదించరు. ప్రేమ దయ, ధర్మము, సహనమూ - ఇవే అన్ని మతాలూ చెప్పేది. జోసఫ్ క్రిష్టియన్ అని అతన్ని నువ్వు తిరస్కరించడం చాలా అవివేకం మీనాక్షీ తరువాత చాలా చింతిస్తావు."

"మతాలని గురించి చర్చించే యోగ్యత నాకు లేదు. అది చాలా పెద్ద విషయం" అన్నది మీనాక్షి.

"పోనీ మనుష్యులని గురించి చర్చించే యోగ్యత ఉన్నదా! అదీలేదా! జోసఫ్ చాలా మంచివాడు. అతనికి నువ్వు అంటే ఎంత ఇష్టమోఅతని కళ్ళల్లోనే కనిపిస్తుంది."

"చాలు! చాలు! ఇక ఆ విషయం వద్దు" అన్నది మీనాక్షి.

ఆ తర్వాత కూడా మీనాక్షి శని ఆదివారాలు రూపమతి ఇంటికి వెళ్ళేది బాలకృష్ణన్ ఒక్కడు వచ్చేవాడు.

జోసఫ్ రావడం మానేశాడేమని రూపమతి అడిగింది బాలకృష్ణన్‌ని.

అతను భుజాలు చరిచి "సీరియస్ ఫెలో. మీనాక్షికి కనిపించడం ఇష్టంలేదు. చాలా చిన్నపుచ్చుకున్నాడు" అన్నాడు.

బి.ఏ మూడో సంవత్సరంలోకి వచ్చాక మీనాక్షి రూపమతి ఇంటికి తరుచూ వెళ్ళడం మానేసింది శని ఆదివారాలు కూడా చదువుకుంటూ హాస్టల్‌లోనే ఉండేది.

"నిన్న నేనూ, బాలకృష్ణన్ సినిమాకి వెళ్ళాము"

"మొన్న శనివారం, నేనూ అతనూ బీచికి వెళ్ళాం"

ఇలా చెప్పేది రూపమతి మీనాక్షిని సోమవారం కాలేజీలో కలుసుకున్నపుడు.

"నీకు పరీక్ష పాసవ్వాలని లేదా ఏమిటి?" అని మీనాక్షి అడిగితే "తొందరేం" అని నవ్వేది రూపమతి

బి.ఏ పరీక్షలు అయిపోయాయి. చక్రవర్తి సరిగా ఆ సమయానికి రిటైర్ అయి మద్రాసులో సెటిల్ అయ్యాడు.

## 6

శెలవుల్లో రూపమతి తల్లితండ్రులతో కేరళాకి వెళ్ళి పోయింది. స్నేహితురాళ్ళు లేరు మీనాక్షికి. ఏమీ తోచేదికాదు. తనే వంట చేసేది. ఇంటిపనికి కూడా మనిషిని పెట్టుకోలేదు. మీనాక్షీ, ఆమె తండ్రీ ఉంటున్న ఇంట్లో ఇంకో మూడు భాగాలున్నాయి. మేడమీద తెలుగువాళ్ళూ, కిందపక్క భాగంలో అరవవాళ్ళూ ఉండేవాళ్ళు.

"చదువుకున్న పిల్లలాగే కనిపించదు. లక్షణంగా ఒంటినిండా బట్ట; పెద్ద బొట్టు. వంట చేస్తుంది." అని చెప్పుకునే వాళ్ళు చుట్టుపక్కల వాళ్ళు.

చక్రవర్తి జీవితంలో విశ్రాంతి అంటే ఏమిటో తెలిసొచ్చింది మొదటి నెలరోజుల్లోనే. రిటైర్డ్ జీవితానికి అలవాటు పడలేకపోయాడు. తెల్లారే నిద్రలేవలసిన అవసరం లేదు; గబగబ నాలుగు మెతుకులు తిని, ఆఫీసుకి పరిగెత్తవలసిన అవసరమూ అంతకన్నా లేదు. తెల్లారి లేస్తే రోజంతా తీరుబడి ఎలా ఉపయోగించుకోవాలో తెలియక మొదట్లో తికమక పడ్డాడు. రిటయిర్ అయ్యేనాటికి అతనివద్ద పదివేల రూపాయలున్నాయి. నెలకి నలభై రూపాయలు పెన్షన్ వస్తోంది. ఎంత పొదుపుగా వాడినా నెలకి నూటయాభై రూపాయలు కావాలి. నాలుగువేలు తనకోసం దాచుకుని మిగతా డబ్బుతో మీనాక్షికి పెళ్ళిచెయ్యాలని అనుకున్నాడు.

కొంతమంది స్నేహితులకీ, బంధువులకీ ఉత్తరాలు రాశాడు. మీనాక్షికి వరుణ్ణి వెతకమని దినపత్రికలలో ప్రకటనలకి దరఖాస్తులు పెట్టేవాడు. బి.ఏ పరీక్షా ఫలితాలు రాకముందే మీనాక్షి ఇన్‌స్టిట్యూట్‌లో చేరింది టైప్ రైటింగ్ షార్టు హేండే నేర్చుకోవడానికి. బి.ఏ సెకండ్ క్లాస్‌లో పాసయింది. ఉద్యోగం కోసం అప్లికేషన్స్ వేసేది.

"రేపు ఇంటర్వ్యూకి రమ్మని ఉత్తరం వచ్చింది!" అన్నది తండ్రితో మీనాక్షి ఓ రోజున.

"ఎవరు?"

"ఇదుగో!" అని ఉత్తరం తండ్రికి ఇచ్చింది.

మూర్తి అండ్ రా, ఇంజనీరింగ్ కంట్రాక్టర్సు - ఆఫీస్ మేనేజర్ కి పర్సనల్ అసిస్టెంటు ఉద్యోగం.

"జీతం ఎంతట?" అడిగాడు చక్రవర్తి.

"నూటయాభై అని అడ్వర్టయిజ్ మెంటులో వేశారు."

చక్రవర్తి ఉత్తరం మడిచి పెట్టి "ఇప్పుడు నువ్వు ఉద్యోగంలో చేరడం నాకు ఇష్టంలేదు" అన్నాడు.

"ఎందుకని?"

"తర్వాత పెళ్ళి కావడం కష్టం. సంబంధాలు వెతుకుతున్నాను. పెళ్ళి చేసుకో"

"నేను బి.ఏ. చదివిందీ, టైప్ రైటింగ్ నేర్చుకున్నదీ ఎందుకు?"

"కాబోయే నీ భర్తకి ఇష్టమైతే నువ్వు ఉద్యోగం చెయ్యవచ్చు"

"నేను ఉద్యోగం చేసినా ఇష్టమై చేసుకునే మనిషినే చేసుకుంటాను."

"మీనా! చదువుకున్నావు మంచిదే ఇప్పుడూ నువ్వు ఉద్యోగం చేసి సంపాదించవాల్సిన అవసరం లేదు. చెప్పిన మాట విను" అన్నాడు చక్రవర్తి కాస్త సీరియస్‌గా.

మీనాక్షి ఇంటర్ వ్యూకి వెళ్ళలేదు.

**

**"డియర్ సర్!**

మీరు 17 వ తేదీ రాసిన ఉత్తరం అందింది. నా గురించి వివరాలు తెలియచేస్తున్నాను నాకు ముప్పయి నాలుగేళ్ళు. అయిదడుగుల ఆరు అంగుళాల పొడుగు చామనఛాయ. బి.ఏ, బి.ఎల్.పాసయ్యాను. ప్రాక్టీసు చెయ్యడంలేదు. విజయలక్ష్మి మిల్స్‌లో లేబర్ వెల్ ఫేర్ ఆఫీసర్ ఉద్యోగం చేస్తున్నాను. నెలకి రెండువందల రూపాయలు జీతం. ఇద్దరు అన్నలు, ముగ్గురు చెల్లెళ్ళు. అందరూ పెళ్ళిళ్ళయి స్థిరపడిపోయారు. నా తండ్రిగారు, తల్లి, మా పెద్ద అన్నయ్య వద్ద బొంబాయిలో ఉంటున్నారు.

దయచేసి వధువు ఫోటో పంపవలసింది. కట్నం ఎంత ఇస్తారో, ఇంకా ఇతర వివరాలు వెంటనే తెలియజేయవలసింది.

**రాజారాం"**

కార్డు సైజు ఫోటో పంపిస్తూ చక్రవర్తి వివరంగా ఉత్తరం రాశాడు. రెండురోజుల తర్వాత 28వ తేదీ వధువుని చూడడానికి వస్తున్నానని జవాబు వచ్చింది. పెళ్ళి చేసుకుని తర్వాత భర్త అనుమతితోనే ఉద్యోగం చెయ్యవచ్చుననే తండ్రి సూచన అంగీకరించడం వల్ల మీనాక్షి కూడా ఉత్సాహంతో ఆవేళ ఇల్లంతా సర్ది పదిగంటల్లా ముస్తాబయింది. పదకొండు గంటలకి వచ్చాడు రాజారాం.

"నేనే రాజారాం!" అన్నాడు అతను చక్రవర్తితో.

"కూర్చోండి!" అని చక్రవర్తి మర్యాదగా పలకరించాడు. కాని మనిషిని చూశాక చక్రవర్తి చాలా నీరసించాడు. రాజారాం చాలా లావుగా ఉన్నాడు. అతను రాసినట్లు చామనఛాయ కాదు, బొగ్గు నలుపు. స్ఫోటకం మచ్చలు; బట్టతల; యాభైయేళ్ళ మనిషిలా ఉన్నాడు.

"నాకు శెలవు లేదు. మధ్యాహ్నం రైలులో బెంగుళూరు వెళ్ళాలి" అన్నాడు రాజారాం.

"అమ్మాయిని పిలుస్తాను" అని చక్రవర్తి లోపలికి వెళ్ళాడు.

అప్పటికే మీనాక్షి రాజారాం చూసింది. తండ్రిని చూసి నవ్వింది. చక్రవర్తి కూడా నవ్వి "ఇలా ఉంటాడని అనుకోలేదు. రా! కనిపించి వెళ్ళు." అన్నాడు.

"నేను రాను. నువ్వే ఏదో చెప్పి పంపించి వెయ్యి."

"తప్పమ్మా! కోయంబత్తూరునుంచి వచ్చాడు. కనిపించకుండా పంపించి వెయ్యడం మర్యాదకాదు. రా! తర్వాత నీకు ఇష్టంలేదని ఉత్తరం రాస్తాను" అన్నాడు చక్రవర్తి.

మీనాక్షి హాల్లోకి రాగానే పాదాలనుంచి, తలవరకూ రాజారాం పరీక్షగా చూశాడు. అయిదునిమిషాల తర్వాత లేచి నిలుచుని "వస్తాను. మీకు ఉత్తరం రాస్తాను!" అని వెళ్ళిపోయాడు.

రెండు రోజుల తర్వాత అతన్నించి చక్రవర్తికి ఉత్తరం వచ్చింది. "బెంగుళూరులో ఇంకో పిల్లని చూశాను. ఆ అమ్మాయిని చేసుకోవడానికి నిశ్చయించుకున్నాను. క్షమించవలసింది. రాజారాం" అని క్లుప్తంగా రాశాడు.

"ఇతనికి కూడా ఇంత డిమాండ్ ఉందన్నమాట!" అన్నది మీనాక్షి తను వద్దనడానికి అవకాశం ఇవ్వనందుకు కాస్తంత అవమానంతో.

చక్రవర్తి పత్రికలు చూసి ప్రకటనలకి దరఖాస్తులు పెట్టడం మానలేదు. మీనాక్షి ఉద్యోగాలకి అప్లికేషన్లు వెయ్యడం లేదు. నెలరోజుల తర్వాత మద్రాసులో ఉన్న ఒకతను పెళ్ళి చూపులకి వచ్చాడు. ముప్ఫై ఏళ్ళు బి.ఏ. పాసయి ఎలక్ట్రిసిటీ డిపార్టుమెంటులో గుమాస్తా ఉద్యోగం చేస్తున్నాడు. పాత మాంబళంలో స్వంత ఇల్లున్నది ఎర్రగా, పొడుగ్గా ఉన్నాడు.

"కూర్చోండి!" అని మీనాక్షిని పిలిచాడు చక్రవర్తి.

"ఒక్కతే కూతురు నాకు" అన్నాడు మీనాక్షి కూర్చున్న తర్వాత.

అతను మీనాక్షిని పరీక్షగా చూశాడు అయిదు నిమిషాలు. "తర్వాత చెపుతానని వాయిదా వెయ్యడం నాకు ఇష్టంలేదు. ఇప్పుడే చెప్పేస్తాను. నాకు సమ్మతమే!" అన్నాడు.

చక్రవర్తి బరువుగా ఊపిరి పీల్చి వదిలాడు. మీనాక్షి తల వంచుకున్నది.

"మీ అమ్మాయికి ఇష్టమో లేదో చెపితే మిగతా విషయాలు మాట్లాడవచ్చు" అన్నాడు.

చక్రవర్తి కూతురివైపు చూశాడు. నెమ్మదిగా తల ఊపింది మీనాక్షి.

"వివరాలు ఏమున్నాయి? అయిదువేలకన్నా కట్నం ఇవ్వలేను. ఆ విషయం నేను రాశాను. రెండు వేలల్లో పెళ్ళి ముగిస్తాను." అన్నాడు చక్రవర్తి బేరం తప్పదేమో అన్నట్లు.

అతను చెయ్యి విదిలించి 'నొనో! నాకు కట్నం అవసరం లేదు. పెళ్ళికి అంత డబ్బు ఖర్చు చెయ్యవలసిన అవసరమూ లేదు. మీకు ఇష్టమైతే - అది మీ ఇష్టం - నాకు సంబంధం లేదు - మీ అమ్మాయి పేర్న మీకు ఇష్టమొచ్చినంత డబ్బు ఫిక్సెడ్ డిపాజిట్‌లో వెయ్యండి. నాకు నెలకి ఇంటి అద్దె నూటయాభై వస్తుంది. కనుక నా భార్య ఉద్యోగం చెయ్యవలసిన అవసరంలేదు. నా జీతమూ, ఇంటిమీద వచ్చేదీ సరిపోతుంది."

"ఇటువంటి ప్రొగ్రెసివ్ ఐడియాస్ ఉన్న యువకులు చాలా అరుదు" అన్నాడు చక్రవర్తి.

"ఎంత త్వరగా వీలయితే అంత త్వరగా వివాహం ఏర్పాటు చెయ్యండి. నేను ఎవర్నీ సంప్రదించవలసిన అవసరం లేదు." అతను అంటూండగానే చక్రవర్తి కాలెండర్ వైపు చూస్తున్నాడు.

"పెళ్ళికి ఎక్కువ ఖర్చు పెట్టకండి, క్లుప్తంగా కానివ్వండి నేను వస్తాను" అని ఆ యువకుడు లేచాడు. చక్రవర్తి, మీనాక్షి కూడా లేచి నిలుచున్నారు.

"మీతో విడిగా ఒక మాట మాట్లాడాలి అలా వస్తారా?" అన్నాడు అతను.

మీనాక్షి ఉలిక్కిపడి తలెత్తి చూసింది.

"మిమ్మల్ని కాదు. మీ నాన్నగార్ని" అని నవ్వాడు అతను. చక్రవర్తి తువ్వాల భుజం మీద వేసుకుని అతని వెంట వెళ్ళాడు.

తన తండ్రి తనకూడా ఇంట్లోనే ఉండాలనే షరతు అతనికి చెప్పవలసింది. అయినా షరతు ఎందుకు? మనిషి మంచివాడిలా ఉన్నాడు. ఒప్పుకుంటాడు. ఇలా ఆలోచిస్తోంది మీనాక్షి. అయిదునిమిషాల తర్వాత చక్రవర్తి ఇంట్లోకి వచ్చాడు నిట్టూరుస్తూ.

"ఏమిటినాన్నా! ఏమిటి ఆయన మాట్లాడాలన్నది?"

"స్కౌండ్రల్ ముందే చెప్పలేదు ఆ విషయం. అంతా నిశ్చయించాక చివరిగా చెపుతాడు - రోగ్" తిడుతున్నాడు చక్రవర్తి.

"ఎవర్ని నాన్నా తిడుతున్నావు? ఆయన్నే? ఏమన్నాడు" అడిగింది మీనాక్షి ఖంగారుగా.

"వాడికి నాలుగేళ్ళ క్రితం పెళ్ళయిందట"

"ఆ!" అన్నది మీనాక్షి ఆశ్చర్యంలో.

"ఆ అమ్మాయి కాపరానికి రాలేదుట - రానన్నదట - మేనమామ కూతురట!"

"ఎందుకు?"

"ఏదో చెప్పాడు వెధవ. నేను వినిపించుకోలేదు. విడాకులు తీసుకోవడం పెద్దవాళ్ళకి ఇష్టంలేదట. అందుకని ఆ అమ్మాయి ఉత్తరమిచ్చిందట. ఇంకొకర్ని పెళ్ళిచేసుకోవడానికి తనకి ఎటువంటి అభ్యంతరమూ లేదని."

మీనాక్షికి మండిపోయింది "ముందే ఎందుకు చెప్పలేదుట?" అడిగింది.

"ఒకళ్ళని ఒకళ్ళు ఇష్టపడి పెళ్ళివరకూ వచ్చాక చెప్పవచ్చని ఊరుకున్నాడట - అందుకే అంత ఔదార్యంతో కట్నం వద్దనడం."

"ఈడ్చి చెంపమీద కొట్టకపోయావా?"

"అంతపనీ చేసేవాణ్ణే బొత్తిగా వీధిలో నిలుచునుండగా చెప్పాడు."

చక్రవర్తి ఇంకా పత్రికల్లో ప్రకటనలకి ఉత్తరాలు రాస్తూనే ఉన్నాడు. భార్యని పోగొట్టుకున్న ఇద్దరు పిల్లలు తండ్రి ఒకతను పెళ్ళిచూపులకి వస్తానన్నాడు. చక్రవర్తి జవాబు రాయలేదు.

"నాన్నా! ఇక ఉత్తరాలు మానెయ్యి. అడ్డమైన వాళ్ళకి నా ఫోటో పంపడం నాకేమీ బాగాలేదు" అన్నది మీనాక్షి.

"నేను పత్రికలో వరుడు కావాలని ప్రకటన ఇస్తాను." అన్నాడు. తనకి ఎలాగయినా పెళ్ళి చేయాలని తండ్రి నిశ్చయించుకున్నాడని మీనాక్షికి తెలుసు. ఊరుకున్నది. ప్రకటన చేసిన అయిదు రోజుల తర్వాత పత్రిక ఆఫీసు నుంచి ఒక పెద్ద కవరు వచ్చింది అందులో ఇరవై నాలుగు ఉత్తరాలున్నాయి తండ్రి, కూతురూ అన్నీ జాగ్రత్తగా చదివి ఇద్దర్ని ఏరారు. వాళ్ళకి జవాబులు రాశాడు చక్రవర్తి. ఒకతని నుంచి జవాబు రాలేదు. రెండో అతను వెంటనే జవాబు రాశాడు. తనూ మద్రాసులోనే ఉన్నానని - చూడడానికి మర్నాడు సాయంకాలం ఆరుగంటలకి వస్తానని.

మర్నాడు ఏడుగంటల ప్రాంతాల్లో వచ్చాడు.

"నా పేరు శివరావు. నేనే ఇవాళ వస్తానని రాశాను" అన్నాడు.

"ఇల్లు కనుక్కోవడం కష్టమైందా" అడిగాడు చక్రవర్తి.

"అబ్బే టాక్సీ ఎక్కాను. డ్రయివర్ తీసుకువచ్చి దింపాడు" అని కూర్చుని "ఈ అమ్మాయేనా?" అడిగాడు.

చక్రవర్తి తల ఊపాడు. మనిషి లావుగా ఉన్నాడు. చిన్నవాడు. పాతికేళ్ళకి మించి ఉండవు. బి.ఏ పాసయ్యాడు.

"నాకు ఫాదర్, మదర్ లేరు. ప్రస్తుతం నేను ఒక్కణ్ణే ఓ గదిలో ఉంటున్నాను" అన్నాడు సిగరెట్ వెలిగించి. చక్రవర్తికి సిగరెట్ ఇస్తే వద్దన్నాడు.

"ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నారా?" అడిగాడు చక్రవర్తి.

"అబ్బే! ఏదీ నేను డిగ్రీ తీసుకుని రెండేళ్ళేగా అయింది. ఇంకా లైఫ్ ఎంజాయ్ చెయ్యాలని ఉంది"

"ఆస్తి ఉందా? " అడిగాడు చక్రవర్తి.

"అదేం లేదండీ! మా నాన్న ఇన్సూరెన్స్ డబ్బువచ్చింది. దానితో ఇన్నాళ్ళూ గడిపాను. ఇప్పుడు ఆ డబ్బు అయిపోయింది" అని మీనాక్షిని పరీక్షగా చూసి

"మీరు డిగ్రీ తీసుకున్నారా?" అడిగాడు.

మీనాక్షి తల ఊపింది.

"షార్ట్‌హాండ్, టైప్ రైటింగ్ కూడా నేర్చుకున్నారా?"

"అవును."

"వాటిలో పరీక్షలు పాసయ్యారా?"

"ఇంకా రిజల్ట్సు రాలేదు. పరీక్షకి వెళ్ళాను."

"గుడ్ అయితే వెంటనే మీకు ఉద్యోగం దొరుకుతుంది. ఆడవాళ్ళకి చాలా సులభంగా ఉద్యోగాలు దొరుకుతాయి."

"అమ్మాయి ఉద్యోగం చెయ్యడం మీకు అభ్యంతరం లేదన్నమాట!" అన్నాడు నవ్వుతూ.

"మీరు?" అడిగింది మీనాక్షి.

"నేను ఇంకా కొన్నాళ్ళపాటు లైఫ్ ఎంజాయ్ చెయ్యాలి. ఇపుడే ఉద్యోగంలో చేరానంటే తర్వాత ఇక లైఫ్ ఏం చూస్తాను"

"ఎంతకాలం ఎంజాయ్ చెయ్యదలచుకున్నారు?"

"ఏమో? విసుగుపుట్టేంతవరకు"

"ఎంజాయ్ చెయ్యడమంటే ఏం చేస్తారు?" అడిగాడు చక్రవర్తి.

"రెండు క్లబ్బుల్లో మెంబర్‌ని బిలియర్డ్స్, చెస్, పేకాటలో రోజు క్షణంలా గడిచిపోతుంది. ఇక సీజన్ వచ్చిందా అసలు ఆ అయిదు నెలలూ చిటికలో గడిచిపోతాయి." అన్నాడు అతను ఇంకో సిగరెట్ వెలిగించి.

"సీజనా? ఏం సీజన్"

"సారీ! మీకు తెలియదుకదూ? రేస్ సీజన్. గురువారం సాయంకాలం రేస్ పుస్తకం అమ్ముతారు. అది తెస్తే మళ్ళీ ఆదివారం రాత్రి వరకూ మంచినీళ్ళు తాగడానికి కూడా వ్యవధి ఉండదు"

చక్రవర్తికి అరికాలి మంట నెత్తికెక్కింది. "మీరు రేసెస్‌కీ, పేకాటకీ వెళుతుంటే మీ భార్య ఉద్యోగం చేసి సంపాదించి మిమ్మల్ని పోషించాలా?" అన్నాడు.

"యస్ కొంతకాలం. తప్పేముంది. తర్వాత నేను సెటిల్ అయ్యాక ముసలితనం వరకూ సంపాదించి పోషిస్తానుగా."

చక్రవర్తి లేచి నిలుచుని "ఆలోచించి మీకు ఉత్తరం రాస్తానులెండి" అన్నాడు.

"ఆల్‌రైట్ త్వరగా తేల్చుకోండి. ఇంకా రెండు మూడు సంబంధాలున్నాయి. ఏదో ఒకటి ఈ సీజన్‌లోపున నిశ్చయిస్తాను" అని వెళ్ళిపోయాడు.

మీనాక్షి విరగబడి నవ్వడం ప్రారంభించింది.

"ఎందుకు అలా నవ్వుతావు?" అడిగాడు చక్రవర్తి రోషంతో.

"అంతా ఇలాటివాళ్ళే వస్తున్నారెందుకా అని. నాలో ఏదయినా లోపమా?"

చక్రవర్తి కూడా నవ్వి "కాదమ్మా పత్రికల ద్వారా వచ్చే పెళ్ళికొడుకులు ఇలాటివాళ్ళే అనుకుంటాను. అన్ని యోగ్యతలు ఉండి, ఏ వంకా లేని కుర్రాళ్ళకి వెతుక్కుంటూ వచ్చి, పిల్లనిచ్చి వెళ్ళిపోతారు. పత్రికల ప్రకటనల ద్వారా ప్రయత్నించే యువకులకి ఇటువంటి లోపాలు ఏవో ఉంటాయి అందుకేననుకుంటాను పెళ్ళి కాకుండా ఉంటారు"

"అదే వాదన నా విషయంలోనూ వర్తిస్తుందికదూ! పత్రికల ద్వారా మొగుణ్ణి వెతుక్కోవలసి వచ్చిందంటే నాలోనూ ఏదో లోపం ఉండాలిగా?" అన్నది మీనాక్షి నవ్వుతూ.

"నీకు ఇరవై ఏళ్ళు వచ్చాయి. బి.ఏ. పాసయ్యావు. అదే లోపం."

"బి.ఏ పాసవడం లోపమా?"

"ఒక రకంగా ఇబ్బందే. కనీసం బి.ఏ. అయినా పాసయిన అతను దొరకాలి. ముప్పయికి మించి వయస్సు ఉంటే బావుండదు. బి.ఏ పాసయిన కుర్రాళ్ళు ఎందుకు అంతకాలం పెళ్ళికాకుండా ఉంటారు?"

"మొగాళ్ళని మనమే వెతుక్కోవాలి" అన్న రూపమతి మాటలు జ్ఞాపకం వచ్చాయి మీనాక్షికి. "ఇక ఈ ప్రకటనలకి ఉత్తరాలు రాయడం మానేస్తావా?" అన్నది తండ్రితో

"మానేసి?"

"పెళ్ళి విషయం మర్చిపో. నేను ఉద్యోగం చేస్తాను."

"పెళ్ళి చేసుకోకుండా ఎంతకాలం ఇలా ఉంటావు?"

"చూద్దాం - ఎప్పుడన్నా - ఎవరైనా తటస్థపడతారేమో? ఇలా పెళ్ళి పెళ్ళి అని అందరికీ ఉత్తరాలు రాస్తూ నా ఫోటోలు పంపడం నాకు బాగోలేదు."

పత్రికల ప్రకటనలవల్ల వరుడు దొరుకుతాడనే నమ్మకం పోయింది మీనాక్షికీ, చక్రవర్తికీ కూడా. నమ్మకం లేనందువల్ల 'ఊఁ!' అని ఊరుకున్నాడు.

## 7

**రామ్‌గోపాల్ అండ్ కంపెనీ,** కమీషన్ ఏజెంట్సు ఆఫీసులో టైపిస్టు ఉద్యోగం దొరికింది మీనాక్షికి. నూట పదిరూపాయల జీతం. మొదటిరోజు చక్రవర్తి కూతుర్ని జార్జిటవున్‌లో ఆఫీసువరకూ తీసుకెళ్ళి దింపాడు. కూతురు ఆఫీసుకి వెళ్ళడం, తను ఇంట్లో కూర్చునుండడం మొదట్లో చక్రవర్తికి చాలా కష్టంగా ఉండేది. వారం రోజులలో అలవాటయిపోయింది. మీనాక్షి ఆఫీసు నుంచి ఇంటికి వచ్చేటప్పటికి ఆరుగంటలు దాటిపోయేది. చక్రవర్తి వంట చేసేవాడు.

"నేను వచ్చి చేస్తానుగా నాన్నా?"

"ఎందుకు? నేను చేసే పని ఏముంది?" అనేవాడు తండ్రి.

మొదటి నెల జీతం తీసుకువచ్చి గర్వంగా తండ్రికి ఇచ్చింది మీనాక్షి.

"నాకెందుకు! నీ దగ్గరే ఉంచు!" అన్నాడు చక్రవర్తి.

చక్రవర్తికి వచ్చే పెన్షన్, మీనాక్షి జీతమూ కలిసి వాళ్ళిద్దరికీ దాదాపు సరిపోతోంది. బాంకులో నిలవచేసిన డబ్బు తీయవలసిన అవసరం రావడంలేదు. మీనాక్షికి పెళ్ళి కాలేదనే చింత తప్ప చక్రవర్తికి ఇంకే దిగులూ లేదు.

మీనాక్షి పని చేస్తున్న ఆఫీసులో మొత్తం పదిమంది పనిచేస్తున్నారు. జనరల్ మేనజర్‌కి విడిగా గది. యాభై ఏళ్ళ మనిషి. అయిదుగురు పిల్లలు. అప్పుడప్పుడు ఏ సినిమాకో వెళ్ళడానికి అతని భార్యా, పిల్లలూ ఆఫీసుకు వస్తూ ఉంటారు. పి.యు.సి చదువుకున్న కూతురు కూడా ఉంది. మొదటి మూడునెలలూ ఆఫీసులో అంతా సవ్యంగానే జరిగింది. అందరూ చాలా మర్యాదగా చూసేవారు మీనాక్షిని.

"రేపు ఆదివారం కొంచెం పనున్నది. నువ్వు ఆఫీసుకి రా!" అన్నాడు జనరల్ మేనేజర్ భార్గవ మీనాక్షితో ఒక రోజున. మీనాక్షికి ఏ అనుమానమూ కలగలేదు. "సరే నండీ." అన్నది. సరిగా పదిగంటలకల్లా ఆఫీసుకి వెళ్ళింది. ఆఫీసు ఇంకా తెరవలేదు. తాళం చెవులు భార్గవ దగ్గరే ఉంటాయి. మీనాక్షి వీధిలో పది నిముషాలు కాచుకోవాల్సి వచ్చింది.

"నా కన్నా ముందే వచ్చావన్నమాట! అలా ఉండాలి పంక్చువాలిటి!" అంటూ కారు దిగి ఆఫీసు తాళం తెరిచి లోపలికి దారి తీశాడు భార్గవ. రోజూ ఫుల్ సూటులో ఉంటాడు. ఆవేళ పంచ, లాల్చీ తొడుక్కున్నాడు.

తిన్నగా తన గదిలోకి వెళ్ళి మీనాక్షిని కూర్చోమని చెప్పి ఉత్తరాలు డిక్టేట్ చెయ్యడం ప్రారంభించాడు. శ్రద్ధగా ఉత్తరాలు రాసుకుంటోంది షార్ట్ హాండ్ లో మీనాక్షి ఉన్నట్లుండి, అతను డిక్టేట్ చెయ్యడం మానేసి "నీ కెన్నేళ్ళు?" అని అడిగాడు.

"ఇరవై ఒకటి."

"ఎందుకు పెళ్ళిచేసుకోలేదు?"

"ఎవరూ దొరక్క" అని చెప్పాలనిపించింది మీనాక్షికి. నవ్వి ఊరుకున్నది.

"వయస్సు వచ్చాక పెళ్ళికాకపోతే కష్టంగా లేదూ!" అడిగాడు. మీనాక్షి మళ్ళీ నవ్వి ఊరుకుంది.

"వయసులో ఉన్నప్పుడు సెక్స్ లైఫ్ లేకపోతే ఆడవాళ్ళు ఎండిపోతారు. త్వరగా ముసలితనం వస్తుంది!" అన్నాడతను.

మీనాక్షికి కాస్త చికాకు కలిగింది. మాట్లాడలేదు.

"నువ్వు చాలా అందమైన పిల్లవి. నీకింకా పెళ్ళికాకపోవడం ఆశ్చర్యమే."

"ఇంతేనా ఉత్తరాలు - ఆఖరిది పూర్తి చెయ్యలేదు" అన్నది మీనాక్షి.

"వాటీజ్ ది హర్రీ! రోజంతా ఉంది."

"నాకు లేదు. ఒక రోజయినా విశ్రాంతి తీసుకోవాలి!"

"రోజంతా నిన్ను టైప్ చెయ్యమంటానా!? నైస్ గా టయిం స్పెండ్ చేద్దాం!" అంటూ కుర్చీలోంచి లేచాడు మీనాక్షి అతన్నే చూస్తూ కూర్చుండిపోయింది. సినిమాల్లో చూసింది ఇటువంటి దృశ్యాలు. కథల్లో చదివింది. అంతే కాని ఇంత ధైర్యంగా మొగాళ్ళు ప్రస్తావిస్తారని అనుకోలేదు. కుర్చీ వెనక్కి వచ్చి ఆమె రెండు భుజాల మీదా చేతులు వేశాడు.

"దయచేసి ఇటువంటి పనులు చెయ్యకండి. మీరు వెళ్ళి మీ కుర్చీలో కూర్చుని డిక్టేట్ చెయ్యడం పూర్తిచేస్తే నేను టైప్ చేసి వెళ్ళిపోతాను."

"సీరియస్ గానా?"

"అవును. చాలా సీరియస్ గా!"

"నీ కిష్టం లేదా?"

"లేదు. నాకు ఇటువంటి ప్రవర్తన ఏ మాత్రం ఇష్టంలేదు."

"దటీజ్ ఏ పిటీ! నైసుగా టయిం స్పెండ్ చెయ్యవచ్చు. నీకు లాభమూ ఉంటుంది."

"ఆ రెండూ వద్దు నాకు!"

"మైడియర్ గరల్! దటీజ్ ఫూలిష్. నీకు వెంటనే యాభైరూపాయలు జీతం పెంచుతాను. కాస్ట్లీ ప్రెజెంట్స్ ఇస్తాను. ఎంత లాభం?"

"నాకు అలా సంపాదించాలని లేదు. ఉంటే ఏ కొంపలోనో చేరేదాన్ని."

"అదీ ఇదీ ఒకటి కాదు. ఇది ఫ్రెండ్షిప్. నువ్వు నాకు కొన్ని పేపర్స్ చూపిస్తే నేను నీకు కొన్ని పేపర్స్ చూపిస్తాను."

"అటువంటి వేమీ అవసరంలేదు. నాకు టైపిస్టుగా వచ్చే జీతం చాలు. దయచేసి ఈ ఉత్తరం ముగించండి!" అన్నది కటువుగా.

"ఆల్ రైట్! " అని వెళ్ళి తన కుర్చీలో కూర్చుని, ఉత్తరం పూర్తిచేసి "ఇవాళ టైపు చెయ్యవలసిన అవసరం లేదు. రేపు చేసి తీసుకురా!" అన్నాడు.

ఒంటిగంటకి ఇంటికి చేరుకున్నది మీనాక్షి. తండ్రికి జరిగినది చెప్పలేదు. ఆ జనరల్ మేనేజర్ ఇక తనపట్ల అలా ప్రవర్తించడు. ఎందుకు గొడవ చెయ్యడం అనుకున్నది.

మర్నాడు ఉత్తరాలు టైప్ చేసి కుర్రాడికిచ్చి భార్గవ గదిలోకి పంపించింది. నిమషం తర్వాత కుర్రాడు వచ్చి మేనేజర్ పిలుస్తున్నారని చెప్పాడు.

"వాటీజ్ దిస్ టైపింగ్. షాబీ వర్క్. ఒళ్ళు దగ్గిర పెట్టుకుని పనిచెయ్యాలి. లెటర్ హెడ్స్ వేస్టు చేస్తున్నావు" అని టైప్ చేసిన ఉత్తరాలు తీసుకుని పరీక్షగా చూసింది మీనాక్షి. ఒక తప్పున్నది ఒక ఉత్తరంలో దాన్ని రబ్బర్‌తో చెరిపి సరిచేసింది. మిగతా రెండు ఉత్తరాల మీద సిరా మరకలున్నాయి. ఎలా వచ్చాయి! బహుశా కుర్రాడు వేసి ఉంటాడు చూసుకోకుండా. కుర్రాణ్ణి పిలిచి అడిగింది తనకేమీ తెలియదన్నాడు మళ్ళీ ఉత్తరాలు టైపు చేసి తనే తీసుకెళ్ళి ఇచ్చింది మేనేజర్‌కి.

"ఇంతసేపు పట్టిందా ఈ మూడు ఉత్తరాలు టైప్ చెయ్యడానికి?" అని అరిచాడు మేనేజర్.

మీనాక్షికి చాలాకోపం వచ్చింది. "నేను ఉద్యోగం మానేసేటట్లు చెయ్యదలుచుకున్నారా?" అడిగింది.

"అంటే? బెదిరిస్తున్నావా! మానెయ్యి. వీధికి నలుగురు టైపిస్టులున్నారు" అన్నాడాయన.

మీనాక్షి తన బల్లదగ్గరికి వచ్చి కూర్చుని ఆలోచించడం ప్రారంభించింది. ఈ మేనేజర్ ఇంక ఇంతే. ఆ కసి పెట్టుకుని తనని ఇలా వేధిస్తాడు. తను ఉద్యోగం మానెయ్యడమే మంచిది. రాజీనామా ఉత్తరం రాసి కుర్రాడికిచ్చి పంపించింది. అరగంట తర్వాత కుర్రాడు ఆమె జీతంలో రావలసిన డబ్బు, వోచరు తెచ్చి ఇచ్చాడు. సంతకం పెట్టి డబ్బు తీసుకుని ఆఫీసులోంచి వెళ్ళిపోయింది మీనాక్షి.

జరిగింది తండ్రికి చెప్పక తప్పలేదు.

"ఎందుకు రిజైన్ చేశావు? కంపెనీ ప్రొప్రయిటర్స్‌కి కంప్లయింటు రాయవలసింది" అన్నాడు చక్రవర్తి.

మీనాక్షి నవ్వి "లాభాలు సంపాదించి పెడుతున్న మేనేజర్ని సమర్థిస్తారా లేక నన్ను సమర్థిస్తారా?" అన్నది.

మళ్ళీ ఉద్యోగాలకి దరఖాస్తులు పెట్టడం ప్రారంభించింది. నెలలోపునే స్టాటిస్టికల్ బ్యూరోలో టైపిస్టుగా ఉద్యోగం దొరికింది. అది ప్రభుత్వపు ఉద్యోగం. నెలకి నూటయాభై రూపాయల జీతం.

## 8

మీనాక్షి ఈ కొత్త ఉద్యోగంలో చేరి సంవత్సరం దాటిపోయింది. ఇంక్రిమెంట్ కూడా వచ్చింది. ఇరవై మూడో ఏడు కూడా వచ్చింది. కూతురుకి ఇక పెళ్ళి అవుతుందనే ఆశపోయింది చక్రవర్తికి. ఆ విషయం ప్రస్తావించడం మానేశాడు.

ఆఫీసులో మీనాక్షితోపాటు ఇంకా పదిమంది ఆడవాళ్ళు పనిచేస్తున్నారు. ముగ్గురికి పెళ్ళయింది. తతిమ్మావాళ్ళు మీనాక్షిలా పెళ్ళికానివాళ్ళు. వాళ్ళల్లో ముప్పయి ఏళ్ళు దాటినవాళ్ళు కూడా ఉన్నారు. వాళ్ళని చూస్తున్నకొద్దీ తనూ అలా పెళ్ళికాకుండా ఉండిపోతానేమో ననిపించేది మీనాక్షికి.

తను ఆ ఉద్యోగంలో చేరిన నాలుగు నెలల తరవాత రమ అనే అమ్మాయి కూడా టైపిస్టుగా చేరింది. దాదాపు తన వయస్సే. సీతాకోక చిలకలా ముస్తాబయి ఆఫీసుకి వచ్చేది. మొగాళ్ళతో చనువుగా, హుషారుగా నవ్వుతూ మాట్లాడేది. నెల తిరిగేలోపున అందరితో స్నేహం చేసుకుంది. ఉద్యోగంలో చేరిన రెండో నెలనుంచీ ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగం చేస్తున్న ప్రసాద్ అనే యువకుడితో తిరగడం

ప్రారంభించింది. ఇద్దరూ కలిసి సినిమాలకి వెళ్ళేవాళ్ళు, బీచికి వెళ్ళేవాళ్ళు. తతిమ్మా ఆడవాళ్ళంతా రమని చూసి నవ్వుకునేవాళ్ళు, గుసగుసల్లో మాట్లాడేవాళ్ళు.

"ఇలాగే తిరిగితే చివరికి ఇబ్బందిలో పడుతుంది!"

"తెగించిన మనిషికి ఇబ్బందేమిటి?"

"వాళ్ళ వాళ్ళు ఎలా ఊరుకుంటున్నారో?"

"ఇక ఈ అమ్మాయికి ఎలా పెళ్ళవుతుంది?"

ఇలా మాట్లాడుకునేవాళ్ళు.

ఉద్యోగంలో చేరిన నాలుగు నెలల తర్వాత ఆ అమ్మాయి ఉద్యోగం మానేసింది. "ఇక ఉద్యోగం ఎందుకు? పెళ్ళిచేసుకోబోతున్నాను" అన్నది.

"పెళ్ళా? నిశ్చయమైందా? ఎవరు?" అడిగారు ఆమె చుట్టూ చేరి.

"ఫీల్డ్ ఇన్వెష్టిగేటింగ్ ఆఫీసర్ ప్రసాద్" అన్నది రమ గర్వంగా.

ఆవేళ మీనాక్షి ఇంటికి వెళ్ళి తన మొహం అద్దంలో అరగంటసేపు పరకాయించి చూసుకున్నది. తమ తనకన్నా అందమైనదా? రమ తనకన్నా చిన్నది కాదు. రంగులో తనే ఎక్కువ. తనకళ్ళే బావుంటాయి. తన జుట్టు బాగా ఒత్తు. రమకి అసలు నాలుగు పాచికలయినా లేవు బక్కగా ఉంటుంది. రమ తనలా నిండు విగ్రహం కాదు.

అర్థంకాలేదు. రమ అదృష్టం అనుకున్నది.

ఓ రోజున మీనాక్షి ఇంటికి వచ్చేటప్పటికి రూపమతి హాల్లో కూర్చునున్నది. రూపమతిని చూసి దాదాపు మూడేళ్ళయింది. బి.ఎ పరీక్ష అయిన తర్వాత మళ్ళా కలుసుకోలేదు. రెండు సంవత్సరాలుగా ఉత్తరాలు రాసుకోవడం లేదు.

"ఎక్కణ్ణించి ఊడిపడ్డావ్?" అడిగింది మీనాక్షి సంతోషంతో.

"మూడు రోజులయింది ఈ ఊరు వచ్చి. తెలుసుకునేందుకు నానా తంటాలు పడ్డాను."

"ఎలా తెలిసింది?"

"మన క్లాస్ మేట్ మెహరున్నీసా చెప్పింది. ఆ మధ్య నువ్వు మౌంట్ రోడ్లో కనిపించి అడ్రస్ చెప్పావటగా!"

"అవును - మూడు రోజులయిందా వచ్చి! నువ్వు ఉత్తరాలు రాయడం మానేశావేం?" అడిగింది మీనాక్షి.

"ఎప్పటికప్పుడు రాద్దాం అనుకుంటూనే రాయలేదు"

"ఎక్కడ దిగావు?"

"అడయార్లో!" అన్నది రూపమతి పమిట సర్దుకుంటూ. అప్పుడు మీనాక్షి చూసింది మంగళసూత్రం.

"పెళ్ళి చేసుకున్నావా?" అడిగింది.

"ఆ! ఆరునెలలయింది."

"నన్ను పిలవలేదేం?"

"అంతా హడావిడిగా జరిగిపోయింది. ఎవర్నీ పిలవలేదు."

"ఎవరు? బాలకృష్ణనేనా?"

రూపమతి నవ్వి "ఊహూ! అతను పలాయించాడు. అమెరికా వెళ్ళాడు చదువుకోవడానికి" అన్నది.

"మీ వాళ్ళు వేరే సంబంధం చూశారా?"

"లేదు. నేనే చూసుకున్నాను. రామకృష్ణన్ అతని పేరు. ఇంజినీర్. ఇండియన్ హైవే ఇండస్ట్రీస్‌లో ఉద్యోగం. ఆరువందల జీతం. అడయార్లో కంపెనీవాళ్ళు ఇల్లు కూడా ఇచ్చారు" అన్నది రూపమంతి.

అరగంటసేపు ఇద్దరూ కబుర్లు చెప్పుకున్న తర్వాత రూపమతి ఇంటికి బయలుదేరుతూ "ఆదివారం రా! ఈ ఆదివారం రామకృష్ణన్ డ్యూటీలో ఉంటాడు. మనం రోజంతా కబుర్లు చెప్పుకోవచ్చు" అని ఆహ్వానించింది.

మీనాక్షికి ఆ రాత్రి ఒక పట్టాన నిద్రపట్టలేదు. రూపమతిని గురించే ఆలోచిస్తూ గడిపింది. ఆదివారం పొద్దున్నే అడయార్ వెళ్ళింది.

"వచ్చావా! ఇంత ఆలస్యం చేశావేం?" అని లోపలికి తీసుకెళ్ళి ఆఫీసుకి బయలుదేరబోతున్న భర్తకి పరిచయం చేసింది. అతను వెళ్ళిపోయిన తర్వాత ఇద్దరూ భోజనం చేశారు.

"మీనా! నువ్వు ఉద్యోగం చేస్తున్నావు బాగానే ఉంది. పెళ్ళిమాట ఏం చేశావు?" అడిగింది రూప.

తనకి వరుడు దొరకలేదని మీనాక్షి దాచకుండా నిజం చెప్పేసింది. పత్రికల్లో ప్రకటనలకి వచ్చిన యువకుల గురించి చెప్పింది.

రూపమతి విరగబడి నవ్వి "అంతే, ఈ ప్రకటనల ద్వారా వచ్చే వాళ్ళంతా అలాటి వాళ్ళే!" అని అయిదునిమిషాల తర్వాత "చాలా పెద్ద పొరపాటు చేశావు!" అన్నది.

"ఏమిటి?"

"జోసఫ్‌ని నువ్వు అలా తిరస్కరించి ఉండకూడదు."

మీనాక్షి మాట్లాడలేదు.

"ఏదో స్కాలర్ షిప్ తో అతను జర్మనీ వెళ్ళాడట. అక్కడే ఉద్యోగం దొరికిందట."

మీనాక్షి మౌనంగా ఉండిపోయింది. "అయినా ప్రపంచంలో జోసఫ్ ఒక్కడేనా! మీనా! నీ దృక్పథం మార్చుకోవాలి. లేకపోతే నీకు పెళ్ళికాదు. ఇలాగే ఉండిపోతావు జాగ్రత్త!" అన్నది చాలా అనుభవంతో మాట్లాడుతున్నట్లు.

"దృక్పథం మార్చుకోవాలా? ఎలా మార్చుకోవాలి?"

"మడి కట్టుకుని అలా దూరంగా కూర్చుంటే నీకు పెళ్ళి అవదు"

"అంటే అడ్డమైన మొగాళ్ళతో తిరగమంటావా?" అడిగింది మీనాక్షి.

"అన్ని యోగ్యతలు ఉన్న యువకులని పెళ్ళి చేసుకునేందుకు యువతులు కొల్లలుగా దొరుకుతారు. పత్రికల్లో ప్రకటన ఇచ్చే మొగాళ్ళకి ఏదో లోపం ఉంటుందని నువ్వు ఒప్పుకున్నావు అవునా?"

"అవును"

"ఎవతో ఒకతెని పెళ్ళిచేసుకోదలచుకున్న యువకుడికి వాళ్ళ పెద్దవాళ్ళు ఎక్కణ్ణించో సంబంధం తెచ్చి చేసేస్తారు. పాతికేళ్ళు దాటినా పెళ్ళిచేసుకోకుండా యోగ్యులయిన యువకులు ఎందుకు కాచుకుంటారంటావు? తమ అభిరుచులకీ, తమ అభిప్రాయాలకీ అనుకూలవతి అయిన భార్య కోసం వెతుకుతున్నారన్న మాట. అవునా? అటువంటి యువకులకి నిన్ను గురించి తెలుసుకుని, నువ్వు తమ అభిరుచులకీ, అభిప్రాయాలకీ అనుకూలమైన దానివనీ, నిన్ను పెళ్ళిచేసుకుంటే సుఖపడతామనీ అనిపించే అవకాశం నువ్వు ఇవ్వాలి. ఎవరయినా పలకరించగానే చీరకొంగు ముందుకు లాక్కుని తల వంచుకుని పారిపోతే నువ్వు ఎలాటిదానివో వాళ్ళకి ఎలా తెలుస్తుంది?"

"అందరితో తిరిగితే చెడ్డపేరు రాదూ?"

"ఎందుకు వస్తుంది! ఎంత దూరంలో ఉంచాలో అంత దూరంలోనే ఉంచి. అయినా ఇప్పుడు నీకున్న మంచి పేరు వల్ల పెళ్ళయిందా?"

రూపమతి చెప్పిన మాటలు మీనాక్షి చెవుల్లో గింగురుమంటున్నాయి. నాలుగురోజులపాటు, పెళ్ళికాకపోతేనేం? తను సంపాదించుకుంటోంది. ఒకళ్ళు తనని పోషించవలసిన అవసరంలేదు. ముసలితనం వచ్చాక తనని ఎవరు చూసుకుంటారనే చింత లేదు. గవర్నమెంటు ఉద్యోగం. పెన్షన్ వస్తుంది. పెళ్ళికోసం తాపత్రయం ఎందుకు? తనకి తను నచ్చ చెప్పుకోడానికి ప్రయత్నించింది. ఎవరో తనని పోషించడానికి మాత్రం కాదు పెళ్ళి. తన బతుకుకి పరిపూర్ణత, ఆనందం, అర్థం ఉండాలంటే భర్త, పిల్లలు, భవిష్యత్తు అనేవి ఉండాలి అని తెలుసు. రూపమతి సలహా ప్రకారం తను చొరవచేసుకుని, మొగాళ్ళతో స్నేహం చేసుకుని, వాళ్ళని ఆకర్షించి, గాలం వేసి భర్తని సంపాదించుకునే సమర్థతా, సాహసమూ తనకి లేవనీ తెలుసు. తనని ఏరికోరి ప్రేమిస్తున్నానని చెప్పిన జోసఫ్‌ని తను ఆనాడు తిరస్కరించటం నిజంగా పొరపాటే నేమోనని అప్పుడప్పుడు చింతించేది.

రూపమతిని మీనాక్షి కలుసుకుంటోంది. రూపమతి మీనాక్షిని కలుసుకున్నప్పుడల్లా నూరిపోస్తోంది. "అంత అందమైన జుట్టు కదా! ఎందుకు అలా చెవుల వెనక్కి లాగి, బిగించి అసహ్యంగా చేసుకుంటావు!"

"నువ్వు అలా పమిట ముందుకి లాక్కుని, కప్పుకుని నీ వక్షస్థలం ఎత్తు ఎవరికయినా కనిపిస్తుందేమో అన్నట్లు ఎందుకు వంగి నడుస్తావు! చక్కగా వెన్ను విరిచి నడు"

"ఎందుకు అలా తల వంచుకుంటావు నీ మొహం చూస్తే పిల్లలు దడుచుకుంటారన్నట్లు!" ఇలా చెపుతూ మీనాక్షిని మార్చడానికి రూపమతి చాలా ప్రయత్నించింది.

"మీ ఆఫీసులో పెళ్ళికాని మొగాళ్ళు లేరూ?" అడిగింది రూప ఓ రోజున.

"ఉండి ఉంటారు. నేను అడగలేదు ఎవరెవరికి పెళ్ళి కాలేదో!"

"అడగనవసరంలేదు. మాటల సందర్భంలో తెలుసుకోవచ్చు. వాళ్ళు ఎవరూ నిన్ను పలకరించరా?"

"ఏదయినా పనివుంటే పలకరిస్తారు" అన్నది మీనాక్షి.

"ఆ ఫైలు ఇటు ఇవ్వమనో, ఆ కాగితం ఇటు అందించమనో - అంతేనా?"

"అవును."

"అంతకన్నా ఎక్కువ చనువుగా మాట్లాడితే నువ్వు మొహం చిట్లిస్తావు"

మీనాక్షి నవ్వింది.

"ఎంకరేజ్ చెయ్యాలి మీనా! నీతో మాట్లాడేటట్లు చెయ్యాలి. నీకు తోడుగా బస్ స్టాప్ వరకూ వస్తామంటే రమ్మనాలి. ఆకర్షించాలి మీనా! ఆకర్షించాలి."

"అది చాలా అసహ్యమైన పని కదు!"

"ఏది? మొగాళ్ళని ఆకర్షించడమా? తప్పేముంది చూడు. అప్పుడే నీకు కణతల దగ్గిర రెండు వెంట్రుకలు తెల్లబడ్డాయి."

"ఛఛ" అన్నది మీనాక్షి.

"అద్దం తెస్తాను చూడు" అని చిన్న అద్దం తెచ్చి చూపించింది రూప.

"నిజమే! రెండు వెంట్రుకలు తెల్లబడ్డాయి."

"మీనా! నువ్వు ఇంకా ఇలాగే రోజులు వెళ్ళబుచ్చావంటే ఇలాగే ఉండిపోతావు" అన్నది రూపమతి.

మీనాక్షి ఇంటికి వచ్చిన తర్వాత తన మొహం అరగంటసేపు అద్దంలో చూసుకున్నది. కంటికింద ముడతలు వస్తున్నాయేమోనని. అప్పుడే! పాతికేళ్ళు దాటనిదే! ఏమో! పెళ్ళి కాకపోతే కొంతమంది ఎండిపోతారు. అలాగే తనూ అయిపోతుందేమో? విసుగ్గా మీనాక్షి

అద్దాన్ని వెనక్కి తిప్పి పెట్టేసింది. రెండురోజులపాటు రూపమతి చెప్పిన సలహాలే తలలో తిరుగుతున్నాయి. తను కొంత ప్రోత్సాహం ఇవ్వకపోతే ఎవరు తనని పలకరిస్తారు.

మీనాక్షిలో వస్తున్న మార్పు ఆఫీస్‌లోవాళ్ళు గమనించారు.

"ఏమోయ్! ఇవాళ ఆ మీనాక్షి నన్ను చూసి నవ్వింది." అని ఒకతను.

"అంతేనా! నిన్న సాయంకాలం నేను ఇంటికి వెళుతుంటే నాతో పాటు నడిచింది. తన విషయాలు చాలా మాట్లాడింది. నా విషయాలు అడిగింది." అని ఇంకో అతను.

"ఆదివారం నన్ను వాళ్ళ ఇంటికి టీకి పిలిచింది" అని ఒకతనూ.

ఇలా చెప్పుకోవడం మొదలు పెట్టారు. మీనాక్షిలో ఉన్నట్టుండి ఇటువంటి మార్పు రావడానికి కారణం ఏమిటో ఎవరూ ఊహించలేకపోయారు.

"బి కేర్ ఫుల్! మొగుడికోసం గాలం వేస్తున్నట్లున్నది!" అన్నాడు ఒక అనుభవశాలి. అతన్ని ఎవర సీరియస్‌గా తీసుకోలేదు.

ఇంతకు ముందు బస్ స్టాప్ వరకూ మీనాక్షికి తోడుగా వెళ్ళే వాళ్ళలో ఒకళ్ళిద్దరు ఆమె ఇంటికి టీకి వెళ్ళారు. ఒకసారి ఇద్దరు మొగాళ్ళతో సినిమాకి కూడా వెళ్ళింది. కానీ వాళ్ళు ఆమె పట్ల చాలా మర్యాదగా సంచరించారు. పొరపాటునైనా చెయ్యికూడా తగలనివ్వలేదు. ఆమెతో ఎక్కువ చనువుగా ఉండటానికి ప్రయత్నించలేదు.

"నీ ప్లాన్ అమలుపరిచాను. మిసరబుల్ ఫెయిల్యూర్!" అన్నది మీనాక్షి పదిరోజుల తర్వాత రూపమతితో.

"ఏం! నువ్వు పలకరించినా నీతో మాట్లాడడం లేదా?"

"ఎందుకు మాట్లాడలేదు! అంత అమర్యాదగా ఎవరూ ప్రవర్తించలేదు కాని చాలా మర్యాదగా ప్రవర్తిస్తున్నారు" అని మీనాక్షి నవ్వుతూ చెప్పింది.

"దానికి కారణం ఏం లేదు. నీలో ఇంకా ఆ ప్యూరిటానిక్ లుక్ పోలేదు. నీ వైపు ఆశగా చూసినా చనువు తీసుకున్నా నువ్వు నిప్పులు కక్కుతూ చూసేటట్లు కనపడతావు"

"వాళ్ళ నెవర్నీ ఆకర్షించగల అందం నాలో లేదేమో? అదే కారణం అయ్యుండవచ్చుగా! అందుకే నాకు పెళ్ళికాలేదేమో ఇంతవరకూ!" అన్నది మీనాక్షి.

"నాన్‌సెన్స్! నువ్వు అందంగా లేకపోవడమా! నీ అందానికి సరయిన అలంకరణ చేసుకోవు నువ్వు. అంతే!"

అందాన్ని అలంకరించాలి మీనాక్షి ఈ ఆలోచనతో ఇంటికి వెళ్ళింది. ఆ రాత్రి పెట్టెలో చీరలన్నీ తీసి మంచం మీద పెట్టుకుని ముతకగానూ, పాతపద్ధతిలోనూ ఉన్న చీరలని ఇంట్లో కట్టెయ్యడానికి బైట పెట్టింది. జాకెట్లు కూడా అవతల పెట్టేసింది. పొద్దున్నే బజారికి వెళ్ళి రెండు నైలాన్ చీరలు, రెండు టెరిలిన్ చీరలు కొని, లోనెక్ జాకెట్లు, పట్టీలున్న బాడీలు కుట్టమని దర్జీకి పల్చని బట్టకొనిచ్చి వచ్చింది.

ఆ రోజు నుంచి మీనాక్షి రూపంలో మార్పు తెచ్చుకుంది. చాలా అధునాతన పద్ధతిలో ముస్తాబు అవుతోంది.

"వెరీగుడ్! చూడు ఈ మార్పు ఎలా పనిచేస్తుందో!" అన్నది రూపమతి.

****

## 9

**"మీరు ఉండడం ఎక్కడ?"** అని నాగరాజు పలకరించాడు మీనాక్షి బస్‌స్టాప్ దగ్గర నిలుచుండగా.

"ట్రిప్లికేన్‌లో. మీరు?" అడిగింది మీనాక్షి.

నాగరాజు రెండు నెలల క్రితమే వాళ్ళ ఆఫీసులో గుమాస్తాగా చేరాడు. ముప్పయి ఏళ్ళలోపు వాడు. ఎర్రగా, పొడుగ్గా, సన్నగా ఉంటాడు. ఉంగరాల జుట్టు, అందమైన ముక్కు, తెలివైన కళ్ళు.

"నేను రాయపేటలో గది తీసుకున్నాను. హోటల్లో భోజనం" అన్నాడు.

ట్రిప్లికేన్‌కి వెళ్ళే బస్సులో ఖాళీలేదు. ఆగకుండా వెళ్ళిపోయింది.

రాయపేట బస్సు వచ్చింది. అతను ఎక్కలేదు.

"మీ బస్సు వచ్చింది!" అన్నది మీనాక్షి.

"మిమ్మల్ని బస్సు ఎక్కించి తర్వాత వెళతాను. చీకటి పడుతోంది. మిమ్మల్ని ఒంటిగా ఇలా బస్‌స్టాప్ వద్ద వదిలి ఎలా వెళ్ళను!" అన్నాడు.

"హోటలు భోజనం బావుందా?"

"ఎలా బావుంటుంది! విసుగుపుడుతోంది. అయితే ఏం చెయ్యను? నాకు వంట చేసుకోవడం చేతకాదు."

అరగంట తర్వాత ట్రిప్లికేన్ బస్సులో చోటు దొరికింది.

మీనాక్షి అతనికి థాంక్స్ చెప్పింది బస్సు ఎక్కుతూ.

ఆ మర్నాడు అతను మీనాక్షిని బస్సు ఎక్కించి, తను వెళ్ళాడు.

అలా నాలుగు రోజులు జరిగింది.

"రేపు ఆదివారం పొద్దున్న మా ఇంటికి భోజనానికి రండి!" అన్నది మీనాక్షి శనివారం సాయంకాలం.

"ఎందుకు మీకు శ్రమ?"

"శ్రమేముంది! నేనే వంట చేస్తాను. ఎలాగూ నాకు, మా నాన్నకి చేసుకోవాలిగా!"

"పది గంటలకి రానా?"

"ఆఁ.."

సరిగా పదిగంటలకి నాగరాజు మీనాక్షి ఇంటికి భోజనానికి వెళ్ళాడు. చక్రవర్తి నాగరాజుని చాలా మర్యాదగా పలకరించాడు. పదిన్నరకల్లా వంట పూర్తిచేసి మీనాక్షి కూడా వచ్చి హాల్లో కూర్చున్నది. పదకొండు గంటలకి ముగ్గురూ కలిసి భోజనం చేశారు.

అరగంట తర్వాత నాగరాజు లేచి "వస్తాను!" అన్నాడు.

"తొందరేమిటి? మధ్యాహ్నం టీ తాగి వెళ్ళండి" అన్నది మీనాక్షి.

అట్టే బలవంతం చెయ్యకుండానే నాగరాజు ఉండిపోయాడు.

సాయంకాలం నాగరాజు, మీనాక్షి కలిసి సినిమాకి వెళ్ళారు.

అరవ సినిమా. మూడున్నర గంటలసేపు ఇద్దరూ థియేటర్లో పక్క పక్కన కూర్చున్నారు. ఏదో మాట్లాడుతున్నట్లు నాగరాజు బాగా దగ్గరికి జరిగి, ఆమె చెంపలకి తన పెదిమలు అంటీ అంటించకుండా తల తిప్పుతాడు, చెయ్యి కుర్చీ వెనక్కి వేసి, మొదట్లో పొరపాటులా తర్వాత కాస్త ధైర్యంగా ఆమె జడనీ, మెడనీ వేళ్ళతో నిమిరాడు.

మీనాక్షికి ఇదంతా కొత్తగా ఉంది గాని కష్టంగా లేదు. ఒళ్ళు పులకరించింది. సినిమా ఆఖరు అయ్యేముందు ఆమె అరిచేతిని తన అరిచేతిలోకి తీసుకుని గట్టిగా అదిమాడు. అప్రయత్నంగానే మీనాక్షి అతని అరిచేతిని అదిమింది.

ఆ రాత్రి మీనాక్షికి ఒకపట్టాన నిద్రపట్టలేదు. నాగరాజు వేళ్ళు తన మెడకీ, చేతులకీ తగలడం తల్చుకుంటే ఒళ్ళు ఝుల్లుమన్నది. తనలో మరెవరికీ కనిపించని ఆకర్షణ నాగరాజుకి ఎలా కనిపించింది!? అర్ధరాత్రి చటుక్కున లేచి వెళ్ళి దీపం వెలిగించి తనని తను అద్దంలో చూసుకుంది.

అవును. రూప చెప్పింది నిజం. తను ఇంతకాలం తన అందాన్ని కప్పిపుచ్చింది. తనకి తనే దిష్టి పెట్టుకుంది మీనాక్షి. జామపండు రంగులో ఉంది ఒళ్ళు; నిండు బుగ్గలు; నల్లని పెద్ద కళ్ళు; నల్లని నొక్కుల జుట్టు - తనంత అందమైన యువతి తన ఆఫీసులో లేదు. తననికాక నాగరాజు ఎవరిని చూస్తాడు? ఎవరితో స్నేహం చేసుకుంటాడు.?

నాగరాజు ప్రతిరోజూ మీనాక్షితో ఆమె ఇంటివరకూ వచ్చేవాడు. ఒక్కొక్కపుడు రాత్రి అన్నం తిని తన గదికి వెళ్ళేవాడు. ఆఫీసు విషయాలు, సినిమాల కథలు, ఇంకా ఎన్నెన్నో కబుర్లు చెప్పుకునేవాళ్ళు.

నాగరాజుకీ, మీనాక్షికీ మధ్య ఏర్పడుతున్న చనువు చూసి సంతోషించాడు చక్రవర్తి. బి.ఏ. చదువుకున్న యువకుడు, అందమైనవాడు, తెలివైనవాడు. అంతకన్నా ఏం కావాలి?

"అమ్మా! అతన్ని అడగనా?" మీనాక్షిని చక్రవర్తి ఓ రోజు అడిగాడు.

"ఎవర్ని? ఏమని?"

"నాగరాజుని - పెళ్ళిచేసుకుంటాడేమో?"

"ఒద్దు - నువ్వేమీ అడగవద్దు" అన్నది మీనాక్షి అతనే అడుగుతాడన్న ఆశతో.

మీనాక్షి స్పష్టంగా చెప్పకపోయినా రూపమతి మీనాక్షి మాటలవల్ల తెలుసుకున్నది నాగరాజు అనే అతనికీ, మీనాక్షికీ బాగా స్నేహం అయిందనీ, అన్యోన్య ఆకర్షణ ఏర్పడిందనీ.

"మంచివాడు - పోనివ్వక - నువ్వు అంటే పిచ్చెక్కేటట్లు చెయ్యి - లొంగిపోక. తర్వాత పెళ్ళిచేసుకోడు. అంతవరకూ రానిచ్చి అభ్యంతరం చెప్పు." అని సలహా ఇచ్చింది రూప. అపుడు అడగాలనిపించింది మీనాక్షికి అయిదేళ్ళ క్రితం ఎన్నూర్ లో బాలకృష్ణన్ని రూప ఎంతవరకూ వెళ్ళనిచ్చిందేమో, ఎక్కడ ఆపిందో? సిగ్గేసి ఊరుకుంది.

మీనాక్షీ, నాగరాజు చాలా స్నేహంగా ఉండడం ఆఫీసులో అందరూ గమనించారు. నాగరాజుతో జోక్స్ వేసేవాళ్ళు.

"మాకందరికీ పార్టీ ఎప్పుడు?" అని అడిగేవాళ్ళు మీనాక్షిని ఆఫీసులో పనిచేస్తున్న మిగతా స్త్రీలు.

"ఎందుకు ఆలస్యం - త్వరగా చేసుకోండి" అని ఇంకొకళ్ళు అనేవాళ్ళు.

నాగరాజూ, తను పెళ్ళిచేసుకుంటామనే నిశ్చయానికి వచ్చేసింది మీనాక్షి. నాగరాజు నోరు తెరిచి పెళ్ళి విషయం ఎన్నడూ మాట్లాడలేదు. కాని "నువ్వంటే నాకు పిచ్చి."

"నువ్వులేకుండా క్షణం ఉండలేను."

"నువ్వు ఎప్పుడూ నాకు కావాలనిపిస్తుంది" ఇలా మాట్లాడేవాడు. అతను పెళ్ళి చేసుకోమని అడుగుతాడన్న ఆశతో కాచుకున్నది మీనాక్షి. అంతకన్నా అసహనంతో కాచుకున్నాడు చక్రవర్తి.

అతన్ని బాగా ఊరించి త్వరపడేటట్లు చెయ్యాలని నిశ్చయించుకుని ఓ రోజు సాయంకాలం తండ్రి ఇంట్లో లేనపుడు అంతవరకూ రానిచ్చింది. తన నిగ్రహంలో అప్పటివరకూ మీనాక్షికి చాలా నమ్మకముంది. రూప సలహా ఇచ్చినట్లు ఆఖరు క్షణాన, అతనికి వాంఛ బాగా ఎక్కువై వేడెక్కిన తర్వాత అభ్యంతరం చెప్పి, పెళ్ళి విషయం ప్రస్తావిద్దామనుకున్నది కాని చివరికి తనూ ఆవేశంలోపడి, వివేకం

పోగొట్టుకుని, అతనికెంత ప్రబలంగా కోర్కె కలిగిందో అంతకన్నా ఎక్కువగా తనకి కోర్కె కలిగి అతని చేతుల్లో నలిగిపోవాలని ఆరాటపడింది.

సమయానికి తండ్రి రానట్లయితే అంతకాలమూ తను అతి జాగ్రత్తగా కాపాడుకున్న నైర్మల్యం పెళ్ళికాకుండా పోగొట్టుకునేది.

ఇక ప్రయోజనం లేదనీ, అతనితో మాట్లాడాలనీ నిశ్చయించుకున్నది.

## 10

నాగరాజుకి ఆ వేళ పని త్వరగా అయిపోయింది. మీనాక్షి బల్ల దగ్గిరకి వెళ్ళి అడిగాడు ఇంకా ఎంతసేపు ఆఫీసులో పనున్నదని.

"ఇంకో అరగంట!" అన్నది మీనాక్షి.

"అయితే నేను కాంటిన్‌లో ఉంటాను" అన్నాడు.

అరగంట తర్వాత మీనాక్షి బల్ల సొరుగు మూసి, టైప్ రైటర్ మూత పెట్టేసి ఆఫీసులోంచి బయలుదేరింది. గేటు దగ్గరే కలుసుకున్నాడు నాగరాజు. "ఇంటికేనా?" అడిగాడు.

"ఇంకెక్కడికి?" అన్నది.

"నువ్వు ఎప్పుడూ నా గది చూడలేదు రారాదూ?"

"నీ గదికా? అక్కడ చాలా మంది మొగాళ్ళుండరూ?"

"ఛ ఛ! కింద ఎవరో గుజరాతీ వాళ్ళు కాపురం ఉన్నారు. మేడ మీద నా గది ఒక్కటే. మెట్లు బయట నుంచే ఉన్నాయి"

"ఏమన్నా అనుకోరు?"

"ఎవరు? ఆ గుజరాతీ వాళ్ళా?" అని నవ్వి "వాళ్ళు లోపల ఎక్కడో ఉంటారు" అన్నాడు.

"సరే - పద!" అన్నది

టాక్సీ ఆపాడు. చాలా ఎక్సయిట్ అయి ఉన్నాడతను. గది తాళం తీసి "ఇదే నా భవనం - రా" అన్నాడు నవ్వుతూ.

చాలా చిన్నగది. ఒక మంచం; ఒక చిన్న బల్ల ఒక పేము కుర్చీ; గోడకి చిన్న అద్దం. మేకులకి షర్టు, తువ్వాళ్ళు - గదంతా చిందరవందరగా ఉంది.

"కూర్చో" అన్నాడు మంచం చూపించి మీనాక్షి కుర్చీలో కూర్చున్నది.

"ఎందుకా కొత్త?" అంటూ ఆమెని పెదిమల మీద ముద్దుపెట్టుకున్నాడు. మీనాక్షి రెండు చేతులూ అతని మెడ చుట్టూ వేసింది. అతని తలని తన మొహం మీదకి లాక్కుంది. వేళ్ళ గోళ్ళతో అతని మెడని నొక్కింది.

"నిన్న మీ నాన్న రాకపోతే.." అంటూ ఆమెని కుర్చీలోంచి లేవతీసి మంచం దగ్గిరికి లాక్కెళ్ళాడు.

"మా నాన్న రాకపోతే ఏం చేసేవాడి వేమిటి?" అడిగింది.

"తెలుస్తుంది మీ నాన్న ఇక్కడికి రాడుగా?" అని రెండుచేతులతో ఆమెని కావలించుకుని, నలిపేస్తూ దిండు మీదకి తోశాడు.

మీనాక్షి పకపక నవ్వింది అతను పెదిమలని ఆమె మెడమీదనుంచి కిందకి తీసుకెళ్ళి, ఆమె వంటి వంపులని పెదిమలతో రాస్తున్నాడు.

"నాగరాజ్! ఇలా అయితే.."

"అయితే?" అంటూ మంచం మీదికి ఒరిగి ఆమె కాళ్ళని తన కాళ్ళతో అదిమి పెట్టాడు.

"ఇలా చేస్తే నిగ్రహించుకోవడం చాలా కష్టం -" అన్నది అతని భుజం మీద చేతులు వేసి.

"ఎందుకు నిగ్రహించుకోవాలి?" అడిగాడు కాస్త విసుగ్గా. అతని చేతులు ఆమె బట్టలని లాగుతున్నాయి. అతనికి అసహనం ఎక్కువ అవుతోంది. ఇంకా ఎందుకు ఆలస్యం అన్నట్లు తొందరపడుతున్నాడు.

"నిగ్రహించుకోవాలి! తప్పదు" అన్నది.

"ఎవరు శాశించారు అలా?" అంటూ మొండిగా ఆమె మీదకి వాలి, ఆమెని పరుపుకి వేసి అదుముతూ, ఆమె నైర్మల్యాన్ని అపహరించడానికి ప్రయత్నం ప్రారంభించాడు.

"నాగరాజూ! ప్లీజ్ ఆగు - ఊహూ ఒదులు" అన్నది.

అతను వదిలలేదు. బలంగా అతన్ని ఒక్కతోపు తోసి, లేచి నిలబడింది. రొప్పుతోంది ఆయాసంతో. పెదిమలు ఎర్రబడ్డాయి, చెక్కిళ్ళు మెరుస్తున్నాయి, వక్షస్థలం ఎగిరెగిరి పడుతోంది.

"ఏమిటిది మీనా! ఎందుకలా తోసేశావు?" అడిగాడు అతను.

నవ్వుతూ "తోసెయ్యకపోతే నువ్వు ఏం చేస్తున్నావో నీకు తెలుసా?" అడిగింది.

"అందుకేగా ఇక్కడికి వచ్చాం."

"మరీను - అందుకని వచ్చామా! కొంటె మాటలు"

"అయితే నేను పొరబడ్డానన్నమాట - నువ్వు చాలా విచిత్రంగా ప్రవర్తిస్తున్నావు"

"విచిత్రమేముంది? పెళ్ళికానిదే -"

"పెళ్ళికానిదే?" అడిగాడు అతను సిగిరెట్ వెలిగించి.

"పెళ్ళి కానిదే అలా చెయ్యడం తప్పుకదూ"

"తప్పా! నాన్సెన్స్ కడుపు వస్తుందని భయం, అంతేగా. జాగ్రత్త పడితే సరి."

"జాగ్రత్తా? ఏం జాగ్రత్త?"

"నీకు నిజంగా తెలియదు?"

"నాకెలా తెలుస్తుంది?" అన్నది మీనాక్షి.

అతను గట్టిగా సిగిరెట్ పొగపీల్చి "ఒకమాట అడుగుతాను. కోపం తెచ్చుకోవుగా!" అన్నాడు.

"అడుగు -"

"నిజంగా నువ్వు ఇంతవరకూ ఆ పని చెయ్యలేదా?"

మీనాక్షి మొహం చిట్లించి "ఏమిటా ప్రశ్న?" అన్నది.

"నీకు పాతికేళ్ళు కదూ!"

"అవును"

"నిజంగా నీకు సెక్స్ ఎక్స్‌పీరియన్స్ లేదూ!?"

అతను నవ్వాడు. "ఎంత అమాయకురాలివి? పెళ్ళి అయితేనే కాని ఆ అనుభవం ఉండదంటావా? సిల్లీ! మీనా నువ్వు ఇంత ప్యూరిటన్ అనుకోలేదు"

"ఎందుకు అనుకోలేదు? నను చూస్తే పదిమందితో తిరిగిన దానిలా కనిపిస్తానా?"

"నీలో ఉన్న చొరవా, ధైర్యమూ చూసి కొంత అనుభవం ఉన్నదానివి అనుకున్నాను. చాలా పొరపాటు చేశాను. సారీ!" అన్నాడు.

"సారీ ఎందుకు! ఇలాంటి వాంఛ కలగడం సహజమేగా! నన్ను చూస్తే ఇలాటి వాంఛ కలగకపోతే అది నీలో ఏదో లోపం వల్లనైనా కావాలి, లేదా నాలో ఆకర్షణ లోపించి అయినా ఉండాలి - అంతేగా"

"అవునులే సహజమే అనుకో! పెళ్ళికానిదే ఈ అనుభవం పొందడం నీకు ఇష్టం లేదా?"

"పెళ్ళి కానిదే అటువంటి అనుభవంలో అర్థం లేదు" అన్నది మీనాక్షి.

"కడుపు కాదు. ఇంకే పర్యవసానాలూ ఉండవు అని నీకు నేను హామీ ఇచ్చినా ఒప్పుకోవా?" అడిగాడు.

"అన్ని హామీలు ఎందుకు ఇవ్వడం! నువ్వు నాకు కావాలి, నేను నీకు కావాలి. మనం పెళ్ళి చేసుకుందాం" అన్నది.

మీనాక్షి ఆ మాట అనేసి తను అడిగి ఉండకూడదని నాలిక కొరుక్కున్నది.

అతను మీనాక్షిని పరీక్షగా చూశాడు. మీనాక్షి సిగ్గుతో తల వంచుకున్నది.

"అందుకే సారీ అన్నాను" అన్నాడు నెమ్మదిగా

మీనాక్షి గుండెలో రాళ్ళు దొర్లించినట్లయింది. "ఎందుకు?" అడిగింది నీరసంగా.

"నువ్వు భర్తకోసం వెతుకుతున్నావని అనుకోలేదు. సరదాగా గడపడానికి ప్రయత్నిస్తున్నావనుకున్నాను."

"నన్ను గురించి నీకు అంత నీచమైన అభిప్రాయం ఎలా కలిగింది?"

"నా దృష్టిలో అది నీచమైన అభిప్రాయం కాదు"

"ఇంతకీ నేనడిగిన ప్రశ్నకి నువ్వు సారీ అని ఊరుకున్నావు. కారణం చెప్పకూడదా?" అడిగింది మీనాక్షి.

మొహం బిగుసుకుపోయింది, గొంతు వణుకుతోంది.

నాగరాజు మంచం మీదనుంచి లేచి, తలుపు దగ్గరికి వెళ్ళి "ఎందుకు చెప్పకూడదు చాలా పెద్ద కారణం. నాకు పెళ్ళయింది. రెండేళ్ళు పిల్లాడుకూడా ఉన్నాడు" అన్నాడు.

"నిజంగా?" అడిగింది మీనాక్షి ఆశ్చర్యంతో.

"నిజంగానే. నిన్ను పెళ్ళి చేసుకోకుండా తప్పించుకునేందుకు అబద్దం చెపుతున్నా ననుకున్నావా? అదుగో ఫోటో. దానికింద నా పిల్లాడి ఫోటో ఉంది."

మీనాక్షి లేవలేదు. అతను పెట్టె తెరిచి ఫోటోలు తెచ్చి ఆమె కిచ్చాడు. చూసి ఇచ్చేసింది.

"అయిదువేల కట్నంకి ఆశపడి పల్లెటూరి మొద్దుని చేసుకున్నాను. అప్పుడు బి.ఏ పూర్తి చేయడానికి అవసరమైంది ఆ డబ్బు" అని క్షణం ఆగి "నాకు పెళ్ళికానట్లయితే తప్పకుండా నిన్ను పెళ్ళి చేసుకునేవాణ్ణి" అన్నాడు.

మీనాక్షి మొహానికి రెండు చేతులూ అడ్డం పెట్టుకుని ఏడుస్తోంది.

"ఏడవక - ప్లీజ్! నే నేదో చాలా పాపం చేసినవాడిలా ఫీల్ అవుతాను నువ్వు ఏడిస్తే"

"ఏడవక ఏం చెయ్యను? సంతోషించనా?" అన్నది ఎక్కిళ్ళ మధ్య.

"పెళ్ళయినంత మాత్రాన ఏం మీనా? నువ్వూ, నేనూ కలిసి ఉండవచ్చు లక్ష్మి మా ఊళ్ళోనే ఉంటుంది."

"అంటే నువ్వు ఈ ఊళ్ళో నన్ను ఉంచుకుంటావన్నమాట"

"ప్లీజ్! అలా అనక - నేను అలా అనలేదు. అయినా ఇంతకీ నీకు జరిగిన హాని ఏం లేదుగా? మనం ఏం చెయ్యలేదుగా?" అన్నాడు.

"ఇన్ని రోజులు నాకు ఎందుకు చెప్పలేదు నీకు పెళ్ళయిందని"

"ఏమో! చెపితే నువ్వు నాతో మాట్లాడవని అయ్యుండవచ్చు. లేదా అది అంత ఇంపార్టెంటుగా నాకు అనిపించక అయ్యుండవచ్చు"

"పొరపాటునైనా ఆ విషయం ఎవరితోనూ చెప్పలేదే! ఆవేళ నాన్నగారు నిన్ను నీ తల్లిదండ్రుల విషయం అన్ని వివరాలు అడిగినపుడు కూడా చెప్పలేదే?"

"అవును నాకు పెళ్ళయిందని నాకు నేను జ్ఞాపకం చేసుకోలేనప్పుడు ఇష్టం లేనపుడు ఇంకొళ్ళకి ఎలా చెపుతాను?"

"నిజం చెప్పు. నన్ను మోసం చేద్దామనుకున్నావు కదు!"

"మోసం చెయ్యదలిస్తే ఇప్పుడూ ఎందుకు చెపుతాను?"

"పెళ్ళి విషయం నేను ప్రస్తావించాను కనుక"

"అబద్దం ఆడవచ్చుగా - లేదా ఇంకో విధంగా సూటిగా జవాబు చెప్పకుండా తప్పించుకుని ఉండవచ్చుగా! లేదు మీనాక్షీ! నాకు అటువంటి ఆలోచనే లేదు. నువ్వు అంటే ఇష్టం.. నిన్ను చూస్తే చాలు నేను ఏదో అయిపోతాను. అంతే" అన్నాడు నాగరాజు.

"ఇప్పుడయినా చెప్పినందుకు చాలా థాంక్స్, వస్తాను" అని లేచి నిలబడింది మీనాక్షి.

"కోపమా?" అడిగాడు.

"నీ మీదా? లేదు"

"నేనూ వస్తానుండు! నిన్ను ఇంటి దగ్గర దిగబెడతాను."

"ఒద్దు నేను వెళ్ళగలను."

"అంటే నేను ఇక నీ ఇంటికి రావడం నీకు ఇష్టంలేదా?"

"అవును" అన్నది మీనాక్షి కటువుగా.

"మన స్నేహం ఈవేళతో పోయిందా?"

"అవును"

"పోనీ స్నేహంగా ఉండకూడదూ?"

"ఇంకానా! నా చేతకాదు. సారీ" అనేసి చకచకా మెట్లు దిగి వెళ్ళిపోయింది.

## 11

మీనాక్షి చెప్పినదంతా విని రూపమతి విరగబడి నవ్వింది.

"ఎందుకిలా నవ్వుతావు? ఏముంది ఇందులో నవ్వడానికి?" అడిగింది మీనాక్షి చాలా కోపంగా.

"నేను చెప్పగా, మనిషిని నువ్వు మారి మొగాళ్ళతో చనువుగా ఉండడానికి నిశ్చయించుకుంటే నీతో స్నేహం చేసుకున్న మొదటి మొగాడు ఇలాటి వాడయినందుకు నవ్వు వచ్చింది. చూడు మీనాక్షి, చదువుకుని ఉద్యోగం చేసేదానివి ఇటువంటి అనుభవాలు నువ్వు సర్వసామాన్యంగా తీసుకోవాలి. అంతే కాని సీరియస్‌గా తీసుకోకూడదు. రకరకాల మొగాళ్ళుంటారు. మంచివాళ్ళు, చెడ్డవాళ్ళు, రెండూ కాని వాళ్ళు, ఎప్పుడో కనిపిస్తారు. నీకు సరిపోయిన మొగాడు. అంతవరకూ ఇలా వెతుకుతూ ఓపికగా కాచుకోవాలి. నీరసించి వెతకడం మానెయ్యకూడదు" అన్నది రూప.

"ఏడిసినట్టే ఉన్నది నీ సలహా! ఇప్పటికే నేనూ నాగరాజూ కలిసి తిరగడం అందరూ చూశారు. రేపట్నించీ ఆఫీసులో మొహం చూపించడం ఎలాగని నెలరోజులు శెలవు పెట్టాను. ఇంకోచోట ఉద్యోగానికి ప్రయత్నించాలి" అన్నది మీనాక్షి.

****

నాగరాజు రావడం మానేశాడేం అని చక్రవర్తి కూతుర్ని రెండు రోజుల తర్వాత అడిగాడు.

"ఏమో! బహుశా ఊరికి వెళ్ళాడేమో, పిల్లాణ్ణి చూడడానికి"

"పిల్లాడా"

"అవును. అతనికి పెళ్ళయింది - రెండేళ్ళ పిల్లాడున్నాడుట. మొన్ననే చెప్పాడు" అన్నది మీనాక్షి. కూతురు ఆఫీసుకి నెల రోజులు శెలవు ఎందుకు పెట్టిందో తెలియక తికమక పడుతున్న చక్రవర్తికి అప్పుడు అర్థమైంది. నాగరాజుని మనస్సులో తెగతిట్టుకున్నాడు. కూతురు ఎందుకు నెలరోజులు శెలవు పెట్టిందో, ఏం జరిగిందో అని భయపడ్డాడు.

"అమ్మా! ఆ నాగరాజు మంచివాడు కాడు. యోగ్యుడైతే ముందు చెప్పి ఉండవలసింది. నాకు తెలుసు నిన్ను మోసం చేస్తాడని" అన్నాడు.

మీనాక్షి మాట్లాడలేదు. చక్రవర్తి గొంతులో ఏదో అడ్డుపడినట్లయింది. అయిదు నిముషాల తర్వాత "పొరపాటు పని చెయ్యలేదు కదా! చేస్తే చెప్పు. జాగ్రత్త పడవచ్చు" అన్నాడు.

మీనాక్షి వెక్కి వెక్కి ఏడ్వడం ప్రారంభించింది.

"ఏడవకమ్మా, ఏడవక పోనీలే. ఎవరేమంటే మనకేం - ఒకళ్ళు తిండిపెట్టాలా మనకి? ఓ రెండు నెలల తర్వాత ఇంకో ఊరికి వెళ్ళి అక్కడ.."

"ఛ ఛ! నాన్నా అటువంటిదేమీ లేదు. నువ్వు అనుకున్నట్లు నేను ఏమీ చెయ్యలేదు" అన్నది మీనాక్షి

"వెర్రి తల్లీ! అయితే ఏడుపెందుకు? అతన్ని గురించా? అతను యోగ్యుడు కాదమ్మా! యోగ్యుడయితే ముందే చెప్పేవాడు. మరిచిపో!" అన్నాడు చక్రవర్తి.

ఆ మూడు నెలల స్నేహంతో నాగరాజు మీద చాలా ఇష్టం కలిగింది మీనాక్షికి. అది ప్రేమో కాదో ఆమెకి తెలియదు. ఆ ఇష్టంలో శారీరక ఆకర్షణ కూడా ఉన్నదని మాత్రం ఆమెకి తెలుసు. ఇప్పుడిక నాగరాజుతో స్నేహం మూసుకోడంతో ఉన్న ఆశపోయింది. బతుకు చాలా వెలితిగా కనిపించింది.

## 12

ఎలక్ట్రిసిటీ డిపార్టుమెంటులో మీనాక్షికి అదే జీతం మీద ఉద్యోగం దొరికింది. అదీ ప్రభుత్వోద్యోగమే. మళ్ళీ పూర్వంలా చాలా ముక్తసరిగా, ముభావంగా ఉండడం ప్రారంభించింది

రూపమతిని కూడా తరుచూ కలుసుకోవడం మానేసింది. అప్పుడప్పుడు రూపే మీనాక్షి ఇంటికి వచ్చేది. ఇలా రెండు నెలలు గడిచాయి. మళ్ళీ నాగరాజు ఆమెకంట పడలేదు. అప్పుడప్పుడు అతను జ్ఞాపకం వచ్చి మీనాక్షి మనస్సు చివుక్కుమనేది. తనని అతను సులభంగా మరిచిపోగలిగాడు. తనే అంత సులభంగా మరిచిపోలేకుండా ఉంది. పొద్దున్న తీరిక ఉండేది కాదు మీనాక్షికి. వంటపని. త్వరత్వరగానాలుగు మెతుకులు కొరికి ఆఫీసుకి పరిగెత్తేది. సాయంకాలం ఆరుగంటలకల్లా ఇంటికి వచ్చేది. ఒక్కొక్కప్పుడు చక్రవర్తి అప్పటికే వంటచేసి పెట్టేవాడు. మీనాక్షికి ఏమీ తోచేదికాదు. ఏ పత్రికో తిరిగేద్దామన్నా, ఏ పుస్తకమో చదువుదామనుకున్నా ప్రేమ, పెళ్ళి చేసుకోవడం మొదలయిన విషయాలు మొదటే కనిపించేవి. అవి భరించలేదు. వాటిని అవతల పెట్టి పడక కుర్చీలో కూర్చుని గంటల తరబడి అర్థంలేని ఆలోచనలతో, పగటి కలలతో కాలం గడిపేసేది. తన తండ్రిమాట విని తను చదువుకోకుండా స్కూల్ ఫైనల్ పాసు కాగానే పెళ్ళి చేసుకునుంటే ఈ పాటికి ముగ్గురో, నలుగురో పిల్లలు, తీరుబడి ఉండనంత ఇంటిపని, భర్తని ఆఫీసుకి పంపడం, పిల్లల్ని స్కూళ్ళకి పంపడం - ఏమో అతనికి అదృష్టం కలిసివచ్చి పెద్ద ఉద్యోగం అయి పెద్ద ఇల్లు, నౌకర్లు, మోటర్ కారు, అంతకన్నా వివరంగా ఊహించలేకపోయేది.

తనలో తను నవ్వుకునేది పగటి కలలతో తృప్తి ఏమున్నదని?

ఇలా మరొక రెండు నెలలు గడిచిపోయాయి. చక్రవర్తికి జబ్బు చేసింది. మంచానపడ్డాడు.

****

"పెద్దవారు. ఈ రోగానికి ఇంగ్లీషు వైద్యంలో మందులేదు. ఆ మాటకొస్తే అసలు మందేలేదు. రెండు మూడు నెలలు ఇలా బాధపెడుతుంది. ఏం చెయ్యలేము" అని చాలా నిర్మొహమాటంగా డాక్టర్ మీనాక్షికి చెప్పాడు.

జలోదరం వచ్చింది చక్రవర్తికి.

మీనాక్షి ఆ రోజంతా తన గదిలో పడుకుని వెక్కి వెక్కి ఏడ్చింది. తన మీద ఆపేక్ష, ప్రేమవున్న మనిషి ప్రపంచంలో తన తండ్రి ఒక్కడే ఆ తండ్రీ వెళ్ళిపోతున్నాడు - ఇక తను బతకడం ఎలా? ఎవరికోసం బతకాలి? రెండుసార్లు చక్రవర్తి కేకేశాడు కాని డాక్టర్ వెళ్ళగానే మీనాక్షి తండ్రి ముందుకి వెళ్ళలేకపోయింది. తండ్రి మొహం చూడలేదు. ఎంత ఆపుకుందామనుకున్నా దుఃఖం ఆగడంలేదు.

డాక్టర్ వెళ్ళిన రెండుగంటల తర్వాత తండ్రి మంచం దగ్గరికి వెళ్ళింది.

"ఏమమ్మా! ఏడుస్తున్నావా? ఎందుకు? డాక్టర్ నేను ఇక బతకనని చెప్పాడా?" అని చిన్న నవ్వు నవ్వి "అవునమ్మా! నాకూ తెలుసు అయినా పెద్దవాణ్ణి అయ్యాను. ఇంకా ఎంతకాలం ఉంటాను? ఏడవకు?" అని కూతుర్ని పక్కన కూర్చోపెట్టుకుని తల నిమిరి "నీకు పెళ్ళికాలేదు అనే చింత ఉండేది పూర్వం. ఇప్పుడు ఆ చింతా లేదు. భగవంతుడూనీకు పెళ్ళి కాకూడదని నిశ్చయించాడనుకుంటాను. బహుశా నీవల్ల జరగవలసిన పనులు ఏమైనా ఉన్నాయేమో! భగవత్ సంకల్పం అమ్మా అది! అందరం దానికి తలవంచ వలసిందే!"

భగవత్ సంకల్పం, ఖర్మ, పూర్వజన్మ పాపఫలం ఇలాటి మాటలతో బాధ్యత తప్పించుకుని దేనిమీదో ఆ బాధ్యత వేస్తే కొంత వరకు మనశ్శాంతి కలుగుతుంది. ఆ విషయం మీనాక్షికి తెలుసు. కాని అప్పుడు తండ్రి అలా అంటూంటే తల తిప్పింది.

పగలంతా తండ్రి దగ్గిర ఉండడానికి, తండ్రికి శుశ్రూష చెయ్యడానికి నౌఖర్ని పెట్టింది. సాయంకాలం ఆఫీసు నుంచి వచ్చాక తండ్రి పక్కనే కూర్చునేది.

"ఎప్పుడూ ఇలా నా మంచం పక్కన కూర్చుంటే ఎలా చెప్పు? సినిమాలకీ, షికార్లకీ వెళ్ళమ్మా నాకు నువ్వు తోడెందుకు?" అనేవాడు చక్రవర్తి.

"నీకు ఒంట్లో ఇలా ఉండగా నేనెక్కడ ఎలా తిరుగుతాను నాన్నా!" అనేదిమీనాక్షి.

డాక్టర్ రోజూ వచ్చేవాడు. బాధ తగ్గడానికి మందులు ఇచ్చేవాడు. చక్రవర్తి రోజురోజుకీ శుష్కించిపోసాగాడు.

"ఆస్పత్రిలో చేరడం మంచిది." అని చెప్పాడు డాక్టర్ ఓ రోజున.

"ఎందుకు? ఏం చేయగలరు? పొట్టలో సూదులు పొడిచి నీరు తీసేస్తారు అంతేగా? మళ్ళీ వస్తుంది. వద్దు" అన్నాడు చక్రవర్తి.

నాలుగు నెలలు బాధపడి ఓ శనివారం మధ్యాహ్నం కన్నుమూశాడు.

****

## 13

"**కనీసం ఓ పది రోజులయినా** మా ఇంట్లో వచ్చి ఉండు!" అని అడిగింది రూపమతి మీనాక్షిని. గంట క్రితమే చక్రవర్తిని మోసుకు వెళ్ళిపోయారు బ్రాహ్మణులు.

"ఎందుకు?"

"ఎందుకేమిటి? ఒంటరిగా ఏడుస్తూ ఇక్కడ ఏం చేస్తావు?"

"నేను రాను."

"మొండితనం చెయ్యక. పద!" అని బలవంతంగా తనే మీనాక్షి బట్టలు సంచిలో పెట్టి, టాక్సీ తీసుకొచ్చి, కూడా తీసుకెళ్ళింది.

"ఆఫీసుకి శెలవు పెట్టక. ఇంట్లో ఏడుస్తూ కూర్చుంటావు" అని రూపమతి మర్నాడే ఆఫీసుకి పంపించింది. ఆఫీసుకి వెళ్ళి వస్తోందే కాని అంతా ఏదో మైకంలో చేస్తున్నట్లు ఉండేది మీనాక్షికి. తను ఏం చేస్తున్నదీ, ఎందుకు చేస్తున్నదీ, ఎవరికోసం చేస్తున్నదీ అప్పుడప్పుడు తనకే సందేహం కలిగేది. పదిరోజుల తర్వాత తన ఇంటికి బయలుదేరింది.

"ఒంటిగా ఆ ఇంట్లో ఎలా ఉంటావు? ఏ హాస్టలులోనైనా చేరు" అని సలహా ఇచ్చింది రూపం.

"ఆలోచిస్తాను" అని మీనాక్షి సంచి తీసుకుని ఇంటికి వెళ్ళిపోయింది.

ఒంటరిగా ఆ ఇంట్లోకి వెళితే దిగులుగా, గుబులుగా ఉంటుందని ఆమెకి తెలుసు. కాని అంత భయంకరమయిన ఒంటరితనం ఉంటుందని అనుకోలేదు. ఏ గదిలోకి వెళ్ళినా ఏదో ఎడారిలోకి వెళ్ళి ఒంటిగా నిలబడినట్లు అనిపించింది. పడుకున్నా, కూర్చున్నా, కళ్ళు మూసుకున్నా, కళ్ళు తెరిచినా తను ఈ ప్రపంచంలో ఒకతేననీ, తనకి ఎవరూ లేరనీ, తను చచ్చిపోతే పోయిందని కళ్ళనీళ్ళు పెట్టేవాళ్ళు కూడా లేరనీ... సెల్ఫ్ పిటీతో కుమిలిపోయింది. కాఫీ మాత్రం చేసుకుని తాగిపడుకున్నది ఆ రాత్రి.

రూప సలహా ప్రకారం ఏదయినా హాస్టల్‌కి వెళ్ళి అక్కడ ఉందామా అని చాలాసార్లు ఆలోచించింది. కాని మనసు ఒప్పలేదు. తండ్రిని ఆ ఇంట్లో వదిలేసి వెళ్ళిపోతున్నట్లనిపించింది. అంతేకాక, అంతమంది ఆడవాళ్ళతో హాస్టలులో ఉండడం కష్టం అనిపించింది. పలకరించేవాళ్ళు, నవ్వేవాళ్ళు చాలామంది ఉంటారు హాస్టల్‌లో. ఒంటరితనం, ఒంటిగా తనలో తను ఆలోచించుకుంటూ బతకడం బాగా అలవాటయి పోయింది ఇన్నాళ్ళు. ఇప్పుడు మారడం చాలా కష్టం. తను వాళ్ళలో కలవలేదు. తనకీ ఇబ్బందిగా ఉంటుంది, వాళ్ళకీ ఇబ్బందిగా ఉంటుంది. తండ్రి సామాన్లన్నీ ట్రంకు పెట్టెలో పెట్టేసి తాళం వేసేసింది. ఆ పెట్టె అటకమీద పెట్టేసింది. ఆ ఇంట్లో ఒక్కతే జీవించడానికి నిశ్చయించుకున్నది.

## 14

రెండేళ్ళు గడిచిపోయాయి. మీనాక్షికి జీతం ఎక్కువైంది.

ఇప్పుడు రెండువందల యాభై రూపాయలు వస్తున్నాయి నెలకి. ఆరునెలల క్రితం రూపమతి భర్తకి ట్రాన్స్‌ఫర్ అయి అతనితో బొంబాయి వెళ్ళింది – ఉన్న ఒక్క స్నేహితురాలూ వెళ్ళిపోయింది.

సాయంకాలం ఆఫీసునుంచి ఇంటికి వచ్చేటప్పటికి ఆరుగంటలయేది వెంటనే ఇంటికి వెళ్ళాలని కానీ, ఇంటికి వెళ్ళి వంట చెయ్యాలని కానీ తొందర ఏమీలేదు. లైబ్రరీలోంచి పుస్తకాలు తెచ్చుకుని చదువుతూ కూర్చునేది. ఒక్కొక్క రోజున వంటచేయడం బద్ధకమేసి ఓ గ్లాసు మజ్జిగ తాగి నిద్రపోయేది. తండ్రి పోయిన తర్వాత మీనాక్షి జీవితంలో ఏమీ మార్పు రాలేదు – అలాగే బతుకుతోంది కాని అసంతృప్తి ఎక్కువైంది. తనలా ఒంటిగానే పెళ్ళికాకుండా ఉండిపోతాననే నిశ్చయానికి వచ్చేసింది. అందువల్ల 'రేపు' గురించి ఏమీ ఉత్సాహం లేదు. పక్క ఇంట్లో వాళ్ళని కిటికీలోంచి చూస్తూ గంటలు గడిపేది. పొద్దున్న ఆ ఇల్లాలు పిల్లలకి నీళ్ళుపోసి, బట్టలు తొడిగి, స్కూలుకి పంపించడం, తర్వాత తను తిని, వంటిల్లు కడిగి, ఒక గంటని విశ్రాంతి తీసుకుని లేచి కారియర్లో పిల్లలకి స్కూలుకు భోజనం తీసుకుని వెళ్ళడం; తిరిగి రాగానే పొయ్యి వెలిగించి సాయంకాలం పిల్లలు రాగానే పెట్టేందుకు టిఫిన్ చెయ్యడం, అల్లరి చేస్తూ పిల్లలు రావడం – ఆమెకి క్షణం తీరుబడి ఉండేది కాదు.

తనకో! ఆఫీసునుంచి వచ్చాక అంతా తీరుబడే

ఎవరి పిల్లనో, పిల్లాణ్ణో తెచ్చుకుని పెంచుకుందామని చాలాసార్లు ఆలోచించింది. ఎవరిస్తారు! ఎవర్నని అడగడం?.

అది ఆలోచనగానే మిగిలిపోయింది.

రోజంతా గడపడం ఒక ఎత్తు. రాత్రిళ్ళు గడపడం ఒక ఎత్తు అయింది మీనాక్షికి. చీకటి పడుతోందంటే భయంగా ఉండేది. దొంగలు పడతారని కాదు, దెయ్యాలు వస్తాయని కాదు, చీకట్లో ఉండడం గుబులని కాదు.

ఒంటరిగా పక్కమీద అటునుంచి ఇటు వరకూ దొర్లినా ఎవరి చెయ్యీ, కాలూ తగలకుండా, మాట్లాడేందుకు ఎవరూ లేకుండా పడుకోవడం చాలా కష్టంగా ఉండేది. దిండుని కావలించుకుని పడుకునేది.

ఒక్కొక్కప్పుడు ఓ రాత్రివేళ నిద్రలేచి వెక్కి వెక్కి ఏడ్చేది.

"ఏం తప్పు చేశాను? ఎందుకు ఇలా ఒంటరిదాన్ని అయిపోయాను. బతుకు వ్యర్థమయిపోయింది. తను ఎందుకూ కొరగాకుండా ఉంది. ఇదేం బతుకు" అని కుమిలిపోయేది.

ఒక్కొక్కపుడు అర్థరాత్రి నిద్రలేచి అద్దం తెచ్చుకుని మొహం గంటల తరబడి చూసుకునేది.

కళ్ళకింద ముడతలు వస్తున్నాయి.

నాలుగు వెంట్రుకలు నెరిశాయి.

తనకి ఇరవై తొమ్మిదేళ్ళేనని ఎలా తెలుస్తుంది!

నలభై దాటినట్లు కనపడుతుండాలి! లేకపోతే పూర్వంలా బస్ స్టాప్ దగ్గిర, రోడ్ మీద మొగాళ్ళు తనని ఎందుకు చూడరు?

ఎప్పుడో అయిదేళ్ళ క్రితం ఒక ముప్పయి ఏళ్ళ అతను తను ఆఫీసునుంచి వస్తోంటే తన వెనకే వచ్చాడు; వెంటపడ్డాడు. తనకి చచ్చేటంత భయం వేసింది.

ఇంట్లో తండ్రి ఉంటాడో ఉండడో? వెనక్కి తిరిగి చూడకుండా ఇంటివరకూ చకచక నడిచి, తలుపు తట్టి 'నాన్నగారూ' అని కేకేసింది. తర్వాత వెనక్కి తిరిగి చూసింది.

అతను గబగబా వెళ్ళిపోయాడు.

ఇప్పుడెందుకు ఎవరూ తనవెంట పడడంలేదు?

తనలో ఏమాత్రం ఆకర్షణ లేదు. అందుకే అయ్యుండాలి.

తనకి ముసలితనం వస్తోంది. అందుకే తనవంక ఎవరూ చూడడంలేదు.

ఆఫీసులో తను పనిచేస్తున్న సెక్షన్లో ముప్పయి అయిదుగురు మొగాళ్ళు పనిచేస్తున్నారు.

వాళ్ళలో ఒకడు కూడా తనని ఏనాడూ చనువుగా పలకరించలేదు. సినిమాకి పిలవలేదు. తన ఇంటికి వస్తాననలేదు.

ఎందుకు? తను ముసలిది అయిపోయింది. ముసలిదాన్ని ఎవరు వాంఛిస్తారు.

రోజూ రాత్రి ఈ ఆలోచనలతో నిద్రపోయేది, ఇట్లాంటి ఆలోచనలతోనే ఓ సంవత్సరం గడిపేసింది. మీనాక్షికి ముప్పయి ఏళ్ళు వచ్చాయి.

****

డియర్ మీనా!

విష్ యు ఎ వెరీ హాపీ బర్త్‌డే అండ్ మెనీ మోర్ రిటన్స్. ఇరవైతొమ్మిదినిండి, ముప్పయ్యేళ్ళు వస్తాయో, ముప్పయి నుండి ముప్పయి ఒకటి వస్తుందో జ్ఞాపకం లేదు.

ఇక్కడ ఖర్చుఖర్చు చాలా ఎక్కువగా ఉంది. ఇంటికి రెండు పదులు అద్దె. అదీ రెండు గదులు.

పిల్లల చదువు పెద్ద సమస్య అయింది. స్కూలు దగ్గర్లో లేదు. బహుశా ఇంకో రెండు నెలల్లో నేను మా నాన్ననీ, అమ్మనీ చూడడానికి ఎర్నాకుళం వెళతాను. అప్పుడు మద్రాసు వచ్చి నీ దగ్గర రెండురోజులుంటాను. నీకు ఇబ్బంది కాదు కదా!

అన్నట్లు వారం రోజుల క్రితం జుహూ బీచ్ దగ్గర నాకు జోసఫ్ కనిపించాడు. ఆరునెలలయిందట మన దేశానికి వచ్చి, బొంబాయిలోనే ఉద్యోగం చేస్తున్నాడట. ఆఫీసు పనిమీద తరచూ మద్రాసు వస్తూ ఉంటాడట. నీ అడ్రస్ ఇచ్చాను. ఈసారి మద్రాసు వచ్చినపుడు నిన్ను తప్పకుండా కలుసుకుంటానన్నాడు.

నువ్వు ధైర్యం చెయ్యాలి మీనా! ఆ నాగరాజుతో షాకింగ్ అనుభవం తరువాత బొత్తిగా మనిషివి ముడుచుకుపోయావు.

మొగాళ్ళందరూ దుర్మార్గులనీ, మోసగాళ్ళని కలుసుకునేందుకు నువ్వు ఏ ప్రయత్నమూ చెయ్యడంలేదు.

అంతేకాదు మీనా! అన్నం ఎంతవసరమో మనిషికి సెక్స్‌కూడా అంత అవసరం. అది లేకపోతే ఎండిపోతారు.

ఆ అనుభవమే లేకుండా బతికి చచ్చిపోవడం నిజానికి అసలు బతకన్నటే నువ్వు అలాగే ఇంకా అయిదేళ్ళు గడిపావంటే అసలు ఆ అనుభవమే ఇక ఉండదు.

జాగ్రత్త! త్వరపడు! జవాబు రాయి.

**"రూప"**

ఎప్పుడో నెలకో, రెండు నెలలకో ఓసారి రూప ఉత్తరం రాస్తుంది. ఉత్తరాలు రాసే స్నేహితులు ఇంకెవరూ లేరు మీనాక్షికి. అందువల్ల రూప రాసిన ఉత్తరం రోజూ నాలుగు అయిదుసార్లు చదువుకుంటుంది.

## 15

ఆఫీసునుంచి వచ్చి స్నానం చేస్తుండగా తలుపు తట్టిన చప్పుడయింది.

"వస్తున్నాను" అని కేకేసి, త్వరత్వరగా సబ్బు రుద్దుకుని, నీళ్ళుపోసుకోవడం ముగించింది. ఎవరు? తన ఇంటికి ఎవరు వస్తారు? ఎదురింటి అమ్మాయి అయివుంటుంది. అప్పుడప్పుడు వచ్చి పత్రికలు తీసుకెళుతుంది. గబగబ చీర కట్టుకుని, నీళ్ళ గదిలోంచి బయటికి వచ్చి కిటికీలోంచి చూసింది.

ఎవరో మొగాడు. ఫుల్ సూటులో ఉన్నాడు. మొహం కనిపించలేదు మీనాక్షికి.

"ఓ నిముషంలో వస్తాను" అనేసి అవతల గదిలోకి పరిగెత్తింది. అయిదునిమిషాలలో బట్టలు సరిగా కట్టుకుని పౌడరు అద్దుకుని జుట్టు సర్దుకుని వచ్చి తలుపు తీసింది.

చేతిలో ఫెల్టు హేట్, ఇంకో చేతిలో సిగిరెట్ డబ్బా, బూడిద రంగు రయాన్ సూటు, కళ్ళద్దాలు, పల్చని నల్లని జుట్టు, నల్లని ఒంటిరంగు. అతను చిన్నగా నవ్వి "మీరు నన్ను గుర్తు పట్టినట్లు లేరు" అన్నాడు.

మొదట్లో మీనాక్షి నిజంగానే గుర్తుపట్టలేదు. కాని అతని కంఠస్వరం విన్నాక "ఎందుకు గుర్తుపట్టలేదు. రూప రాసింది "మీరు ఈ ఊరు వచ్చినపుడు నన్ను చూడటానికి వస్తారని. రండి!" అన్నది తలుపు బార్లాతెరిచి, తలుపుకున్న తెర తలుపు మీదకి వేస్తూ.

"థాంక్యూ!" అంటూ అతను లోపలికి వచ్చి కూర్చున్నాడు.

"ఎప్పుడూ వచ్చారు?" అడిగింది మీనాక్షి.

"ఈవేళ పొద్దున్న" అన్నాడు. రెప్పవాల్చకుండా చూస్తున్నాడు మీనాక్షిని.

తర్వాత ఏం మాట్లాడాలో తోచలేదు మీనాక్షికి.

"బొంబాయిలో ఉంటున్నారన్నమాట" అన్నది.

"అవును."

మొదటి పది నిమిషాలు ఇద్దరికీ చాలా ఇబ్బందిగానే ఉంది. తర్వాత ఇద్దరూ చనువుగా మాట్లాడటం ప్రారంభించారు. తన తండ్రి పోవడం తన ఉద్యోగం, అన్నీ చెప్పింది మీనాక్షి. తన విదేశ ప్రయాణం, తన ఉద్యోగం అన్నీ చెప్పాడు అతను. ఎనిమిదిన్నరకి లేచి "వస్తాను. రేపు సాయంకాలం వెళ్ళిపోతున్నాను. మళ్ళీ ఈ ఊరు వచ్చినపుడు కలుసుకుంటాను" అన్నాడు.

"భోజనం చేసి వెళ్ళకూడదూ!" అడిగింది మీనాక్షి. అతను అప్పుడే వెళ్ళిపోవడం ఆమెకి ఇష్టంలేదు.

"మీ కెందుకు శ్రమ? హోటల్లో భోజనం రెడీగా ఉంటుంది!"

"శ్రమ ఏముంది? ఆ కుర్చీ ఇలా తలుపు దగ్గరికి లాక్కోండి. మీరు కబుర్లు చెపుతూ ఉంటే క్షణంలో చేసేస్తాను వంట."

జోసఫ్ నవ్వి "సిగిరెట్ కాల్చవచ్చా?" అడిగాడు.

"నిరభ్యంతరంగా!" అని మీనాక్షి వంట ఇంట్లోకి వెళ్ళింది. అతను కుర్చీ వంటింటి గుమ్మం దగ్గరికి లాక్కుని విదేశాలలో తన అనుభవాలు, అక్కడి ఆచారాలు అన్నీ చెపుతున్నాడు. అరగంటలో మీనాక్షి వంట చేసేసింది. అతను మాట్లాడుతూనే ఉన్నాడు, ఆమె వంట చేస్తున్నంత సేపూ ఆమె మనస్సు అక్కడ లేదు. అతని మాటలు వినడంలేదు.

ఎంత సంస్కారం కలవాడు! ఎంత మంచివాడు! తనని చూడడానికి వచ్చాడు. తనని ఇంకా ప్రేమిస్తున్నాడు? అతను క్రిస్టియన్ అనీ, తన తండ్రి ఒప్పుకోడనీ, క్రిస్టియన్‌ని పెళ్ళి చేసుకుంటే నలుగురూ నవ్వుతారనీ భయపడి అతనిని ఆనాడు ఎంత అవివేకంగా తిరస్కరించింది. అప్పుడే అతన్ని పెళ్ళి చేసుకుని ఉంటే ఇన్నేళ్ళూ ఎంత హాయిగా గడిచిపోయేవి!

తను అతనికింకా కావాలా? తనని చూస్తే అతనికింకా ఇష్టం ఉందా? లేకపోతే తనని వెతుక్కుంటూ ఎందుకు వస్తాడు. శ్రీరాముణ్ణి, క్రయిస్టునీ తమకి అడ్డం రానివ్వడం దేనికి?

"షూస్ విప్పి లోపలికి రండి, వడ్డిస్తున్నాను" అన్నది మీనాక్షి.

"లోపలికి రావచ్చా?" అడిగాడు అతను.

"ఎందుకు రాకూడదు! నేను అంత చాదస్తం మనిషిని అనుకుంటున్నారా?"

"అక్కడ ఏవో పటాలున్నాయి" అన్నాడు అతను షూస్ విప్పుతూ.

"దేవుళ్ళకి అంత జెలసి ఉంటుందా? క్రయిస్టు భక్తుడు తనని చూడటానికి వీల్లేదని శ్రీరాముడంటాడంటే నేను నమ్మను" అని కంచం పెట్టింది వంట ఇంట్లోమీనాక్షి.

"మీరు?" అడిగాడు జోసఫ్ చాపమీద కూర్చుంటూ.

"నేను తింటాను" అని తన కంచం అతనికి ఎదురుగా పెట్టుకుని, గిన్నెలు మధ్య పెట్టి కూర్చున్నది.

"ఇలాంటి భోజనం తిని చాలా ఏళ్ళయింది!" అన్నాడు చెయ్యికడుక్కుంటూ.

"ఏం?"

"ఎప్పుడో కాలేజీలో చదువుకుంటున్నపుడు ఒక స్నేహితుడి ఇంట్లో తిన్నాను ఇటువంటి అచ్చ తెలుగు భోజనం"

"బాగాలేదా?"

"అదేమిటి? దివ్యంగా ఉంది" అంటూ చెయ్యి తుడుచుకుని హాల్లోకి వెళ్ళాడు.

"ఆకులు వేసుకుంటారా? అడిగింది.

"అలవాటు అట్టేలేదు కాని వేసుకుంటాను."

మీనాక్షి ఆకులు తెచ్చి బల్లమీద పెట్టి సున్నం సీసాకోసం వంట ఇంట్లోకి వెళ్ళింది. తిరిగి వచ్చేలోపున అతను నాలుగు ఆకులు తీసుకుని తువ్వాలుకి తుడుస్తున్నాడు.

"ఇలా ఇవ్వండి. నేను సున్నం రాసిస్తాను" అని చేతిలోంచి ఆకులు తీసుకుని సున్నం రాసి ఈనెలు తీసి అతనికి అందించింది.

"థాంక్స్" అన్నాడు. మీనాక్షి నవ్వింది. అతను చేతి గడియారం చూసుకుని "తొమ్మిది దాటింది. ఇక నేను బయలుదేరాలి! మళ్ళీ బస్సులు కానీ, టాక్సీలు కానీ దొరకవు" అన్నాడు.

మీనాక్షి తలెత్తి అతని కళ్ళలోకి జాలిగా చూసింది.

"ఇంకాసేపు కూర్చోండి. వీధి చివర్న టాక్సీలు దొరుకుతాయి ఎంత ఆలస్యం అయినా" అంది.

జోసఫ్ ఆశ్చర్యంతో చూశాడు ఆమెని.

ఆహ్వానిస్తోందా! తనకి పరిచయం ఉన్న మీనాక్షి అటువంటి మనిషికాదే! ఇంకో సిగరెట్ వెలిగించాడు. "మీకు ఒంటిగా ఇలా ఉండిపోవడానికి నిశ్చయించుకున్నారా?" అడిగాడు. ఏం మాట్లాడాలో తోచక.

ఇద్దరి మధ్యా ఒకరకమైన కొత్తదనం ఏర్పడింది.

"నేను నిశ్చయించుకోలేదు – నిశ్చయం అవుతోంది" అన్నది మీనాక్షి దీనంగా నవ్వుతూ.

"మీరు పెళ్ళి చేసుకోవాలని నిశ్చయించుకుంటే ఎంత మందో యువకులు పరిగెత్తుకుంటూ వస్తారు"

మీనాక్షి మళ్ళీ నవ్వి "నమ్ముతారా?" అన్నది.

"ఎందుకు నమ్మకూడదూ! అన్నేళ్ళ క్రితం మిమ్మల్ని నేను చూసినప్పటికీ ఇప్పటికీ మీలో ఏమీ మార్పులేదు. అలాగే చిన్నపిల్లలా ఉన్నారు. మీకు పద్దెనిమిదేళ్ళంటే ఎవరయినా నమ్ముతారు!"

"ఊరికే అలా పొగడకండి! నిజం అనుకుంటాను."

"నిజం – అబద్దం కాదు. మీరు అప్పటిలాగే, అంత అందంగాను, అంత ఆకర్షణీయంగానూ ఉన్నారు"

మీనాక్షి కళ్ళల్లో నీళ్ళు నిండాయి. రెండు చేతులూ మొహానికి అడ్డం పెట్టుకుంది.

"నేను పొరపాటున ఏమైనా అన్నానా? క్షమించండి" అన్నాడు అతను ఖంగారుగా.

వెక్కి వెక్కి ఏడుస్తోంది.

"ప్లీజ్! క్షమించండి నేను వెళతాను అనవసరంగా మిమ్మల్ని బాధపెట్టాను" అని లేచాడు.

మీనాక్షి మొహానికి చేతులు అడ్డం తీసింది. తల విదిలించింది.

"ఏమిటండీ? ఎందుకు అలా కళ్ళనీళ్ళు పెడుతున్నారు" అన్నాడు అతను ఏమీ తోచక.

"నేను ఎవరికీ అక్కర్లేదు.. నేను ఎవరికి కావాలి" అన్నది తలమీద ఒక చెయ్యివేసి రెండో చేత్తో రుమాలు తీసుకుని ఆమె కళ్ళు తుడిచాడు.

మీనాక్షి చటుక్కున లేచి నిలుచుని అతని ఛాతీ మీద తలవాల్చింది. దగ్గిరగా ఆమె రొమ్ము అతనికి తగులుతూ అలా అతని మీద వాలేసరికి అతను రెండు చేతులూ ఆమె వీపు మీద వేసి గట్టిగా కౌగలించుకున్నాడు. అతను చూపిన ఆపేక్షకి ఆమె పరవశురాలయి పోయింది. రెండు చేతులతో అతని మెడ చుట్టేసి పెదిమలు ముద్దు పెట్టుకుంది.

తియ్యని వాసన, అంతకనా ఆమె తియ్యని పెదిమలు ఆ పెదిమల చప్పరింపు –

మెత్తగా గట్టిగా ఉన్న ఆమె వక్షోజాల వత్తిడి

ఆమె మోకాళ్ళ వణుకు,

ఆమె వేడి ఊపిరి, ఆమె కళ్ళల్లో కాంక్ష, ఆమె వేళ్ళ కొనల్లోంచి ఒలికిపోతున్న వాంఛ

ఆమె రక్తం అతన్ని పొడుస్తూన్న పోటు,

ఆమె మునిపళ్ళ కొరుకు,

ఆమె బలం, ఆమె ఆవేశం;

ఇవన్నీ కలిసి అతన్ని పిచ్చిగా చేశాయి.

"మీనా! మీనా! ఇక నేను .." అంటూ ఆమె పెదిమలని అందుకుని, ఆమెని తనలోకి, తనకేసి లాక్కుని నలిపేస్తూ, చేతులతో ఆమె ఒంటిమీద వెతుకుతూ, ఆమె బట్టలలోకి వేళ్ళు పోనిచ్చి ఆమెని వెనక్కి తోసేస్తున్నాడు.

"జోసఫ్! జోసఫ్! నీ ఇష్టం - నన్నేమయినా చేసెయ్. ఈ ఒంటరితనం. ఈ బతుకు నేను భరించలేను!" అతన్ని మీదకి లాక్కుంటోంది. కావాలంటోంది. అంతకుముందు తనకున్న అభ్యంతరాలన్నీ తోసిపారేసి అనుభవం కావాలంటోంది.

ఆమె ఒళ్ళు, మనస్సు, గుండె అన్నీ కలిసి ఒక్కటయి అరుస్తున్నాయి. "జోసఫ్ జోసఫ్! నన్నేం చేస్తావో చెయ్! నీ ఇష్టం" అని.

అతను చటుక్కున ఆమెని వదిలేశాడు - కొంచెం దూరంగా జరిగాడు.

"మన ఇద్దరికీ మతిపోయింది. క్షమించు మీనాక్షీ!" అన్నాడు.

ఆశ్చర్యంతో అతనివైపు చూసింది ఆమె ఏమైంది అన్నట్టు.

"మనం ఇలా చెయ్యడం నీకూ, నాకూ, లిండాకి అపచారం" అన్నాడు

"లిండా! లిండా ఎవరు?"

"నేను పెళ్ళిచేసుకోపోతున్న అమ్మాయి. బొంబాయిలో ఉంది."

"నువ్వు లిండా అనే అమ్మాయిని పెళ్ళి చేసుకోపోతున్నావా?" అడిగింది నీరసంగా.

తల ఊపాడు జోసఫ్. హేటు, సిగరెట్ డబ్బా తీసుకుని వెళ్ళిపోయాడు గుడ్ బై చెప్పి.

మీనాక్షిని ఒంటిగా వదిలి ఆమె నైర్మల్యాన్ని ఆమెకే వదిలిపెట్టి వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళిపోగానే మీనాక్షి పక్కమీద పడుకుని భోరున ఏడవడం ప్రారంభించింది.

తన అవసరం లేదు అతనికి. తన మీద వాంఛలేదు అతనికి. తనలో ఆకర్షణ లేదు. అందుకే అలా తనని వదిలి వెళ్ళిపోయాడు.

జ్వరమే వచ్చిందో, ఇందాకటి వేడి ఇంకా తగ్గలేదో మీనాక్షికి ఒళ్ళు కాలిపోతున్నట్లున్నది. అభిమానం! రోషం! ముందు ఎందుకు చెప్పలేదు తనకి లిండా అనే ప్రియురాలు ఉన్నదని.

అబద్ధం! అతనికి ప్రియురాలు లేదు. ఎవర్నీ ప్రేమించడం లేదు. పెళ్ళి చేసుకుంటానని ఎవరికీ మాట ఇవ్వలేదు అంతా అబద్ధం.

తనని ప్రేమిస్తున్నానని అనుకున్నాడు. అందుకే వెతుక్కుంటూ వచ్చాడు. తనతో అన్నం తిన్నాడు. ఉండమంటే ఉండిపోయాడు. తనని ముద్దులు పెట్టుకున్నాడు. దగ్గరికి తీసుకున్నాడు.

తనలో యవ్వనం లేదు. తనకి ముప్పయి ఏళ్ళు. తన వంట్లో వంపులు లేవు; తన వంటికి పటుత్వం లేదు.. అతనికి ఆకర్షణ పోయింది. అతనికి తను అక్కర్లేదనిపించింది. అందుకే వెళ్ళిపోయాడు.

అలా ఏడ్చి, ఏడ్చి రాత్రి ఎప్పుడో నిద్రపోయింది.

****

మర్నాడు ఆదివారం. ఎక్కడికీ వెళ్ళవలసిన అవసరం లేదు. నెమ్మదిగా కాఫీ చేసుకుని తాగి, కుర్చీల్లో చతికిలబడి మీనాక్షి ఆత్మపరిశీలన చేసుకోవడం ప్రారంభించింది.

జోసఫ్ మీద తనకి ప్రేమా! ప్రేమ ఉంటే పదేళ్ళ క్రితం అతను తనని అడిగినపుడు తండ్రిని ఎదిరించి అతన్ని పెళ్ళిచేసుకునేది.

అతనంటే తనకి ఇష్టమా! ఏమో! కొంత స్నేహం ఉండబట్టి, కొంత ఇష్టం ఉండబట్టి తను క్రితం రాత్రి అలా, అంత బలహీనంగా ప్రవర్తించింది.

జోసఫ్ మీద ప్రేమవల్ల కాదు - శారీరక బలహీనత వల్ల, వాంఛ వల్ల.

తనని జోసఫ్ నిరాకరించి వెళ్ళిపోయినందుకు తను బాధపడకూడదు. పదేళ్ళ క్రితం తను జోసఫ్‌ని నిరాకరించింది. ఆనాడు తనకి కొన్ని కారణాలున్నాయి. అలాగే ఈనాడు అతనికీ కారణాలుండి ఉండవచ్చు.

అతని మీద కోపం పెట్టుకోకూడదు. తనదే తప్పు. అతన్ని లోబర్చుకోవడానికి ప్రయత్నించింది.

అంతవరకూ వచ్చాక అతనెలా నిగ్రహం చూపగలిగాడు.

తనలో ఆకర్షణ, వాంఛని రేకెత్తించే ఒంటి అందం పోయింది. తనని ఒకానొకపుడు ప్రేమించిన జోసఫ్‌లాంటివాడే తనని నిరాకరిస్తే తనని ఎవరు వాంఛిస్తారు.

## 16

**"ఏమిటి మీకు ఆరోగ్యం సరిగా లేదా? డాక్టర్ని చూడరాదూ!"** అని ఒకరు;

"మొహం బాగా పీక్కుపోయింది - చిక్కిపోతున్నారు; మంచి టానిక్కు ఏదయినా తీసుకోండి!" అని ఇంకొకరు.

"సరిగా తింటున్నట్లు లేదు. బాగా తినాలి. లేకపోతే మంచాన పడతారు!" అని మరొకరు;

ఆఫీసులో అందరూ ఇలా మీనాక్షికి సలహాలు ఇస్తున్నారు.

మీనాక్షికి రాత్రిళ్ళు అసలు నిద్రపట్టడం లేదు. ఇటునుంచి అటు పొర్లుతుంది; దిండు తల మీద పెట్టుకుంటుంది. మంచి నీళ్ళు తాగి వచ్చి పడుకుంటుంది; చదువుకుంటుంది.

చివరికి నిద్రమాత్రలు తెచ్చుకున్నది. అని వేసుకున్నా ఓ పట్టాన నిద్రపట్టలేదు. పట్టినా సుఖమైన నిద్రరాదు.

తెల్లారి లేవగానే తలనొప్పి, బద్ధకం, ఒళ్ళునొప్పులు.

ఆ మాత్రలు మానేసింది.

ఏమిటీ నికృష్టపు బతుకు అని కుమిలి కుమిలి ఏడ్చేది. రూప రాసే ఉత్తరాలకి ముక్తసరిగా జవాబులు రాసేది.

బతుకులో ఉత్సాహం పూర్తిగా పోతోంది. జోసఫ్‌ని గురించి కాని, మరే మొగాణ్ణి గురించి కానీ ఆలోచించడం మానేసింది. ఎప్పుడయినా తండ్రిని తలుచుకునేది - అంతే.

****

"హల్లో!"

మీనాక్షి చటుక్కున వెనక్కి తిరిగి చూసి చిరునవ్వు నవ్వింది. అతను నాగరాజు అతన్ని చూసి మూడేళ్ళయింది. ఈ మూడేళ్ళల్లో అతనిలో ఏమీ మార్పు రాలేదు.

"నువ్వు ఎక్కడ, ఎలక్ట్రిసిటీ బోర్డులో పని చేస్తున్నావా?"

"అవును."

"నేను కోయంబత్తూరులో ఉన్నాను. తెలుసా?"

"తెలియదు."

"శలవ మీద మా ఊరికి వెళ్ళి, తిరిగి కోయంబత్తూర్‌కి వెళుతూ స్నేహితులిని చూద్దామని ఇక్కడ దిగాను."

"అలాగా!" అన్నది మీనాక్షి.

"నీకు నా మీద ఇంకా కోపమా?"

"అబ్బే ఎందుకు ?"

"అయితే సరిగా మాట్లాడవేం! నాన్నగారు ఎలా ఉన్నారు?"

"పోయారు"

"ఎప్పుడు?"

"రెండేళ్ళు అయింది."

"నీకు పిల్లలా?" అడిగాడు.

"పెళ్ళి కాలేదు" అన్నది నవ్వుతూ.

"ఒంటిగా ఉంటున్నావా?"

తల ఊపింది.

కొంచెం దగ్గరగా జరిగాడు. అతను తలకి పూసుకున్న నూనె సువాసన గుప్పున కొట్టింది ఆమెకి.

"హోటల్లో దిగాను" అన్నాడు.

మీనాక్షి మాట్లాడలేదు.

"ఇంటికేనా వెళుతున్నావు?"

"అవును"

"దగ్గరే నేను బసచేసిన హోటలు. వచ్చి కాఫీ తాగి వెళ్ళరాదూ!"

"ఎందుకు?"

"ఎందుకేమిటి ఊరికినే! మనకి విరోధం దేనికి?"

"పద?" అన్నది.

ఇద్దరూ నడుస్తున్నారు - తనెందుకు అతనితో హోటలికి వెళుతోంది. పరాయి మొగాడితో ఒంటిగా హోటలికి వెళ్ళడంలో అర్థం ఏమిటి? పరాయి మొగాడు. ప్రపంచంలో అందరు మొగాళ్ళూ పరాయివాళ్ళే తనకి.

"నువ్వు బాగా చిక్కిపోయావు సుమా!"

"అందరూ అదే అంటున్నారు."

"ఎందుకు? సరిగా తిండి తినడంలేదా? ఆఫీసులో పని ఎక్కువా?"

నవ్వి ఊరుకుంది.

అది చిన్నది హోటలు. మేడమీద ఉంది అతని గది. తలుపు తీసి "రా"! అన్నాడు. అతను మంచం మీద కూర్చుని, కుర్చీ ఆమెకి చూపించి, కాలింగ్ బెల్ నొక్కాడు. కుర్రాడు రాగానే టిఫిన్, కాఫీ తెమ్మని చెప్పాడు.

"నువ్వు అప్పుడు చేస్తున్న ఉద్యోగం మానేసి ఎలక్ట్రిసిటీ బోర్డులో ఉద్యోగం సంపాదించావా? నేను ట్రాన్స్‌ఫర్ అడిగి, కోయంబత్తూర్ వెళ్ళిపోయాను" అన్నాడు.

"ఎందుకు?" అడిగింది మీనాక్షి.

"నువ్వు ఎందుకు చేస్తున్న ఉద్యోగం మానేశావ్, అందుకే నేను ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాను." అన్నాడు నాగరాజు.

టిఫిన్ తిని, కాఫీ తాగిన తరువాత కుర్రాడు ట్రే తీసికెళ్ళిపోయాడు.

"నువ్వు పెళ్ళి ఎందుకు చేసుకోలేదూ?" అడిగాడు అతను.

మీనాక్షికి చాలా కోపం వచ్చింది. అందరూ ఆ ప్రశ్న అడిగేవాళ్ళే!

"నాకు నచ్చిన మొగాడు దొరకక్క. నేను ఏ మొగాడికి నచ్చక!"

"నాన్‌సెన్స్! నువ్వు నచ్చకపోవడం ఏమిటి? వెయ్యిమంది ఆడవాళ్ళని చూసినా నీలాటి అందమైన ఆడది కనిపించదు."

"ప్లీజ్! అలా మాట్లాడక!" అన్నది మీనాక్షి దిగులుగా.

"నిజం మీనా! నిన్ను నేను కలుసుకునేటప్పటికి నాకు పెళ్ళవడం నా దురదృష్టం."

"ఎవరి దురదృష్టమో!" అన్నది దీనంగా.

"మీనా! ఏమీటి ఇలా నీ జీవితాన్ని ఎండపెట్టేస్తున్నావు ఎందుకు? నీలో ఏ లోపం ఉంది? అందానికి అందం, తెలివికి తెలివి, ఆకర్షణకి ఆకర్షణ, చదువు - అన్నీ ఉన్నాయి" అన్నాడు.

మీనాక్షి కళ్ళల్లో నీళ్ళు నిండిపోయాయి. "ఒకప్పుడు అవన్నీ ఉన్నాయేమో! ఇప్పుడు లేవు. నాకు ముప్పయి ఏళ్ళు" అన్నది . జోసఫ్ తనని నిరాకరించి వెళ్ళిపోవడం మరిచిపోలేదు.

"ఏమిటా మాటలు! ఇప్పటికి కూడా నీకన్నా అందమైన యువతి కనిపించాలంటే ఎంత వెతకాలో నీకు తెలియదు మీనా! నువ్వు చాలా అందమైన దానివి. కాదని ఎవరయినా చెపితే నమ్మక, గిట్టకో, ఈర్ష్యతోనో చెపితే చెప్పవచ్చు!" అని సిగరెట్ పాకెట్ కోసం లేచి, బల్ల దగ్గరికి వెళ్ళి వెనక్కి తిరిగి ఆమె కుర్చీ దగ్గర ఆగి, ఆమె కళ్ళల్లోకి చూసి "నమ్మవూ?" అడిగాడు.

మీనాక్షి తల వంచుకుంది.

"చెప్పు! నా మాట నమ్మవూ!" అంటూ ఆమె గెడ్డం పట్టుకుని తలపైకి ఎత్తాడు. మీనాక్షి. పెదిమలు వణుకుతున్నాయి. కళ్ళు మూసుకున్నది.

ఆమె చీదరించుకుంటుందేమో, తిడుతుందేమో ముట్టుకోగానే అని భయపడిన నాగరాజుకి ధైర్యం కలిగింది.

"పునర్జన్మ విషయం మనకి తెలియదు. మనకి తెలిసిందల్లా కొన్నాళ్ళు బతికి జబ్బుచేసో, ముసిలితనం వల్లో చచ్చిపోతాము. మనకి తెలిసిన ఈ ఒక్క బతుకూ అనుభవించకుండా వృధా చేసుకోవడం చాలా పొరబాటు. మళ్ళీ ఎలా వస్తుంది రమ్మంటే!" అన్నాడు ఆమె రెండు భుజాలమీదా చేతులేసి.

"నేనిక వెళతాను!" అని లేచి నిలబడింది మీనాక్షి.

"ఎక్కడికి వెళతావు? ఎందుకు వెళ్ళాలి?" అంటూ ఆమెని గట్టిగా కావలించుకుని, అంతకన్నా గట్టిగా ముద్దు పెట్టుకున్నాడు.

"ఒద్దు! వొద్దు!" అన్నది మీనాక్షి అతన్ని తోసేస్తూ -

"ఒదలను - మీనా నిన్ను వదలను. నువ్వు నాక్కావాలి. నేను నీక్కావాలి. అది నీకూ తెలుసు. నువ్వు తిట్టినా సరే, కొట్టినా సరే, అరిచినా నిన్ను వదలను" అన్నాడు ఆమెని మరింత దగ్గరికి లాక్కుంటూ.

"నువ్వు పెళ్ళయిన వాడివి! తప్పు. వదులు?" అన్నది పళ్ళు బిగించి, పెదిమలు అదిమి పెట్టుకుని. అతని అరిచేతులు ఆమె వీపు మీద మండిపోతున్నాయి; అతని పెదిమలు తన పెదిమలని స్పర్శించిన చోట రక్తం కారుతున్నట్లున్నది. అతని ఊపిరి ఆమెకి మత్తు కలిగిస్తోంది.

"ఏవేవో అభ్యంతరాలు చెప్పుకుని ఇన్నేళ్ళు నువ్వు సంతోషాన్ని, తృప్తిని దూరం చేసుకున్నావు. నువ్వు సర్వ స్వతంత్రురాలివి. ఎవర్ని చూసి భయపడాలి!" అంటూ ఆమెని లాక్కుంటూ, తోసుకుంటూ, ముద్దులు పెట్టుకుంటూ మంచం దగ్గరికి తీసికెళ్ళాడు.

"వొద్దు - నన్ను వదిలెయ్యి" అన్నది మీనాక్షి నీరసంగా. అది నాలిక చివరి నుంచి వచ్చిన మాటగాని గుండెలోంచి వచ్చిన మాటకాదు. ఆమె చేతులు, ఆమె కాళ్ళు, ఆమె కళ్ళు చెపుతున్న మాటలు వేరు.

"నువ్వు అరిచినా సరే - ఏం చేసినా సరే. నిన్ను వదలను" అంటూ ఆమె తల దిండు మీదకి తోసి, అతను ఆమె మెడనీ, చెవులనీ, చెంపలనీ, కళ్ళనీ ముద్దులతో తడిపేశాడు.

"నాగరాజూ! నేను ఉక్కిరిబిక్కిరి అవుతున్నాను!" అన్నది.

అతను నవ్వాడు. "అంతేకాదు. కాలిపోతావు, వెన్నలా కరిగిపోతావు, మైనంలా ముద్దయిపోతావు!" అంటూ ఆమె బట్టల కింద నుంచి ఎక్కడెక్కడికో చేతులు తీసుకెళ్ళి, వేళ్ళతో ఆమె నరాలని మీటుతున్నాడు.

"నేను ఏదో అయిపోతున్నాను. రక్తం నా వంట్లోంచి చిమ్మేస్తోంది - నరాలు తెగిపోతున్నాయి!" అంటోంది అదో రకమైన బాధతో.

అతను మరింతగా నవ్వి ఆమె పెదిమని చిన్నగా మునిపళ్ళతో కొరికి "నీ రక్తాన్ని తాగేస్తాను. తెగే నీ నరాలని నా నరాలకి ముడేసేస్తాను" అన్నాడు.

మీనాక్షి చేతి వేళ్ళు వంకరలు పోతున్నాయి. 110 డిగ్రీల జ్వరం వచ్చినట్లు ఒళ్ళు కాలిపోతోంది కాళ్ళు ఎవరో పట్టి వంచేస్తున్నట్లు మెలిపెడుతున్నాయి. తను అలా పడుకోలేదు; పడుకునుండలేదు; చేతులు ఊరుకోవడంలేదు. అతని తల పట్టుకుని మీదికి లాక్కుంది. అతని జుట్టు పట్టుకుని పీకింది.

"జరుగు!" అన్నాడు పక్కకి తోస్తూ.

"నేను జరగను!" అని అతని మెడలో వేళ్ళు పెట్టి గోళ్ళతో రక్కింది.

అతనికి ఆ బాధ తెలియలేదు. ఏదో తియ్యని వెర్రి అతని ఒంటిని వంచేస్తోంది.

ఎవరేమంటేనేం! ఏమైతేనేం! ఈ సుఖం కావాలి. ఎన్నేళ్ళు, ఎన్నేళ్ళు తనని తను చంపుకుంటుంది! అతని చాతీ మీద వెంట్రుకలని చూసి, మరిచిపోయి మొహం ఆ వెంట్రుకల కేసి రుద్దింది.

అతను రెండు చేతులూ ఆమె వీపు మీద నుంచి వెనక్కి తీసి ఆమె వంటి నునుపుని ఇంకా నున్నగా చేస్తున్నాడు.

అతనికి అనుభవం ఉంది; అతనికి ఇది అలవాటు; ఎంత ఆలస్యం చేస్తే, ఎంతసేపు శరీరాలని వేడెక్కిసే అంత తృప్తి; అంత తీపి; అంత హాయి; అని అతను.

త్వరగా కావాలి అదేమిటో! ఎలా ఉంటుందో ఆ మధుర అనుభవం; ఆ తృప్తి ఏమిటో తెలుసుకుందామనే తహ తహ ఆమెది.

అతన్ని వెనక్కి లాగింది, అతన్ని తన మీదికి లాక్కుంది; అతన్ని తనతోపాటు మంచం మీదికి తోసేసింది.

"ఎందుకు కళ్ళు మూసుకుంటావు?" అడిగాడు ఆమె పెదిమలు కొరికి.

కళ్ళు తెరిచి, అతని గెడ్డాన్ని ముద్దుపెట్టుకుని మళ్ళీ కళ్ళు మూసుకున్నది.

"ఎందుకలా కళ్ళల్లోంచి నీళ్ళు కారుతున్నాయి?" అడిగాడు.

కళ్ళు తెరిచింది. రెప్పల కింద నీళ్ళు నిండిన కళ్ళు రెపరెపలాడాయి.

చిన్నగా నవ్వింది.

"నువ్వు ఊహించుకున్నంత అసహ్యంగానూ ఉందా?" అడిగాడు ఇంకో అరనిమిషం తర్వాత.

"తేలిపోతున్నాను ఎక్కడికో? మునిగిపోతున్నాను ఎందులోనో? ఈ పాటి సుఖం నేనింత వరకు.."

నవ్వాడు. "మీనా! అనుభవించడానికే మనం పుట్టాం!"

సముద్రపు అలలమీద నుంచి గెంతుతున్నట్లు, కాలుతున్న మంటల్లోంచి ఉరుకుతున్నట్లు, ఒంటి చర్మం వలచి లోపల ఉన్న వాటన్నిటినీ తీసి బయటపారేసి; ఇంకా దేనితోనో నింపడానికి ఖాళీ చేసుకుంటున్నట్టు మీనాక్షి గిజ గిజలాడిపోయింది.

ఆయాసంతో పక్కకి జరిగి, నుదుటి మీదచెమట తుడుకున్నాడు. మత్తుమందు జల్లినట్లు, చల్లని గాలి వీస్తున్నట్లు ఒక రకమైన మత్తులో కళ్ళు మూసుకున్నది.

అతను లేచి కూర్చుని సిగిరెట్ వెలిగింది" బావుందా?" అడిగాడు.

అతనా ప్రశ్న అడగ్గానే మీనాక్షి చటుక్కున లేచి కూర్చుని "ఏమిటి అడిగావ్?" అన్నది.

"బావుందా?" అతనా ప్రశ్న రెండవసారి అడగ్గానే ఉలిక్కిపడి మంచం మీద నుంచి లేచింది.

"ఎందుకు అలా ఉలికిపడుతున్నావు?" అడిగాడు.

"ఏమిటిది! నేను చేసిన పనేమిటి? నాకు మతిపోయింది" అన్నది.

"మీనా! అలా విచారించకు. ఇందులో తప్పేంలేదు"

"తప్పులేదా!విచిత్రంగా మాట్లాడుతున్నావు?"

"అవును." అని చెయ్యిపట్టుకుని కూర్చోపెట్టాడు.

"ఇకవెళతాను, ఆలస్యం అయింది"

"నీ కోసం ఎవరు కాచుకునుంటారు ఇంట్లో!"

"ఎవరూ ఉండరు. అయినా ఇంటికి వెళ్ళవద్దూ!"

"ఒద్దు. ఈ రాత్రికి ఇక్కడ ఉండిపో!"

"రాత్రంతానా?" అడిగింది భయంతో.

"అవును. ఏం నిన్నడిగేవాళ్ళు ఎవరున్నారు?"

"ఎవరన్నా ఏమైనా అనుకోరూ?"

"హోటలు వాళ్ళా! వాళ్ళకి గెస్టు చార్జి ఇంకొక రెండు రూపాయలు ఇస్తే ఊరుకుంటారు."

మీనాక్షి నవ్వి "డబ్బుతో ఏమైనా చెయ్యవచ్చన్నమాట" అంది.

నాగరాజు కాలింగ్ బెల్ నొక్కాడు కుర్రాడు రాగానే రెండు భోజనాలు గదికి తీసుకురమ్మని చెప్పాడు.

మీనాక్షి. ఆ రాత్రంతా అతనితో హోటల్లో గడిపింది.

"ఇవేళ ఆఫీసుకి వెళ్ళక! నేను రాత్రి ఊరికి వెళ్ళిపోతున్నాను" అన్నాడు నాగరాజు.

"ఇవాళంతా ఇక్కడే ఉండనా!"

"అవును."

"ఛ, ఛ!"

"అభ్యంతరం చెప్పక?"

ఎక్కువగా బలవంతం చెయ్యకుండానే మీనాక్షి ఉండి పోయింది.

రోజంతా అతనితో గడిపింది. రాత్రి ఏడుగంటలకి అతను సామాను సర్దుకున్నాడు.

"మళ్ళీ ఈసారి వచ్చినపుడు నిన్ను కలుసుకుంటాను."

"మళ్ళీ ఎప్పుడు వస్తావు?"

"ఏమో నాకే తెలియదు. శెలవు ఎపుడూ దొరికితే అపుడు వచ్చి నీతో రెండు రోజులు..."

అంతకన్నా ఎక్కువ బాంధవ్యం; అంతకనా ఎక్కువ సాన్నిహిత్యం ఉండదు. ఉండదని తనకి ముందు నుండే తెలుసు. అతనికి పెళ్ళయిందని తెలిసీ ఒప్పుకుంది. నిట్టూర్చింది.

"ఏమిటి అలా ఉన్నావు? నేను వెళ్ళడం నీకు ఇష్టం లేదుకదూ!" అడిగాడు గర్వంగా.

మీనాక్షి మాట్లాడలేదు. ఏడున్నరకల్లా హోటలు నుంచి బయలుదేరి ఇంటికి వెళ్ళిపోయింది.

## 17

"అయిదు నిమిషాలు కూర్చోండి! డాక్టర్ గారు బిజీగా ఉన్నారు." అంది నర్సు.

మీనాక్షి పేము కుర్చీలో కూర్చుంది.

నాగరాజుని తను హోటల్లో కలుసుకుని మూడునెలలైంది. ఈ మూడునెలల్లో మీనాక్షి అతన్ని గురించి ఆలోచించని రోజు లేదు – ప్రేమతో కాదు; అతని సహచర్యం కోసం తపించిపోయికాదు, విరహంతో కాదు, అతను కావాలనీ కాదు.

అతని స్వార్థం. అతని మోసం అతని నీచం తలుచుకుని మండిపోయేది. ఆ నాగరాజు ఇప్పుడు తనకి కనిపిస్తే ఏం చేస్తుంది తను. ఇప్పుడు ఈ డాక్టర్ దగ్గరకి ఎందుకు వచ్చిందీ నాగరాజుకి తెలిస్తే ఏం చేస్తాడు?

"లేడీ డాక్టరుగార్ పిలుస్తున్నారు" అన్నది నర్సు.

లేడీ డాక్టర్ సునీత మీనాక్షిని చూసి పలకరింపుగా నవ్వి "రండి! కూర్చోండి!" అన్నది ఆమెకి ముప్పయి ఏళ్ళుంటాయి. అంతకు ముందు జ్వరం వచ్చినప్పుడు ఒకటి రెండుసార్లు మీనాక్షి ఆమె దగ్గిర మందు తీసుకున్నది.

మీనాక్షి, కూర్చోలేదు. "డాక్టర్! నన్ను పరీక్ష చెయ్యాలి!" అన్నది కంగారుగా.

"చేస్తాను. దేనికి? ఏమిటి కంప్లయింటు?"

"నేను నెల తప్పాను."

"ఒక నెలా?" అడిగింది డాక్టర్.

"కాదు. మూడు నెలలు."

"రండి!" అని లోపలికి తీసుకెళ్ళింది. అయిదు నిమిషాలు పరీక్ష చేసి "అవును. గర్భం" అన్నది.

"నిశ్చయమేనా? అడిగింది మీనాక్షి."

"నిశ్చయమే" అంటు కన్సల్టింగ్ రూంలోకి తీసికెళ్ళింది డాక్టర్.

"డాక్టర్! ఈ కడుపు తీసెయ్యాలి" అన్నది మీనాక్షి.

డాక్టర్ సునీత, మీనాక్షిని పరీక్షగా చూసి "మీకు వివాహం కాలేదు కదు?" అడిగింది.

"లేదు" అన్నది మీనాక్షి.

"మీకెన్నేళ్ళు?"

"ముప్పయి ఒకటి."

"దయచేసి మిమ్మల్ని గురించిన వివరాలు, ఇది ఎలా ఎటువంటి పరిస్థితుల్లో జరిగిందీ చెప్పండి!" అడిగింది డాక్టర్.

మీనాక్షి మౌనంగా ఉండిపోయింది.

"చెప్పండి" అని డాక్టర్ మళ్ళీ అడగ్గానే మీనాక్షి చెప్పడం ప్రారంభించింది.

క్లుప్తంగా తన జీవితం అంతా చెప్పి నాగరాజుతో ఎటువంటి పరిస్థితుల్లో తను ఒక రాత్రి, ఒక పగలు గడిపింది దాచకుండా చెప్పేసింది.

"చాలా ఫూలీష్‌గా ప్రవర్తించారు. సరిగా ఏ రెండు రోజుల్లో అయితే గర్భం రావడానికి అవకాశం ఉందో ఆ రెండు రోజులే ఏరుకున్నారు మీరు ఆ అనుభవం పొందడానికి."

"నేను ఏరుకోలేదు - అలా జరిగింది"

"అదే." అని అయిదు నిమిషాలు ఆలోచించి

"పిల్లనో, పిల్లాణ్ణో కనడానికి మీకు అభ్యంతరం ఏమిటి?" అడిగింది డాక్టర్.

"నాకు పెళ్ళికాలేదు. అదే అభ్యంతరం" అన్నది మీనాక్షి.

"మీరు ఉద్యోగం చేస్తున్నారు. నెలకి రెండు వందల యాభయి రూపాయలు సంపాదిస్తున్నారు. మీ మీద అధికారమూ, అజమాయిషీ చెలాయించే వాళ్ళు ఎవరూ లేరు. పెళ్ళికానిదే ఎందుకు పిల్లని కన్నావు అని ఎవరూ మిమ్మల్ని ఇంట్లోంచి తరిమెయ్యరు. అవునా?"

"అవును. కానీ నలుగురూ.."

"ఎవరా నలుగురూ! పక్క ఇళ్ళల్లో వాళ్ళా?" తల ఊపింది మీనాక్షి.

"స్వంత ఇల్లా?"

"కాదు అద్దె ఇల్లు.

"అయితే ఇల్లు మార్చండి"

"ఆఫీసులో?"

"ఎలాగూ శెలవు పెట్టాలి కదా! లాస్ ఆఫ్ పే మీద ఇంకో రెండు నెలలు శెలవు ఎక్కువ తీసుకోండి. ఆఫీసు వాళ్ళు ఉద్యోగంలోంచి మిమ్మల్ని తీసెయ్యలేరు కదా!"

మీనాక్షి చాలా దిగులుగా చూసింది డాక్టర్ని. "మీరు చెప్తుతున్నంత సులభం కాదు. వెక్కిరిస్తారు, నవ్వుతారు, అంతేకాదు రేపు ఆ పిల్లో, పిల్లాడో పెద్దయిన తర్వాత నలుగురూ 'నీ నాన్న ఎవరు?` అని ప్రశ్నిస్తారు - ఇలాటివి ఎన్నో." అన్నది.

"పల్లెటూళ్ళల్లో అయితే అలాటి ఇబ్బంది ఉంటుందేమో! పట్నాల్లో ఎవరూ ఎవరి విషయం పట్టించుకునే స్థితిలో ఉండరు. ఎవరి గొడవ వాళ్ళది."

మీనాక్షి ఒక నిమిషం మౌనంగా ఉండి "కడుపు తీసెయ్యడానికి మీకు అభ్యంతరం ఏమిటి?" అడిగింది.

డాక్టర్ చిన్నగా నవ్వి "చట్టప్రకారం బలాత్కారంగా కడుపు తీసేసిన వాళ్ళకి, కడుపు తీయించుకున్న వాళ్ళకి కూడా జైలు శిక్ష పడుతుంది. అది మొదటి అభ్యంతరం." అన్నది.

"ఎటువంటి పరిస్థితుల్లోనూ కడుపు తీయకూడదా?"

"తల్లి ప్రాణానికి హాని కలుగుతుందని అనిపించినపుడూ గర్భస్రావం చెయ్యవచ్చు. అటువంటి పరిస్థితి మీ విషయంలో లేదు."

మీనాక్షి అయిదు రూపాయలు తీసి బల్లమీద పెట్టి "థాంక్స్! వస్తాను" అన్నది.

డాక్టర్ సునీత మీనాక్షిని సూటిగా కళ్ళల్లోకి చూసి "దయచేసి ఇంకో అయిదునిమిషాలు కూర్చోండి. మీతో మాట్లాడాలి" అని మీనాక్షి కూర్చున్న తర్వాత "నేను చెప్పినటువంటి అభ్యంతరాలు పాటించకుండా మీ కెవరయినా డాక్టరో, నాటు వైద్యుడో మీరు కోరినది చేస్తానని చెప్పవచ్చు. డబ్బుకి ఆశపడేవాళ్ళు ఉంటారు. అది చాలా ప్రమాదంతో కూడుకున్న పని, ప్రాణానికే హాని కలుగుతుంది. ఆస్పత్రికి వెళ్ళడానికి వీలుండదు. వెళితే బయటపడి జైలుకి వెళతారు. కనుక దయచేసి గర్భం తీయించుకోవాలని అనుకోకండి. పిల్లనో, పిల్లాణ్ణో కనండి. మీకెవరూ లేరు. ఓ పిల్లో, పిల్లాడో ఉంటే మీ జీవితానికి ఒక లక్ష్యం, ఒక పరిపూర్ణత కలుగుతుంది."

"పెళ్ళి కాకుండా పిల్లనో, పిల్లాణ్ణో కంటే ఇక నాకు పెళ్ళి అవుతుందా?"

"ఆ ఆలోచన ముందు ఉండవలసింది. అయినా ముప్పయి ఒక్క ఏళ్ళూ పెళ్ళికాలేదు. ఇప్పుడు ఈ వయస్సులో మిమ్మల్ని వివాహం చేసుకోవడానికి వచ్చే మొగాడికి కొంత విశాల దృక్పథం, ఆధునిక భావాలూ ఉంటాయి. పెళ్ళి కాకుండా మీరు పిల్లాణ్ణి కన్నారని తెలిసీ మిమ్మల్ని వివాహం చేసుకునేందుకు ఒప్పుకునే అతనే రావచ్చు. మీ అదృష్టం." అన్నది డాక్టర్.

మీనాక్షి నవ్వి "ఏ లోపమూలేనపుడే ఎవరూ రాలేదు. ఆ ఆశలేదు" అన్నది.

"పిచ్చి పనులు ఏమీ చెయ్యకండి" అని హెచ్చరించింది డాక్టర్.

## 18

**ఆవేళ ఆఫీసు మానేసి ఇంట్లో కూర్చున్నది మీనాక్షి.**

డాక్టర్ సునీత చెప్పిన విషయాల గురించి ఆలోచిస్తూ రోజంతా గడిపింది ఎవర్నీ సలహా అడగటానికి అంతటి ఆత్మీయులు ఎవరూ లేరు రూపమతి ఊళ్ళో ఉంటే సలహా అడిగేదేమో! ఈ విషయాలు ఉత్తరంలో రాయడం కష్టం. ఎలా రాస్తుంది? ఆ ఇల్లు తను అలవాటుపడ్డ ఆ వాతావరణం వదిలి వెళ్ళిపోవాలంటే కష్టంగా ఉంది కాని ఎలా అక్కడ ఉండటం. అప్పుడే పక్కింటావిడ అదోక రకంగా చూస్తోంది "కాస్త లావయ్యారు" అన్నది ఎదురింటావిడ. రంగు వచ్చిందని ఇంకొకామె అన్నది.

ఇలాంటి విషయాలు ఇట్టే కనుక్కుంటారు ఆడవాళ్ళు.

తను త్వరగా ఇల్లు మారాలి. ఆఫీసుకి సెలవు పెట్టి ఏ మారుమూలకో వెళ్ళి, కని - తర్వాత -?

తర్వాత విషయం తర్వాత ఆలోచించవచ్చు అంత వరకూ అన్నీ సక్రమంగా జరిగితే.

మర్నాడు ఆఫీసుకి వెళ్ళి సెలవుకి దరఖాస్తు పెట్టుకున్నది. సాయంకాలం ఆఫీసు నుంచి బయలుదేరి జార్జిటవున్‌కి వెళ్ళి, ఒక రిక్షా చేసుకుని షావుకారుపేట, సెవెన్ వెల్స్ ప్రాంతాలలో చిన్న ఇల్లు కోసం వెతకడం ప్రారంభించింది. అలా రెండు రోజులు తిరిగిన తర్వాత ముత్యాలపేటలో నాలుగు అంతస్తుల మేడలో కింద ఒక చిన్న వాటా దొరికింది పాతిక రూపాయలకి, పడకగది, నీళ్ళగది, చిన్న వంటగది విడిగా ఉంది. ఒకళ్ళతో సంబంధం లేదు.

రెండు నెలల అద్దె అడ్వాన్స్ ఇచ్చి తాళం చెవితీసుకుని వచ్చేసింది.

రెండురోజుల తర్వాత శెలవు ఇచ్చినట్లు ఆర్డర్ వచ్చింది.

ఎర్న్‌డ్ లీవ్; కాజువల్ లీవ్, లాస్ ఆఫ్ పే లీవ్,అంతా కలిసి, సంవత్సరం సెలవు ఇచ్చారు. డబ్బుకి తను ఇబ్బంది పడవలసిన అవసరం లేదు. దాదాపు ఆరువేల రూపాయలు బాంక్‌లో ఉన్నాయి. సామాను అంతా సర్దుకుని టాక్సీ తెచ్చింది.

"ఊరికి వెళుతున్నారా?" అడిగింది పక్కింటామె

''అవును''

''ఏ ఊరు?''

''బెజవాడ'' అని ముక్తసరిగా చెప్పి, సామాను టాక్సీలో పెట్టించి మీనాక్షి టాక్సీ ఎక్కింది.

కొత్త ఇంటికి వెళ్ళిన రోజున వంట చేసుకోలేదు. దగ్గర్లో ఉన్న హోటలు నుంచి కారియర్ భోజనం తెప్పించుకున్నది పనిమనిషి చేత. మర్నాడంతా ఇల్లు సర్దడంలో సరిపోయింది.

డాక్టర్ దగ్గిరకి వెళ్ళడానికి తప్ప ఇంకెందుకూ తను బయటికి వెళ్ళవలసిన అవసరం లేదు. రెండు మూడు నెలల వరకూ డబ్బుకోసం బాంక్‌కి కూడా వెళ్ళనక్కర్లేదు. కూరలు, పాలు గుమ్మం దగ్గిరకే వస్తున్నాయి. పనిమనిషి చేత వెచ్చాలు తెప్పించుకోవచ్చు.

''నీదే ఊరు? ఎక్కణ్ణించి వచ్చావు? - నీకు ఏం పని? నీకు పెళ్ళయిందా?'' ఇటువంటి ప్రశ్నలు అడిగేవాళ్ళెవరూ లేరు అక్కడ. తను సామానులతో రావడం, మిగతా వాటాల్లో ఉనవాళ్ళు చాలామంది చూశారు. ఒక్కరూ పలకరించలేదు. ఎవరి గొడవ వాళ్ళది అక్కడ. తను ఎవరి జోలికీ వెళ్ళకపోతే ఎవరూ తనజోలికి రారని గ్రహించింది. ఆరు నెలలో లేకపోతే ఎనిమిది నెలలో తర్వాత ఇంకో ఇంటికి మారిపోవచ్చు. తను ఎక్కడికి మారినదీ రూపకి ఉత్తరం రాద్దామనుకున్నది కాని ఇల్లు ఎందుకు మారిందీ అంతా దాచిపెట్టవలసి వస్తుంది. తన స్థితి ఎవరికీ చెప్పడం ఇష్టంలేదు. రూపకి కార్డు ముక్క కూడా రాయలేదు. పుస్తకాలు, పత్రికలు తెచ్చిపెట్టుకున్నది. తోచకపోవడం అంటూ ఉండకూడదు. తోచక పోతే తన స్థితి గురించి ఆలోచన పోతుంది. మనస్సులో దిగులు పుడుతుంది. నాగరాజుని గురించి అసలు ఆలోచించేది కాదు; అతని తప్పుకన్నా తన తప్పే ఎక్కువ అని మీనాక్షి తెలుసుకున్నది. అతను వివాహితుడని తెలిసీ, అతను తనని కోరుతున్నాడని తెలిసీ అతనితో హోటల్‌కి వెళ్ళడంలో అర్థం ఏమిటి? తను ఆ అనుభవం కోసం కాచుకుని, ఆ అవకాశం దొరకగానే అనుభవించింది. తప్పంతా అతని మీద తోయడం తప్పు. అది అతను మనస్సులోకి రాకుండా తనకి పుట్టబోయే పాపాయిని గురించి ఆలోచిస్తూ గడిపేస్తోంది.

## 19

ఆ కొత్త ఇంట్లోకి వెళ్ళిన వారం రోజుల తరువాత ఒక సాయంకాలం ఎలక్ట్రిక్ దీపం వెలగలేదు. ఎలక్ట్రిసిటీ పోయింది, ఎక్కడో ఏదో బాగుచేస్తున్నారని మీనాక్షి ఊరుకున్నది రేడియో కూడా మోగడం లేదు. చీకటి పడింది. చదువుకోవడానికి వీల్లేదు అరగంట అయింది. గంటయింది. ఎలక్ట్రిసిటీ రాలేదు. మీనాక్షి తలుపు తెరిచి వసారాలోకి వెళ్ళి చూసింది. పక్క వాటాలో దీపాలు వెలుగుతున్నాయి. అంటే తన వాటాలోనే ఎలక్ట్రిసిటీ లేదన్నమాట. ఎలక్ట్రిషియన్‌ని పిలిపించాలి. ఎలా? పని మనిషి సాయంకాలం నాలుగు గంటలకే వెళ్ళిపోయింది. తనకి ఎలక్ట్రిషియన్ ఎక్కడుంటాడో తెలియదు.

తలుపు దగ్గిరే నిలుచున్నది ఏం చెయ్యాలా అని ఆలోచిస్తూ. పక్క వాటా తలుపు తెరుచుకుని ఒక యువకుడు బయటికి వచ్చాడు. మీనాక్షిని చూసి తల వంచుకుని వెళ్ళిపోయాడు. తలుపు తాళం వెయ్యకుండా వెళ్ళాడు అంటే బహుశా వెంటనే వస్తాడేమో; తను ఊహించినట్లే అతను వస్తున్నాడు సిగరెట్ డబ్బా కొనుక్కుని. అతన్ని అడిగితే! సందేహిస్తోంది మీనాక్షి. తలుపు దగ్గరే నిలుచున్న మీనాక్షిని అతను పరీక్షగా చూస్తూ వెళ్ళిపోతున్నాడు.

''క్షమించండి!'' అని పిలిచింది.

వెనక్కి తిరిగాడు అతను.

''దీపాలు వెలగడంలేదు ఇక్కడ దగ్గిర్లో ఎలక్ట్రిషియన్ ఉన్నాడా'' అడిగింది.

అతను మాట్లాడకుండా అతని గదిలోకి వెళ్ళిపోయాడు. మీనాక్షి ఆశ్చర్యపోయింది పలకరించినా జవాబు చెప్పకుండా వెళ్ళిపోయిన మర్యాద తెలియని ఈ మనిషి ఎవరా అని. క్షణంలో అతను మళ్ళీ బయటకి వచ్చాడు.

"బహుశా ఫ్యూజ్ పోయి ఉంటుంది. మీరు ఇలా వసారాలో నిలుచోండి. నేను చూస్తాను" అని టార్చి వెలిగించి లోపలికి వెళ్ళింది. అతను కుర్చీమీదనుంచి దిగుతున్నాడు.

"చాలా థాంక్స్ మీకు చాలా శ్రమ ఇచ్చాను." అన్నది.

"మీరు ఒంటిగా ఉంటున్నారా?" అడిగాడు.

"అవును"

కిటికీలో ఉన్న పుస్తకాలు పరీక్షగా చూశాడు. ఓ పుస్తకం తీసి "చదువుతున్నారా?" అడిగాడు.

తల ఊపింది మీనాక్షి.

"మీరు చదివేసిన తరువాత నాకు ఒకసారి ఈ పుస్తకం ఇవ్వండి. చదివి ఇస్తాను."

"ఇప్పుడు చదవడం లేదు. తీసికెళ్ళండి." అన్నదామె.

అతను పుస్తకం తీసుకుని వెళ్ళిపోయాడు. మీనాక్షి మంచం మీద చతికిల బడింది. చాలా విచిత్రమైన మనిషి. అనవసరంగా ఒక మాట మాట్లాడలేదు. పాతికేళ్ళ కన్నా ఎక్కువ ఉండవు. చామన ఛాయ, పొడుగు, సన్నం. సరిగా తిండి తింటున్నట్లు లేదు. విచిత్రమైన కళ్ళు రైలు ఇంజన్ దీపాల్లా ఉన్నాయి.

డబ్బాడు సిగిరెట్లు ఎందుకో! అన్ని కాలుస్తాడా! సరిగా తల దువ్వుకోలేదు. జుట్టు చిందరవందరగా నుదిటి మీద పడుతోంది.

పగలంతా ఇంట్లోనే ఉంటాడు. ఉద్యోగం లేదా? చదువుకున్న మనిషిమల్లే ఉన్నాడు! అయినా అతను ఎవరో తనకెందుకు అనుకుని అన్నం తిని పడుకుంది.

రెండురోజుల తర్వాత ఒకరోజు మధ్యాహ్నం మీనాక్షి గది తలుపు తట్టిన చప్పుడు అయింది. "నేను -" అన్న మాటలు వినిపించాయి.

తలుపు తీయగానే "పుస్తకం ఇవ్వడానికి వచ్చాను." అని పుస్తకం ఇచ్చాడు.

"ఇంకో పుస్తకం కావాలా?" అడిగింది మీనాక్షి.

"చూస్తాను"

"రండి!" అన్నది తలుపుకి అడ్డం తొలిగి. అతను తిన్నగా అలమారు దగ్గరకి వెళ్ళి పుస్తకాలు తీసి చూసి. ఒక పుస్తకం ఏరుకుని "చదివి ఇస్తాను" అన్నాడు. తల ఊపింది. అతను వెళ్ళిపోతున్నాడు. విచిత్రమైన మనిషి - ఒక్కమాట మాట్లాడడేమిటి! తన పేరు అడగడు! అతని పేరు చెప్పడు!

"మీకెక్కడ ఉద్యోగం?" అడిగింది తనే.

"ఉద్యోగ్యం లేదు."

"ప్రయత్నిస్తున్నారా!"

"లేదు" అన్నాడు.

"మీ పేరు!" అడిగింది.

"వసంత్" అని వెళ్ళిపోయాడు.

సాయంకాలం కాస్త తిరిగి రావడానికి బయటికి వెళ్ళి ఓ అరమైలు నడిచి వచ్చింది. తన వాటావైపు వెళుతుండగా మెట్లు దిగి ఎవరో ఇరవై ఏళ్ళ అమ్మాయి వచ్చి మీనాక్షిని చూసి నవ్వి "కొత్తగా వచ్చారా?" అడిగింది.

"అవును. మీరు?"

"నేనా!? రెండేళ్ళనుంచీ ఇక్కడ ఉంటున్నాను. నా పేరు సరోజవల్లి." చెప్పింది. పల్చని నైలాన్ చీర, ఒళ్ళు కనిపిస్తున్న జాకెట్టు, రెండు జడలు, పెదిమలకి రంగు, కనుబొమలకి రంగు.

మీనాక్షితో కబుర్లలోకి దిగింది. సినిమాల్లో వేషాలు వేస్తున్నానని చెప్పింది. "మీరు ఒంటరిగా ఉంటున్నారా?" అడిగింది మీనాక్షిని.

మీనాక్షి తల ఊపింది.

"ఒకసారి పైకి రండి - ఎడం వైపు మూడో వాటా!" ఆమె వెళ్ళిపోయింది. మీనాక్షి తన వాటాలోకి వెళ్ళిపోతుండగా పక్క వాటాలో వసంత్ తలుపు తెరిచి ఆమెని చూసి "ఏమండీ?" అని పిలిచాడు.

"ఆ!"

"ఒక రూపాయి ఉంటే ఇస్తారూ! ఇంకో గంటలో ఇస్తాను."

మీనాక్షి తలఊపి, లోపలికి వెళ్ళి రూపాయి నోటు తెచ్చి అతనికి ఇచ్చింది. థాంక్స్ కూడా చెప్పకుండా వెళ్ళిపోయాడు.

ఏడున్నరకల్లా అన్నానికి కూర్చున్నది మీనాక్షి. రెండు ముద్దులు నోట్లో పెట్టుకున్నదో లేదో తలుపు చప్పుడయింది.

"ఇదుగో మీ రూపాయి!" అన్నాడు అతను.

"రేపు పొద్దున్న ఇవ్వవచ్చుగా! తొందరేం!"

"పొద్దున్న లోపల ఖర్చయిపోతుంది!" అని లోపలికి చూసి "అన్నం తింటున్నారా?" అడిగాడు. జవాబు కోసం కాచుకోలేదు.

"వంట ఏమిటి?" అని అడిగాడు వెంటనే.

చెప్పింది.

"నేను భోజనానికి వస్తే సరిపోతుందా?"

ఆశ్చర్యపోయింది మీనాక్షి. "రండి!" అన్నది.

అతను లోపలికి వచ్చి చాప మీద కూర్చున్నాడు.

ఇంకో కంచం లేదు. ఏం చెయ్యాలి? తన కంచంలో కలుపుకున్న పులుసు అన్నం అలాగే ఉంది. అది పారేసి కంచం కడిగి అతనికి పెట్టాలి. అసలే అన్నం చాలదు.

"ఇంకో కంచం లేదా?"

నవ్వి లేదని తలతిప్పింది.

"ఈ పులుసుగిన్నెలో అన్నం పెట్టండి!" అన్నాడు ఆ గిన్నె ముందుకుని లాక్కుని. అన్నం చాలుతుందో చాలదో అని మీనాక్షి చూసి చూసి వడ్డించుకున్నది. భోజనం చేసి చెయ్యి కడుక్కుని వెళ్ళిపోయాడు.

తర్వాత వారం రోజులు అతను అసలు కనిపించలేదు.

చాలాసార్లు తలుపు తెరిచి చూసింది. అతని గది తలుపు మూసి ఉండేది. గదిలో ఉన్నాడని మాత్రం తెలుసు అతని అడుగుల చప్పుడు, చిన్న దగ్గు వినిపించేవి.

ఓ రోజు రాత్రి పదిగంటలకి తలుపు చప్పుడయి మీనాక్షి తలుపు తెరిచింది. వసంత్ కాదు. సరోజ వల్లి తలుపుకి ఆనుకుని నిలుచున్నది. "లోపలికి రావచ్చా?" అడిగింది మీనాక్షిని.

"రండి!" అన్నది మీనాక్షి.

సరోజవల్లి నవ్వి "ఎవరయినా ఉన్నారేమోనని" ఆమె కూడా ఇద్దరు మొగాళ్ళు లోపలికి వచ్చారు.

"ఏమిటి?" అడిగింది మీనాక్షి కాస్త విసుగ్గా

"నీకు అప్పుడే గిరాకీ వచ్చిందేమో అని భయపడ్డాను. నా పక్క గదిలో ఉండే పార్వతి ఎక్కడికో వెళ్ళింది. అందుకని నీ దగ్గరికి తీసుకువచ్చాను" అన్నది సరోజవల్లి.

మీనాక్షికి అర్థం కాలేదు. "ఎందుకు?" అడిగింది

సరోజ వల్లి నవ్వి "యాభై ఇస్తాడు. డబ్బు ముందు తీసుకో! మేము వెళతాము" అని వెనక్కి తిరిగింది.

సరోజవల్లితో వచ్చిన ఒక మొగాడు మాత్రం వెనక్కి తిరగలేదు.

మీనాక్షికి నవ్వాలో, ఏడవాలో తెలియలేదు. "ఈయన్ని కూడా తీసుకుని వెళ్ళు!" అన్నది కోపంగా

సరోజవల్లి మీనాక్షిని ఆశ్చర్యంతో చూసింది మతిపోయిందా అన్నట్లు.

"యాభై వద్దూ, అయిదు వందలూ వద్దు. ఇంకెపుడూ ఇలా ఎవర్నీ తీసుకురాక. నువ్వూ రావద్దు!" అన్నదికోపంగా.

"నీకు సహాయం చేద్దామని - కొత్తగా వచ్చావు కదా!"

"ఇంకో మాట మాట్లడకుండా వెంటనే వెళ్ళండి!" అరిచింది కాస్త బిగ్గరగా మీనాక్షి. సరోజవల్లి ఆ ఇద్దర్నీ తీసుకుని వెళ్ళిపోయింది.

కోపం తెచ్చుకుని ప్రయోజనం ఏమిటి? తనకి ఏదో సహాయం చేద్దామనుకున్నది తను ఒంటిగా ఉంటున్నానని చెప్పింది. అందువల్ల తనూ అలాంటిదే అనుకున్నది. తలుపు తెరిచే ఉంది. మంచం మీద కూర్చుని ఆలోచిస్తోంది - ఈ ఇల్లు ఖాళీచేసి వెళ్ళిపోవడం మంచిది. ఇలాటిచోట ఉండకూడదు. అంతలో తలుపు దగ్గిర అలికిడి అయి అటు చూసింది.

"ఏదో గొడవ జరిగినట్లు అనిపించి వచ్చాను." అన్నాడు వసంత్.

"రండి" అన్నది మీనాక్షి.

"మీకేమైనా సహాయం కావాలేమోనని -"

"నేనే తరిమేశాను -" అన్నది మీనాక్షి.

"ఈ ఇంట్లో సరోజవల్లిలాంటివాళ్ళు ఇంకా చాలా మంది ఉన్నారు" అన్నాడు తలుపు దగ్గిరే నిలుచుని.

"నేనూ అలాంటిదాన్ని అనుకున్నారా?"

"ఎవరు? నేనా! అనుకోలేదు. ఎలా అనుకుంటాను మీ అలమారులో పుస్తకాలు చూశాక" అని వెళ్ళిపోయాడు.

మర్నాడు సాయంకాలం అయిదు గంటలకి వసంత్ మీనాక్షి గది తలుపు తట్టాడు. తలుపు తీయగానే ఆశ్చర్యంతో చూసింది. ఇస్త్రీ చేసిన బట్టలు వేసుకున్నాడు గెడ్డం నున్నగా గీసుకున్నాడు, జుట్టు దువ్వుకున్నాడు. నవ్వుతూ "మీరు ఏమీ అనుకోవద్దు నేను ఇలా అడుగుతున్నందుకు - నాతో బయటికి వస్తారా?" అడిగాడు.

"బయటికా! ఎక్కడికి?" అడిగింది.

"సినిమాకి - తర్వాత హోటల్లో భోజనం చేసి వద్దాం"

"ఎందుకు?"

"నాకు డబ్బు వచ్చింది"

"వస్తే?"

"మీ అభ్యంతరమైతే వద్దు" అని వెనక్కి తిరిగాడు. నిరాశతో, నిరుత్సాహంతో దిగులుగా చూసిన అతని చూపులకి మీనాక్షి గుండె ఎవరో పట్టి నలిపినట్లయింది. నీచత్వం, కపటం ఏ కోశానా కనిపించవు అతనిలో. పసిపిల్లాడిమల్లే అమాయకుడిలా చూస్తాడు, మాట్లాడుతాడు. అతనితో సినిమాకి వెళితేనేం? ఇప్పుడున్న చెడ్డకన్నా ఏం చెడ్డపేరు వస్తుంది. ఈ ఆలోచనలన్నీ క్షణంలో ఆమె మనస్సులో దొర్లిపోయాయి.

"అయిదు నిమిషాలు కాచుకోండి బయట. డ్రస్ చేసుకుని వస్తాను" అన్నది.

"ముందు కాఫీ తాగి తర్వాత సినిమాకి వెళదాం!" అన్నాడు.

"మీకు డబ్బు వచ్చిందన్నారు? ఎలా వచ్చింది? లాటరీలోనా?" అడిగింది నవ్వుతూ.

"ఎందుకు అలా అడిగారు?"

"డబ్బు ఎక్కణ్ణించో ఊరికే వచ్చినట్లు చెపితే!"

"నా నవల ఒకదాన్ని ఓ పబ్లిషర్ తీసుకుని మూడు వందలు ఇచ్చాడు ఈ వేళ"

"మీరు నవలలు రాస్తారా?"

తలూపాడు అతను.

"నా పేరు మీనాక్షి -"

"పేరు బావుంది. నా పేరు చెప్పానుగా! నేను బి.ఏ. పాసయ్యాను. గుంటూరులో నాకో ఇల్లుంది. నెలకి నూట ఇరవై రూపాయలు అద్దె వస్తుంది. తల్లీ, తండ్రీ, తోబుట్టువులూ ఎవరూ లేరు. కథలు రాయాలనీ, నవలలు రాయాలనీ రచయిత నవాలనీ ఉద్యోగంలో చేరలేదు. మూడేళ్ళనుంచీ ఈ ఊళ్ళో ఉంటున్నాను. నాకు ఇరవై ఎనిమిదేళ్ళు" తన జీవిత కథ క్లుప్తంగా చెప్పాడు.

మీనాక్షి తనని గురించి ఏమీ చెప్పలేదు. అతను అడగనూ లేదు.

"ల ఇన్ స్ప్రింగ్ టయిం" అనే ఇంగ్లీషు సినిమా చూసి, హోటల్లో భోజనం చేసి తిరిగి వచ్చారు.

"గుడ్‌నైట్!" అన్నాడు ఆమె తలుపు తాళం తీస్తుండగా.

"గుడ్ నైట్. థాంక్ యు" అంది మీనాక్షి.

పడుకున్నది. ఆలోచనలన్నీ అతన్ని గురించే. విచిత్రమైన మనిషి. పొరపాటునన్నా తనని ముట్టుకోలేదు. లేకిగా ప్రవర్తించలేదు. ఓరచూపులు చూడలేదు. ద్వంద్వార్థాలతో మాట్లాడలేదు. గౌరవమూ, ఆపేక్ష అతని ప్రవర్తనలో గోచరించాయి. తనకన్నా మూడేళ్ళు చిన్నవాడు. అలా కనిపించడు. అతని కళ్ళల్లోకి చూస్తుంటే అతని సమక్షంలో ఎన్ని గంటలు గడిచిపోతున్నాయో తెలియలేదు.

నిద్రపోయింది. అతన్ని గురించే కలలు ఒకటికాదు రెండు కాదు ఎన్నో కలలు. ఒక కలలోంచి ఇంకో కల. తెల్లారి నిద్రలేచిన తర్వాత తను కన్న కలలు తలచుకుని సిగ్గుపడిపోయింది. నిద్రలో కూడా అటువంటి ఆలోచనలు రాకుడదు. పాపం అమాయకుడు. మంచివాడు. అతని జీవితాన్ని నాశనం చెయ్యకూడదు.

ఆ రోజంతా అతను కనిపించలేదు. మీనాక్షికి ఏమీ తోచలేదు. ఏదయినా పుస్తకం కానీ, పత్రిక కానీ తీస్తే చదువుతున్నది ఏమిటో మెదడులోకి ఎక్కదు. అతన్ని భోజనానికి పిలుద్దామని అనుకుని తను అంత చొరవ చూపించడం బాగుండదని ఊరుకున్నది.

చీకటి పడుతున్న సమయాన అతను వచ్చాడు. "ఏం చేస్తున్నారు? " అడిగాడు.

"ఏం లేదు"

"అయితే నేను ఈవేళ రాసిన ఓ కథ చదివి వినిపిస్తాను. ఎలా ఉందో చెపుతారా?"

"రండి!

అని లేచి నిలుచున్నది.

"మీరు కూర్చోండి. నేను ఇలా చాపమీద కూర్చుంటాను" అని చతికిలబడి వెంటనే చదవడం ప్రారంభించాడు. చాలా పెద్ద కథ. రాత్రి పదిగంటలయింది పూర్తయ్యేసరికి. "ఎలావుంది?" అడిగాడు.

"చాలా బావుంది" అన్నది. తనకే తెలియదు కథో, అతను చదవడమో ఏది బాగున్నదో.

టయిం పీస్ వైపు చూసి "అప్పుడే పదయిందే - గుడ్ గాడ్! హోటలు మూసేసి ఉంటారు -" అన్నాడు లేచి నిలబడుతూ.

"హోటలికి ఎందుకు? ఇక్కడ భోజనం చెయ్యండి."

"ఇక్కడా! నాకూ చేశారా?"

"లేదు సరిపోతుంది"

"ఎలా సరిపోతుంది! అరటిపళ్ళు తెస్తాను."

"తర్వాత తీసుకురావచ్చు."

తను గిన్నెలో తిని తన కంచం అతనికి పెట్టింది.

"మీతో ఉంటే నాకు టయిం తెలియడంలేదు" అన్నాడు.

మీనాక్షి గుండె రెపరెపలాడింది "నాకూను" అన్నది నెమ్మదిగా.

ఆమె కళ్ళల్లోకి చూశాడు. "ప్రేమ!" అన్నాడు. మీనాక్షికి ఏమనాలో అర్థంకాలేదు ప్రేమ తనని ప్రేమిస్తున్నాననా? ప్రేమ అని అతను అలా ఎందుకు అన్నాడు? తనని వేళాకోళం చేస్తున్నాడా?

చేతులు కడిగేసుకున్నారు. అతను సిగిరెట్ వెలిగించి మంచం చివర్న కూర్చున్నాడు. గిన్నెలు నీళ్ళ గదిలో పడేసి వచ్చింది మీనాక్షి.

"జవాబు చెప్పలేదు?" అడిగాడు.

"దేనికి?"

"నా ప్రశ్నకి"

"ఏమిటా ప్రశ్న?"

"మీనాక్షీ! నీకు ప్రేమ అంటే ఏమిటో తెలుసా?"

"తెలియదు"

"నువ్వు ఎవర్నీ ప్రేమించలేదా?"

"లేదు. మీరు?"

"ప్రేమించలేదు కాని ప్రేమంటే ఏమిటో తెలుసు."

"ఎలా తెలుసు?"

"చదివాను. చాలా చదివాను"

"ఇప్పుడా విషయం ఎందుకు?"

"మీనాక్షీ! ఐ లవ్ యు." అన్నాడు.

మీనాక్షి కళ్ళు మెరిశాయి నీళ్ళతో, మాట్లాడలేదు.

"నన్ను అపార్థం చేసుకోక! నువ్వు ఒంటిగా ఉంటున్నావు కదా అని నిన్ను అనుభవించడానికి మోసం చేస్తున్నానని అనుకోకు. నువ్వు అంటే నాకు ఎంత ఇష్టమో చెప్పలేను."

"నా మీద మీకు అంత ఇష్టం ఎలా వచ్చింది?"

"మీరు అనక ప్లీజ్! నువ్వు అను. ఎలా వచ్చిందో నాకేం తెలుసు? నేనెలా చెప్పగలనూ! ప్రేమ ఎలా వస్తుందో, ఎందుకు వస్తుందో, ఎక్కడ పుడుతుందో ఎవరూ చెప్పలేరు."

"మీరు నన్ను ప్రేమిస్తున్నారని మీకెలా తెలుసు?"

"ఎలాగా! అదేం ప్రశ్న. పక్క గదిలో ఉన్నానన్న మాటేగాని ప్రతిక్షణం, క్షణంలో ప్రతి అరక్షణం నా మనస్సు ఇక్కడే ఉంటుంది. నీతో, నీ పక్కన, నిన్ను విడిచి ఈ గదిలోంచి వెళ్ళడం ఎంత కష్టమో చెప్పలేను. పొద్దున్న నిద్రలేవగానే నువ్వే! నీ నవ్వే వినిపిస్తుంది. నీ కళ్ళే కనిపిస్తాయి. నీ గురించే మొదటి ఆలోచన. రాత్రి నిద్రపోయేముందు ఆఖరి ఆలోచన నీ గురించే. ఎలా చెప్పడం! చెపితే అర్థం కాదు మీనా! ఒక మనిషి ఇంకొక మనిషిని  ఎంత గాఢంగా ప్రేమించగలడో నేను నిన్ను అంత గాఢంగా ప్రేమిస్తున్నాను."

"నేనెవర్నో, మిమ్మల్ని ప్రేమిస్తానో లేదో తెలుసుకోకుండా ఇలా గుండె ఇవ్వడం అవివేకం కదూ!" అన్నది.

"ఆలోచించి, సంకల్పించుకుని నిన్ను ప్రేమించానా! లేదు మీనా! ఎక్కడో నా గుండెలో ప్రేమని రగిలించే నరాన్నో, రక్తనాళాన్నో కండనో నీ కళ్ళతో, నీ మాటలతో, నీ రూపంతో నువ్వు పట్టుకున్నావనుకుంటాను. ఎలా జరిగిందో నాకు తెలియదు. మొదట్లో నీ చేత ఆకర్షింపబడుతున్నానని తెలుసుకోగానే ఎదురు తిరిగి అణచుకోడానికి ప్రయత్నించాను. తుఫానునో, సముద్రపు కెరటాన్నో అణచడానికి ప్రయత్నిస్తే ఎంత ప్రయోజనం ఉంటుందో అంతే ప్రయోజనమయింది. నేనేం చెయ్యలేను - నిన్ను ప్రేమించగలను అంతే!" అన్నాడు ఆవేశంతో.

అతన్ని జాలిగా చూసింది మీనాక్షి.

"మీనా! నిన్ను నేను మోసం చెయ్యడానికి ప్రయత్నిస్తున్నట్లు అలా నిందిస్తూ చూడక. నేను భరించలేను మీనా! మనం రేపే పెళ్ళి చేసుకుందాం ఒప్పుకో!"

"పెళ్ళా?" అడిగింది ఆశ్చర్యంతో.

"అవును. అందులో ఆశ్చర్యమేముంది! రేపే - నీ ఇష్టం, ఇప్పుడు వీలయితే ఇప్పుడే - నిన్ను విడిచి ఉండలేను. ప్రతి నిమిషం, ప్రతి క్షణం నీతో ఉండాలి. నీ గుండెలో, నీ మనస్సులో, నీ శరీరంలో నా గుండె, మనస్సు, శరీరం కలిపేసుకోవాలి మనం ఇద్దరం ఒకటయిపోవాలి"

పెళ్ళి! పెళ్ళి ఇతను తనని పెళ్ళి చేసుకుంటానన్నాడు. విచిత్రం - ఇప్పుడా తనకి పెళ్ళి? ఎమిటీ విధి వైపరీత్యం!

"నువ్వు నమ్మడం లేదు. నేను అబద్దాలు చెపుతున్నాననుకుంటున్నావు నేను నిజంగానే బి.ఏ పాసయ్యాను. నిజంగానే నాకు ఒక ఇల్లున్నది ఈ కథలు రాయడం మానేసి ఉద్యోగం చెయ్యమంటే చేస్తాను. నువ్వు ఏం చెప్పినా చేస్తాను చూపిస్తానుండు!" అని వెళ్ళిపోయాడు.

మీనాక్షి తల తిరుగుతోంది. ఏడుపూ కలిసిపోయి గొంతు పూడుకుపోయింది

పెళ్ళి - పెళ్ళి! యోగ్యుడు తెలివైనవాడు, సంస్కారం ఉన్న మనిషి, చదువుకున్న మనిషి అయిన భర్తకోసం తను ఎన్నేళ్ళు కాచుకుంది!

వసంత్‌లో అన్నీ ఉన్నాయి. కానీ తనకన్నా మూడేళ్ళు చిన్నవాడు. అదికాదు అసలు అభ్యంతరం.

తను ఇప్పుడు మామూలు మనిషికాదు. తనలో ఇంకో ప్రాణం ఉన్నది - ఎలా?

వసంత్‌ని తను ప్రేమిస్తున్నదా? ఏమిటా ప్రేమ? అతని చేతుల్లో పడుకుని నిద్రపోవాలనిపించడం; అతని కళ్ళల్లోకి చూస్తూ గంటలు, రోజులు గడిపెయ్యాలనుకోవడం; అతని మాటలు వింటూ అన్నమూ నీళ్ళూ మరిచి పోవడం ప్రేమా; అయితే అతన్ని తనూ ప్రేమిస్తోంది. మీనాక్షి ఇలా ఆలోచిస్తుండగానే అతను మళ్ళీ వచ్చి -

"ఇదిగో నా డిగ్రీ. ఇవిగో మనియార్డర్ కూపన్స్ అద్దెకున్నవాళ్ళు పంపినవి నమ్ముతావా?" అడిగాడు ఆత్రంగా.

"నువ్వు అబద్ధం చెప్పావనుకోలేదు వసంత్!"

"అయితే నువ్వు నన్ను ప్రేమించడంలేదంటావా?"

"ఏమో!" అన్నది.

"అబద్దం చెప్పక! నువ్వు అబద్దం చెపుతున్నావు. నిజం చెప్పు నన్ను ప్రేమిస్తున్నావు. నాకు తెలుసు. నువ్వు నాకు ఎంతగా కావాలో, నేను నీకూ అంతగా కావాలి!" అని ముందుకి జరిగాడు ఆమె భుజాలు పట్టుకునేందుకు.

మీనాక్షి అప్రయత్నంగా ఒక్క అడుగు వెనక్కి వేసింది.

"క్షమించు - నిన్ను ముట్టుకోనులే! నిజం చెప్పు! నువ్వు నన్ను ప్రేమిస్తున్నావు. ఒప్పుకో" అన్నాడు.

మీనాక్షి ఏడుస్తోంది.

"ఎందుకు ఏడుస్తావు? ప్రేమించడం తప్పుకాదు. ప్రేమించగలగడం గొప్ప - ఒప్పుకో!"

"వసంత్. మనం పెళ్ళి చేసుకోవడానికి వీల్లేదు" అన్నది దీనంగా.

"ఎందుకు వీల్లేదు? నువ్వు నన్ను ప్రేమిస్తే ఎవరు మనకి అభ్యంతరం చెప్పేవాళ్ళు!"

"వసంత్! నీ కన్నా నేను మూడేళ్ళు పెద్ద."

నవ్వాడు, పకపక నవ్వాడు. "అదా! అందుకా ఏడుస్తున్నావు. మీనా నా కన్నా నువ్వు మూడేళ్ళు చిన్నదానివి అయివుంటే ఇంతార్తిగా నిన్న నేను ఎక్కువగా ప్రేమించి ఉండగలిగేవాణ్ణా? మూడేళ్ళు పెద్దదానివయితేనేం!" అన్నాడు సంతోషంతో.

"కాదు వసంత్! మనం పెళ్ళిచేసుకోవడం అసంభవం."

"అసంభవమా! చాలా పెద్దమాట ఉపయోగించావు. పెళ్ళిచేసుకోనంటావా! చెప్పు ఏమిటి నీ అభ్యంతరం?" అడిగాడు ఆమె రెండుచేతులూ పట్టుకుని.

అయ్యో! అమాయకుడు వెర్రివాడు, నిష్కపటి. ఎంత పిచ్చివాడో తన నడుం చూస్తేనే తెలుస్తుందే! ఎలా చెప్పడం అతనికి మీనాక్షి పెదిమలు కొరుక్కుంటోంది.

"చెప్పు మీనా! నీకు పెళ్ళయిందా?"

"లేదు"

"మరెవర్ని అయినా ప్రేమిస్తున్నావా?"

"అదికాదు వసంత్."

"అయితే?"

"చెప్పలేను - నన్ను మరిచిపో" అని మొహం పక్కకి తిప్పేసింది. మీనాక్షి ప్రవర్తన అతనికి అర్థం కాలేదు. ఆశ్చర్యంతో ఆమెని చూశాడు. "మీనా పోనీ కారణం అయినా చెప్పకూడదా!" అడిగాడు.

మీనాక్షి మాట్లాడలేదు. అతను బరువుగా అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోయాడు.

****

## 20

**ఎంత ప్రయత్నించినా మీనాక్షికి ఆ రాత్రి నిద్రపట్టలేదు.**

వసంత్ కళ్ళు, అతని మాటలు, అతని కోరిక, అతని నిరాశ, అతని బాధ అన్నీ ఆమెని ముళ్ళలా పొడుతున్నాయి. తనమ దురదృష్టవంతురాలు ఈ ప్రపంచంలో ఉంటుందా అని కుమిలి కుమిలి ఏడ్చింది.

ఈ వసంత్ తనకి ఆరునెలల క్రితం ఆ నాగరాజు కనిపించక ముందు కనిపించి ఉండకూడదా!? తను విరక్తితో, అవివేకంతో తన నైర్మల్యాన్ని అర్పించిన తర్వాత ఆ దేవుడు - ఈ వసంత్ తనకి పరిచయం కావడంలో అర్థం ఏమిటి. భగవంతుడు తను చేసిన పాడుపనికి తనకి పాఠం చెప్పడానికే వసంత్‌ని పంపించాడా!?

వసంత్‌ని పెళ్ళి చేసుకుంటే ప్రతిరోజూ ఒక పండుగలా జీవితం గడిచిపోతుంది. ఎలా అతనికి చెప్పడం! ఏ మొగాడు చేసుకుంటాడు చూలాలిని! అతనికేం తక్కువ అని తనని ఈ పరిస్థితిలో వివాహం చేసుకోవాలి. అతనికి ఎలా చెప్పడం? అతనికి తనమీద ఉన్న మంచి అభిప్రాయం, ప్రేమపోతాయి. అది తను భరించలేదు.

"ఎందుకు? నన్ను ప్రేమించడంలేదా? అభ్యంతరం ఏమిటి? అని అతను అడుగుతున్నపుడు తన గుండె కోసేస్తున్నట్లయింది చెప్పకుండా ఉండలేదు; నిజం చెప్పనూ లేదు.

"నిన్నే ప్రేమిస్తున్నాను - కాని మనం పెళ్ళి చేసుకోవడానికి వీల్లేదు." అంటే ఎంత బాధ! ఎంత తపన! తండ్రో మరెవరో అభ్యంతరం చెపుతున్నారని సాకుకూడాలేదు. వసంత్ ఎంత బాధపడుతున్నాడో!

పక్కవాటాలో అడుగుల చప్పుడు; అగ్గిపుల్ల గీసిన చప్పుడు; చిన్నదగ్గు; ఓ చిన్న మూలుగు - వసంత్ కూడా మెలుకువగానే ఉన్నాడు. అతనూ చిత్తక్షోభతో నిద్రపోవటం లేదు. వసంత్ నిద్రపో అలా సిగిరెట్ తర్వాత సిగిరెట్ తాగుతూ ఎందుకు పచార్లు చేస్తావు? నేను నీకు తగను - అని మనస్సులో మౌనంగా అతనికి చెప్పుకుంది.

గడియారం రెండు గంటలు చూపిస్తోంది. మీనాక్షి మంచం మీదనుంచి లేచి వెళ్ళి మంచినీళ్ళు తాగింది. నెమ్మదిగా చప్పుడు చెయ్యకుండా తలుపుతీసి వసారాలోనికి వెళ్ళి నిలబడింది వసంత్ అడుగుల చప్పుడు ఇంకా వినిపిస్తోంది. అతని తలుపు దగ్గరికి వెళ్ళి తలుపుకి చెవి ఆనించి విన్నది.

అతను తనలో తను మాట్లాడుకుంటున్నాడు. జాగ్రత్తగా వింది.

"మీనా! నేనంటే నీకు ఇష్టంలేదా? అందుకేనా నన్ను వెళ్ళిపొమ్మన్నావు? నా మీద ప్రేమలేదని చెపితే నేను గుండె పగిలి చస్తానని జాలితో ప్రేమిస్తున్నానుకానీ పెళ్ళి చేసుకోనని చెప్పావా?"

"లేదు వసంత్ నిజంగానే నువ్వు అంటే నాకు చాలా ఇష్టం" అన్నది మీనాక్షి అప్రయత్నంగా.

అతను చటుక్కున ఆగి, తలుపు తెరిచాడు. మీనాక్షిని చూసి ఆశ్చర్యంతో, సంతోషంతో రెండు చేతులూ పట్టుకుని లోపలికి లాగి, "నిజమా! నువ్వేనా? వచ్చావా!" అన్నాడు. చాలా మృదువుగా మీనాక్షిని కౌగిలించుకుని "మీనా! ఇక వెళ్ళక!" అంటూ, అంతకన్నా మృదువుగా ఆమె చెంపలనీ, చెక్కిళ్ళనీ, నుదురునీ ముద్దుపెట్టుకున్నాడు.

"వసంత్ నిద్రపో!"

"నువ్వు?"

"నువ్వు నిద్రపోవడం లేదని వచ్చాను. పడుకో!"

"నువ్వు వెళ్ళిపోతే నాకు నిద్రరాదు"

"పడుకో! నేను నిద్రపుచ్చుతాను" అని అతని తల తన ఒళ్ళోకి లాక్కుని అతని జుట్టు నిమురుతూ నిద్ర ఎక్కువగా గొంతు వరకూ తినండి. సులభంగా జీర్ణం కాని పదార్థాలు- మీగడ, పప్పులు, నెయ్యి, వేపుళ్ళు తినండి. పడుకునే ముందు ఈ నూనె తాగండి. పొద్దున్నకి కడుపు నొప్పి వస్తుంది. సాయంకాలం లోపున  మీరు కోరినది జరుగుతుంది" అని చెప్పాడు.

మీనాక్షి డబ్బు ఇచ్చి, సీసా తీసుకుని వెళ్ళిపోయింది.

"ఎక్కడికి వెళ్ళావు?" అడిగాడు వసంత్ మీనాక్షి తలుపు తాళం తీస్తుండగా.

"బజారుకి."

అతను ఆమె వెనకే లోపలికి వెళ్ళి "నువ్వు పొద్దున్న కనపడకపోయేసరికి నీ తలుపు తాళం వేసి ఉండడం చూసి, నన్ను తప్పించుకునేందుకు ఇల్లు ఖాళీ చేసి వెళ్ళిపోయావేమో అనుకున్నాను" అన్నాడు.

మీనాక్షి ఆశ్చర్యపోయింది. రాత్రి ఆ ఆలోచనా వచ్చింది తనకి.

అరగంటసేపు కూర్చుని అతను లేచాడు. "నేను వెళ్ళాలి. వెళ్ళి రిజిస్ట్రార్ దరఖాస్తు పెట్టాలి!" అన్నాడు.

"దరఖాస్తు దేనికి??"

"పెళ్ళికి - రాత్రి నువ్వు నా గదికి వచ్చి సరేనన్నావు కదు!"

నవ్వి "ఇప్పుడే! అంత తొందరెందుకు?" అన్నది.

"నేను ఎలాగూ లైబ్రరీకి వెళ్ళాలి. మధ్యాహ్నం వరకూ రాను." అని వెళ్ళిపోయాడు.

మీనాక్షి ఆ పూట వంట చాలా జాగ్రత్తగా చేసింది. సులభంగా జీర్ణం కానివి డాక్టర్ రాత్రి తినమన్నాడు; తను పొద్దున్నుంచీ ప్రారంభించింది. మధ్యాహ్నం పనిమనిషి చేత మసాలాదోశె బజ్జీలు, వాంపాడి, జీడిపప్పులు తెప్పించుకుని ఇష్టం లేకపోయినా అతికష్టం మీద అన్నీ తినేసింది.

సాయంకాలం నాలుగు గంటలకి వచ్చాడు వసంత్,

"పడుకున్నావేం?" అడిగాడు ఆదుర్దాగా.

"ఊరికినే.."

"డ్రస్ చేసుకో! బీచికి వెళదాం"

"ఇవాళ నేను రాలేను"

"ఏం?

"బద్దకంగా ఉంది. అదీకాక ఇవాళ నీకు ఇక్కడ విందు భోజనం"

"ఏమిటి విశేషం?"

"ఊరికినే.."

అతను తన వాటాలోకి వెళ్ళి స్నానం చేసి బట్టలు మార్చుకుని వచ్చాడు. మీనాక్షి వంట ప్రారంభించింది. తను రాస్తున్న కథ గురించీ, రాసిన కథల గురించీ, రాయబోయే కథల గురించీ, చదివిన పుస్తకాల గురించీ తెగ మాట్లాడుతున్నాడు.

"నువ్వింత మాట్లాడతావని నేను అనుకోలేదు."

"విసుగ్గా ఉందా?"

"ఛ! చాలా ఇంట్రస్టింగ్‌గా ఉంది. నువ్వు అన్ని పుస్తకాలు ఎప్పుడు చదివావు?"

ముద్వంకాయకూర; పాలోళీ; కందిపచ్చడి; పెసర పచ్చడి; ఇంకా ఎన్నో చేసింది.

ఇద్దరూ ఎనిమిదిన్నరకల్లా భోజనానికి కూర్చున్నారు.

"ఎందుకిన్ని చేశావు?"

"ఊరికేనే"

కడుపు నిండి పోయింది మీనాక్షికి. అయినా కుక్కుతోంది నోట్లో. ఆయాసపడుతూనే ముద్ద తర్వాత ముద్ద నోట్లోకి ఎక్కించింది.

"ఎందుకు ఇలా కష్టపడి తింటున్నావు?" అడిగాడు.

"ఆకలేస్తోంది!"

మీనాక్షి ఆయాసంతో మంచం మీద చతికిలబడింది.

గిన్నెలు మర్నాడు పనిమనిషి వచ్చి తీస్తుందని అలాగే వదిలేసింది. వసంత్ సిగిరెట్ తర్వాత సిగిరెట్ తాగుతూ కబుర్లు చెప్తున్నాడు. పదిగంటల ప్రాంతాన మీనాక్షి రెండుసార్లు ఆవలించింది.

"నిద్ర వస్తున్నట్లుంది. నేను వెళతాను" అన్నాడు అతను.

"అవును. ఇవాళెందుకో త్వరగా నిద్రవస్తోంది."

అతను ఆమెని మృదువుగా పెదిమల మీద చిన్న ముద్దుపెట్టుకుని వెళ్ళిపోయాడు.

మీనాక్షి లేచి సుబ్రమణ్యం ఇచ్చిన మందు గడగడా తాగేసింది.

ఆముదంలా ఉంది. కడుపులో తిప్పింది. ఏమీ ఆలోచించకుండా దీపం ఆర్పి పడుకుంది.

ఒక రాత్రివేళ మీనాక్షికి మెలుకువ వచ్చింది. కడుపులో పోట్లు, ఎవరో రెండు చేతులూ పెట్టి కెలుకుతున్నట్లు, పేగులు పట్టి నలుపుతున్నట్లు బాధ ముచ్చెమటలు పోస్తున్నాయి కాళ్ళు, నడుం పీకేస్తున్నట్లున్నది. లేవాలి. లేచి దీపం వెలిగించాలి. లేవలేకపోయింది కూర్చో లేకపోయింది.

బాధ - విపరీతమైన బాధ, భరించలేని బాధ. అటూ ఇటూ దొర్లుతోంది. ధారలుగా కారిపోతోంది చెమట. కాళ్ళ వేళ్ళు, చేతివేళ్ళు వంకరలు తిరుగుతున్నాయి. స్వాధీనంలో లేదు ఏ అవయవమూ.

నెమ్మదిగా మూలుగుతోంది. టైమ్ ఎంతయిందో? ఎప్పుడు తెల్లారుతోందో చీకటి పోదు, వెలుగు రాదు. మూలుగు పెద్దదయింది. మూలుగకూడదు. పెద్దగా మూలిగితే వసంత్ నిద్రలేచి వస్తాడు అని తెలుసు. కానీ మూలుగు ఆపుకోలేకుండా ఉంది.

"అమ్మో! అమ్మో! అబ్బా, అబ్బా!" కేకలు వేస్తోంది.

తలుపు దబదబ చప్పుడయింది; అంత పెద్ద చప్పుడు ఎక్కణ్ణించో దూరాన్నుంచి వినిపిస్తున్నట్లున్నది.

"మీనా! తలుపు తియ్యి; ఏమైంది?" వసంత్ ఖంగారుగా అడగడం చెవిలో రహస్యంలా వినపడుతోంది.

"ఏం లేదు. నువ్వు వెళ్ళి పడుకో!" అన్నాననుకుంది. ఆ మాటలు అతనికి విపించిందీ లేనిదీ ఆమెకి తెలియదు.

తలుపు బాదుతున్నాడు. విరగకొడుతాడేమో! లేచి వెళ్ళి తలుపు తియ్యాలి లేదా ఆ అరుపులకి, ఆ గొడవకి అందరూ వస్తారు.

మంచం మీద నుంచి కిందకి దిగిపోయింది. కాళ్ళు వణికి నిలబడలేక కుప్పగా నేలమీద పడిపోయింది.

అతనికి ఏమీ వినపడలేదు మీనాక్షి మూలుగు తప్ప.

తలుపు తంతున్నాడు. పాకుతూ తలుపు దగ్గరికి వెళ్ళి గడియ తీసింది.

గడియ చప్పుడు కాగానే వసంత్ తలుపు తోశాడు.

పూర్తిగా తెరుచుకోలేదు. తలుపుకి అడ్డంగా నేలమీద పడున్న మీనాక్షిని చూసి "మీనా! నా మీనా! ఏమైంది?" అని ఆమెని దాటి లోపలికి వెళ్ళాడు.

మీనాక్షి కళ్ళు మూసుకుని మూలుగుతోంది. రెండు చేతుల్లో ఆమెని ఎత్తుకుని, మంచం మీద పడుకోపెట్టాడు. తన షర్టు చివరలతో ఆమె గెడ్డం, నుదురు, మెడ తుడిచి "మీనా! మీనా ఏమైంది?" అడిగాడు లాలనగా, ప్రేమగా, "ఏమీలేదు - కడుపులో కాస్త నెప్పి; అజీర్ణం. నువ్వు వెళ్ళు!" అంది.

"నేను వెళ్ళనా! నిన్ను ఇలా వదిలి వెళ్ళి ఎలా నిద్రపోతాను!"

చిన్నగా నవ్వింది. "టైమ్ ఎంతయింది?" అడిగింది.

"నాలుగు" అన్నాడు అతను.

"అంతే - ఎప్పుడు తెల్లారుతుంది" మాట్లాడలేదు.. నెప్పి; కళ్ళు తిరుగుతున్నాయి. తెల్లారితే ఈ నెప్పిపోతుందని ఆశ.

"మంచి నీళ్ళు ఇవ్వనా?"

"ఒద్దు నాకేమీ వద్దు" లేస్తోంది.

"ఎక్కడికి?" లేస్తోంది.

"ఎక్కడికి?" అడిగాడు.

"నీళ్ళగదికి -"

చెయ్యిపట్టుకుని నీళ్ళ గది వరకూ నడిపించాడు.

"తలుపు వేసుకోవద్దు" అన్నాడు వెనక్కి తిరిగి.

రెండు నిమిషాల తర్వాత మీనాక్షి మూలుగుతూ నీళ్ళ గదిలోంచి బయటికి వచ్చింది.

"మీనా! డాక్టర్ని పిలుస్తాను."

"ఒద్దు.. ఏమీలేదు. అజీర్ణం. నువ్వు వెళ్ళు!" పడుకుని మూలుగుతోంది. నెప్పి తెరలు తెరలుగా వస్తోంది. ఒకొక్కసారి నొప్పి వచ్చినప్పుడు తట్టుకోలేక వేళ్ళగోళ్ళతో అతని అరిచేతిని గీరుతోంది.

"డాక్టర్ని పిలిస్తే నిమిషంలో మందు ఇచ్చి తగ్గిస్తాడు"

"నాకు డాక్టర్ వద్దు."

మీనాక్షి యమబాధ పడుతోంది. వసంత్ ఏమీ తోచక, ఏమీ చెయ్యలేక క్షణక్షణానికి ఆమె అరిచేతిని నొక్కుతూ, చెమట తుడూస్తూ గడిపాడు తెల్లవారేవరకూ.

తెల్లారగట్ట పనిమనిషి వచ్చి, నీళ్ళగదిలోకి వెళ్ళి బయటికి వచ్చి పక్క మీద మీనాక్షినీ, పక్కన కూర్చున్న వసంత్‌ని పరీక్షగా చూస్తూ నిలబడింది.

"నువ్వు వెళ్ళి పనిచూసుకో!" అన్నాడు వసంత్.

"అమ్మగారికి మందు ఇస్తున్నారా?"

"లేదు. అజీర్ణం. మందు వద్దంటోంది"

"డాక్టరమ్మని పిలవండి" అన్నది పనిమనిషి.

వసంత్ కి అర్థం కాలేదు. "ఎందుకు? డాక్టరమ్మ ఎందుకు?" అడిగాడూ.

"చెప్పిన మాట వినండి. అమ్మగారు వద్దన్నా వినిపించుకోవద్దు. డాక్టరమ్మని పిలవండి. చాలా ప్రమాదం"

ప్రమాదం అనే మాట వినగానే వసంత్ గుండెల్లో రాయిపడినట్లయింది. "నువ్వు ఇక్కడే ఉండు. నేను పిలుచుకుని వస్తాను" అని పరిగెత్తాడు.

వసంత్, పనిమనిషి ఏం మాట్లాడినదీ, అతను ఎక్కడికి వెళ్ళినదీ విచారించే స్థితిలో లేదు మీనాక్షి. నరకయాతన పడుతోంది.

అరగంటలో వసంత్ లేడీ డాక్టర్‌ని పిలుచుకు వచ్చాడు. మీనాక్షి వాటా తలుపు మూసేసింది డాక్టర్. వసంత్ వసారాలో తారట్లాడుతున్నాడు.

లేడీ డాక్టర్ మీనాక్షిని పరీక్ష చేసింది. ఆమె ప్రశ్నకి జవాబు చెప్పే స్థితిలో లేదు. అందువల్ల డాక్టర్ మీనాక్షికి ఇంజక్షన్ ఇచ్చి బయటికి వచ్చింది.

"డాక్టర్! ఎలా ఉంది?" అడిగాడు వసంత్.

"మీతో మాట్లాడాలి. ఇంకో గదిలేదా?" అడిగింది డాక్టర్.

"రండి! ఇది నావాటా!" అని తన వాటా తలుపు తెరిచాడు.

"ఆమె మీకు ఏమవుతుంది?" డాక్టర్ మొదటి ప్రశ్న -

"ఎవరు? మీనాక్షా? ఇప్పుడేమీ కాదు. మేము వివాహం చేసుకోపోతున్నాం."

"అలాగా! వివాహం చేసుకుపోయేవాళ్ళు ఎందుకని తొందరపడ్డారు?"

"తొందరా! దేనికి?"

"సరే - ఈ ప్రశ్నకి జవాబు చెప్పండి. ఈ మందు ఎవరు తెచ్చారు? మీరేనా?" అని మీనాక్షి గదిలోంచి తెచ్చిన సీసా చూపించింది.

"నేనా! నేను తీసుకురాలేదు. మీనాక్షి తెచ్చుకునుండాలి."

"మందు తీసుకుని పోగొట్టుకోమని మీరు చెప్పారా?" వసంత్‌కి సహనం పోయింది. "డాక్టర్ మీరు అంటున్నదేమిటో నాకు అర్థం కావటం లేదు. దయచేసి విపులంగా చెప్పండి!" అన్నాడు.

"నాలుగోనెల అయివుండాలి. చూలాలు, కడుపు పోగొట్టుకోవడానికి మందు తీసుకుంది. చేసినది నేరం. ఆమె ఆ నేరం చెయ్యడానికి ఆమెకి తోడ్పడినవాళ్ళు కూడా శిక్షార్హులు. ఇంతకన్నా విపులంగా చెప్పాలా?" అడిగింది డాక్టర్ రుసరుసలాడుతూ.

"మీనాక్షికి కడుపా! నాలుగోనెలా? నేను నమ్మను" అన్నాడు వసంత్.

"నిజంగా మీకు తెలియదా?"

"డాక్టర్ నాకు తెలియదు. తెలిస్తే అటువంటి పని చెయ్యనిచ్చేవాణ్ణి కాను. ఇప్పుడు అర్థమవుతోంది చదువుకున్నది, సంస్కారం ఉన్న మనిషి ఇలా ఒంటిగా ఎందుకు ఇక్కడికొచ్చి ఉందో"

డాక్టర్ వసంత్‌ని ఇంకా ప్రశ్నలు అడిగింది. అతను దాచకుండా జవాబులు చెప్పాడు. డాక్టర్‌కి అర్థమైంది మీనాక్షి ఎందుకు ఇలా చేసిందో?

"సామాన్యమైన పరిస్థితుల్లో అయితే పోలీసులకి రిపోర్ట్ చేసేదాన్ని. కాని ఇప్పుడు- ఇటువంటి పరిస్థితిలో పోలీసులకి రిపోర్టు చెయ్యడం మంచిది కాదు. జరిగిన హానిలేదు. ఇంజక్షన్ ఇచ్చాను. పోలీసులకి రిపోర్టు చేస్తే పోలీసు విచారణ అయి పాపం ఈమె జీవితం నాశనం అవుతుంది. నాలుగురోజులపాటు ఆమెని చాలా జాగ్రత్తగా చూసుకోవాలి. శుశ్రూష చెయ్యాలి. మంచం మీదనుంచి కదలనివ్వకూడదు. ఇప్పుడు ఆమెని ఏమీ అడగకూడదు. అసలే బాధతో ఉంది. నాలుగురోజులపాటు ఒక ఆయాని కాని, నర్సునికానీ పెట్టండి!" అన్నది ఆమె.

"నర్సా! ఎలా పిలిపించడం?" అడిగాడు.

"రోజుకి పదిరూపాయలు ఇవ్వాలి. ఇరవైనాలుగు గంటలూ ఇక్కడే ఉంటుంది నేను పంపిస్తాను."

"థాంక్స్ డాక్టర్ - ప్రాణానికి -"

"ఏమీ ప్రమాదం లేదు. మందులు ఎప్పుడు ఎలా ఇవ్వాలో నర్సుకి చెపుతాను - ఇవిగో ఇవి తెప్పించండి - మళ్ళీ రేపు వచ్చి చూస్తాను" అని ఫీజు తీసుకుని వెళ్ళిపోయింది డాక్టర్.

గంట తర్వాత యాభై ఏళ్ళ స్త్రీ వచ్చింది. డాక్టర్ పంపిన నర్సు ఆమె.

## 22

**డాక్టర్ నిద్రకి కూడా మీనాక్షికి ఇంజక్షన్ ఇచ్చింది -**

కళ్ళు మూసుకుని పడుకున్నది మంచం పక్కన నర్సు కూర్చుని కనిపెడుతూ ఉన్నది.

ఆ రోజంతా వసంత్ ఇంట్లోంచి కదలలేదు. రెండు మూడుసార్లు మీనాక్షి గది తలుపు తోసి చూశాడు. తలుపు లోపల గడియపెట్టివుంది. కాగితాలు తీసుకుని ఏదో రాసుకోడానికి ప్రయత్నించాడు. కలం కదలలేదు. చదువుకోవడానికి పుస్తకాలు తీశాడు; అక్షరాల మీద దృష్టి నిలవలేదు. గదిలో పచార్లు చేస్తూ గడిపేశాడు ఆ రోజంతా.

మర్నాడు పొద్దున్నే ఎనిమిది గంటలకల్లా డాక్టర్ వచ్చింది. పదినిమిషాలు మీనాక్షి గదిలోవుండి బయటికి వచ్చింది.

వసంత్ ఆమెకోసం కాచుకున్నాడు.

"డాక్టర్!"

"ఆఁ!"

"ఎలా ఉంది?"

"చెప్పానుగా! ప్రమాదం ఏమీలేదు" అన్నది డాక్టర్ అతని గదిలోకి వెళ్ళి.

"గర్భం పోతుందా?"

"ఊఁఊఁ! పోతే నేను రిపోర్టు చెయ్యవలసి వచ్చేది."

"ఇంకా ఎన్ని రోజులు పడుతుంది. ఆమె మామూలుగా లేచి తిరగడానికి?"

"వారం రోజులు"

"మాట్లాడుతోందా?"

"ఆఁ?"

"నన్ను అడిగిందా?"

"ఆ వెళ్ళి చూడండి!" అని చెప్పి డాక్టర్ వెళ్ళిపోయింది.

వసంత్ మీనాక్షిని చూడడానికి వెళ్ళలేదు.

మధ్యాహ్నం నర్సు వచ్చి వసంత్ తలుపు తట్టింది.

"ఏమిటి?"

"ఆమె మిమ్మల్ని చూడాలంటున్నారు"

"నేను ఇంట్లో లేనని చెప్పండి?" అన్నాడు వసంత్.

మీనాక్షిని కలుసుకోలేడు. ఆమె మొహం చూడలేడు. ఎందుకో తనకే తెలియదు.

సాయంకాలం మళ్ళీ వచ్చింది. మీ నర్సుతో "ఒకసారి మాట్లాడాలంటున్నారు. రాకూడదూ?" అడిగింది.

"ఒద్దు నన్ను చూస్తే ఎక్సయిట్ అవుతుంది. ఎక్సయిట్ కావడం మంచిది కాదు" అన్నాడు వసంత్. అతను ఆ రాత్రంతా నిద్రపోలేదు; రాస్తూ కూర్చున్నాడు. తెల్లారిం తర్వాత బయటికి వెళ్ళి పన్నెండు గంటలకి తిరిగి వచ్చాడు.

"మీ కోసమే కాచుకున్నాను. ఆమె మిమ్మల్ని అడుగుతున్నారు" అన్నది నర్సు.

"డాక్టర్ గారు వచ్చారా!"

"వచ్చారు. ఇక ఏమీ ఫర్వాలేదు అనీ, మీరు కలుసుకుని మాట్లాడవచ్చనీ చెప్పారు."

"అలాగా! మాట!" అని లోపలికి పిలిచాడు నర్సుని. ఆమె లోపలికి రాగానే బల్ల సొరుగులోంచి ఒక కవరు తీసి, అందులో ఇంకొక కవరు పెట్టి "ఇది మీనాక్షికి ఇవ్వండి. ఇప్పుడు కాదు సాయంకాలం ఇవ్వండి. ఇప్పుడు నేను ఇంట్లోలేనని చెప్పండి" అన్నాడు.

"ఆమెని మీరు కలుసుకోరా?"

తల ఊపాడు వసంత్.

నర్సు వెళ్ళిపోతోంది. వసంత్ ఆమెని వెనక్కి పిలిచాడు.

"ఇదిగో! పదిరోజులకి మీకు డబ్బు. వందరూపాయలు."

"పది రోజులుండమంటారా?"

"అవును. జాగ్రత్తగా చూసుకోండి. అఘాయిత్యం ఏమైనా చేస్తుందేమో? వెయ్యికళ్ళతో కనిపెట్టి ఉండండి" అని చెప్పాడు.

నర్సు ఆశ్చర్యపోయింది. మీనాక్షిని కలుసుకోవడానికి నిరాకరించే మనిషికి ఆమె మీద ఇంత జాలి ఎందుకో అనుకున్నది.

## 23

లేడీ డాక్టర్ మీనాక్షిని పరీక్షచేసి "యు ఆర్ నౌ ఆల్ రైట్! మీతో ఇప్పుడు కాస్త సీరియస్‌గా మాట్లాడదలిచాను" అన్నది.

మీనాక్షి కళ్ళప్పగించి డాక్టర్ని చూసింది.

"మీ స్నేహితుడు వసంత్‌తో వివరంగా మాట్లాడాను. పరిస్థితి గ్రహించాను. మీ మీద జాలి కలగడం వల్ల నేను పోలీసులకి రిపోర్టు చెయ్యలేదు. మళ్ళీ ఇటువంటి పని ఇంకెపుడూ చెయ్యనని వాగ్దానం ఇస్తారా?" అడిగింది డాక్టర్.

తల ఊపింది మీనాక్షి.

"అబద్ధాలు చెప్పి, నిజం కప్పి పుచ్చి, ఒక మనిషి అనురాగమూ ఆపేక్ష సంపాదించి ప్రయోజనం లేదు, నిజం బయటపడితే అది పోతుంది. మీరు ఆయనకి నిజం చెప్పి ఉండవలసింది. ఇలాంటి పరిస్థితిలో మిమ్మల్ని స్వీకరించేటంత విశాల హృదయం, గాఢమైన ప్రేమ అతనికి ఉన్నాయేమో తెలుసుకోవలసింది. అని అతనికి లేకపోతే ఎలాగూ అతనితో మీరు సుఖపడరు. కనుక అతను మిమ్మల్ని నిరాకరించి వెళ్ళిపోతే చింతించవలసిన అవసరం ఉండేది కాదు. ఇప్పుడు, నానుంచి ఈ విషయం తెలుసుకున్న తర్వాత అతను చాలా షాక్ అయ్యాడు."

"వసంత్ ఏడీ? కనిపించడేం? ఎందుకు నన్ను చూడడానికి రాడు?" అడిగింది మీనాక్షి.

లేడీ డాక్టర్ నర్సు వైపు తిరిగి "ఆయన్ని పిలు!" అన్నది.

"ఆయన లేరు నిన్న రాత్రినుంచీ రాలేదు. ఈ ఉత్తరం ఈమెకి ఇవ్వమన్నారు." అని కవరు డాక్టర్‌కి ఇచ్చింది నర్సు. డాక్టర్ కవరు చూసింది 'మీనాక్షికి' అని రాసి ఉంది కవరు మీద. కవరు మీనాక్షికి ఇచ్చింది. మీనాక్షి కవరు చింపింది. అందులో పదిరూపాయల నోట్లు ఉన్నాయి. లెక్క పెట్టకుండా ఆ నోట్లు పక్కమీద పడేసి, ఉత్తరం తీసి చదివి వెక్కి వెక్కి ఏడ్వడం ప్రారంభించింది.

"ఏడవకండి! ఏమిటి?" అన్నది డాక్టర్.

"ఏడవక ఏం చెయ్యను అతన్ని నేను ఎంత బాధించానో మీకేం తెలుస్తుంది!" అన్న ఉత్తరం డాక్టర్‌కి ఇచ్చింది మీనాక్షి.

ఇంకొకళ్ళ ఉత్తరం చదవడం డాక్టర్‌కి ఇష్టంలేదు. కానీ రోగికి సంబంధించినది. ఆమెకి తను ఏమైనా సహాయం చెయ్యగలనేమోనని ఉత్తరం చదవడం ప్రారంభించింది.

**"మీనాక్షి!**

ఈ రెండు రోజులూ నేను ఎంత క్షోభపడ్డానో నీకు చెప్పినా అర్థం కాదు. నువ్వు పడిన బాధకన్నా వెయ్యిరెట్లు ఎక్కువ బాధపడ్డాను. నన్ను పెళ్ళి చేసుకోవడానికి నువ్వు అభ్యంతరం ఎందుకు చెప్పావో ఇప్పుడు అర్థమైంది. నేను నీచే ఆకర్షింప బడుతున్నానని నీకు తెలిసినపుడే నాకు చెప్పి ఉండవలసింది - అలాకాక నాకు ఆశచూపించి; నేను పూర్తిగా నీ దాసుణ్ణి అయిన తర్వాత, అభ్యంతరం చెప్పడం చాలా నీచమైన పని. అంతేకాదు, రహస్యంగా నువ్వు నీ గర్భం పోగొట్టుకోడానికి చేసిన ప్రయత్నం మరీ రాక్షసమైన పని. ఒకవేళ ఏమీ గొడలేకుండా నీ కడుపు పోయివుంటే నాకు ఏమీ చెప్పకుండా నన్ను పెళ్ళిచేసుకుని ఉండేదానివి. అవునా అంటే నన్ను మోసం చెయ్యడానికి నువ్వు సిద్ధపడ్డావు.

మోసమూ, రాక్షసత్వమూ ఉన్నచోట ప్రేమ ఉండటానికి వీలులేదు. ప్రేమ దైవత్వం. ప్రేమ నిస్వార్థమైనది. నువ్వు ప్రేమించలేవు; నువ్వు నన్ను ప్రేమించలేవని నిశ్చయించుకున్నాను.

కనుక ఇక మళ్ళీ నిన్ను చూడదలుచుకోలేదు. నా జీవితం ఏమవుతుందో నాకే తెలియదు. స్పష్టంగా ఏదీ ఆలోచించే స్థితిలో లేను.

నువ్వు నన్ను వీలయినంత త్వరగా మర్చిపో; నీకు పుట్టబోయే పిల్లనో పిల్లాణ్ణో ప్రేమతో పెంచి నువ్వు చేసిన, చేయబోయిన పాపానికి పరిహారం చేసుకో! నన్ను మరిచిపోవడం నీకు కష్టంకాదని నాకు తెలుసు.

ఈ జీవితంలో నిన్ను నేను మరిచిపోలేను.

ఈ జీవితంలో నేను ఇంకొకర్ని ప్రేమించలేను.

ఈ విషయాలు నాకు తెలుసు.

నేను చిత్తక్షోభతో, రంపపు కోతతో జీవితం దుర్భరమై చావలేక, బతకలేక, జీవచ్ఛవం అయితే అది నా ఖర్మ. అంతే.

డాక్టర్‌కీ, నర్సుకీ, మందులకీ నీ వద్ద డబ్బు ఉందేమోననీ, ఉన్నా నువ్వు బాంకుకి వెళ్ళి తెచ్చుకోలేవేమోననీ నూరు రూపాయలు ఈ కవరులో పెట్టాను. నర్సుకి నూరు రూపాయలు ఇచ్చాను.

**గుడ బై**

**వసంత్"**

ఆ ఉత్తరం మడచి కవరులో పెట్టింది. డాక్టర్.

"అతను మిమ్మల్ని నిజంగా చాలా సిన్సియర్‌గా ప్రేమించాడు. అదృష్టవంతురాలు మీరు" అన్నది.

కళ్ళనీళ్ళతో మీనాక్షి డాక్టర్ని చూసి "అదృష్టవంతురాల్నా! అంతటి ప్రేమని పోగొట్టుకున్న నేను అదృష్టవంతురాల్నా" అడిగింది.

"ప్రేమ ఎక్కడికి పోతుంది వస్తాడు రేపో ఎల్లుండో అంతగా ప్రేమిస్తున్న మనిషి మిమ్మల్ని క్షమించగలుగుతాడు" అని ధైర్యం చెప్పి డాక్టర్ వెళ్ళిపోయింది.

****

వారం రోజుల్లో మీనాక్షికి ఆరోగ్యం వచ్చేసింది. లేచి తిరగ గలుగుతోంది. నర్సుని పంపించేసింది. వంట చెయ్యడం లేదు. హోటలు నుంచి తెప్పించుకుంటోంది. పక్కవాటాలోకి ఎవరో ఇద్దరు స్టూడెంట్స్ వచ్చారు.

మీనాక్షి గుమ్మందాటి బయటికి వెళ్ళడంలేదు. కన్ను మూసుకున్నా, కన్ను తెరచినా, మెలుకువగా ఉన్నా, నిద్రపోయినా, ఏం చేస్తున్నా వసంత్ స్మరణే ఆమెకి అతనేమయ్యాడు? నిజంగా తనని మరచిపోయాడా? తన మీద అసహ్యము, ద్వేషమూ కలిగాయా? లేడీడాక్టర్ అతను రెండు రోజుల్లో తిరిగి వస్తాడన్నదే! పదిరోజులు దాటిపోయాయి. అతను రాలేదు ఇక అసలు రాడేమో!? తనకి ఇక కనపడడేమో!? అతను ఎంత బాధ పడుతున్నాడో! బాధ భరించలేక ఛీ! ఛీ! అంత పనిచెయ్యడు.

పత్రికలు తెప్పించేది. ఏ పత్రికలోనైనా అతని కథ ఉన్నదేమోనని చూసేది. ఎక్కడా అతని పేరు కనిపించేది కాదు, అంతపని చేస్తాడా? ఆత్మహత్య చేసుకుంటాడా? వెక్కి వెక్కి ఏడుస్తుంది. నిద్రపట్టినా కలలో వసంత్ కనపడతాడు. వసంత్! వసంత్! అని పిలుస్తుంది. తను పూర్వజన్మలో చాలాఘోరమైన పాపాలు చేసి ఉండాలి. లేకపోతే తన జీవితం ఇలా కాదు. వసంత్ కనిపించకపోయినా, అతను తనని ప్రేమించకపోయినా ఎండిపోతున్న తన బతుకు అలా ఎండిపోయేది! నీళ్ళు పోసినట్లయి, మళ్ళీ చిగిరించి, బతుకులో ఉత్సాహం, సంతోషం అంటే ఏమిటో, గుండెలోకి వెలుగువస్తే ఎలా ఉంటుందో తెలిశాక ఈ నైరాశ్యం, ఈ వెలితి, ఈ చీకటి తను ఎలా భరిస్తుంది?

రోజులు గడుస్తున్నాయి. నెల దాటిపోయింది వసంత్ ఇక మళ్ళా కనిపిస్తాడనే ఆశ పూర్తిగా పోయింది మీనాక్షికి. బతకాలనే ఇచ్ఛ పోయింది. డాక్టర్‌కి మాట ఇచ్చింది మళ్ళీ అఘాయిత్యం చేయనని. ఏమీ చెయ్యకూడదు. కానీ కాన్పులో తన ప్రాణం పోతే తన కడుపులో పాప, పోనీ ఈ అభాగ్యురాలి కడుపున పుట్టి ఆ పాపమాత్రం ఏం సుఖపడుతుంది! పెరిగి పెద్దదయి ఎన్ని కష్టాలు, ఎంత బాధ, ఎంత నరకం అనుభవిస్తుందో?

తింటోంది, ఊపిరి పీలుస్తోంది, స్నానం చేస్తోంది, బట్టలు వేసుకుంటోంది, ఇవన్నీ ఊపిరి పీల్చినట్లు తన ప్రయత్నం లేకుండా, ఆలోచించకుండా చేస్తోంది.

చావు. చావు వస్తే చావురావాలనే కోరుకుంటూ ప్రతి గంటా గడుపుతోంది.

మరో నెలగడిచిపోయింది.

ఆరునెలలు దాటాయి. ఇంక మూడు నెలలు గడపాలి. అంతే కాన్పులో తను బతకనని మీనాక్షికి గట్టి నమ్మకం. ఎందుకో తనకే తెలియదు.

****

ఇంకా తెల్లారలేదు ఎవరో అప్పుడే తలుపు తడుతున్నారు.

పాలమనిషి ఇంత త్వరగా రాదే! పనిమనిషి కూడా చీకటిలో రాదు ఎవరు?

మీనాక్షి లేచి వెళ్ళి తలుపు తీసింది. తన కళ్ళని తనే నమ్మలేకపోయింది "వసంత్" అన్నది.

అతను నిమిషం పాటు ఆమెను రెప్పవాల్చకుండా చూసి బొంగురు పోయిన స్వరంతో "మీనా! నన్ను క్షమించవూ?" అన్నాడు.

"నిన్ను నేనా క్షమించడం! రా వసంత్!" అని చెయ్యి పట్టుకుని లోపలికి తీసుకెళ్ళింది. "అవును. నిన్ను ఆ స్థితిలో వదిలి వెళ్ళినందుకు. నేను రాక్షసుణ్ణి! స్వార్థపరుణ్ణి ఏమ్మాత్రమైనా నాలో మానవత్వం ఉంటే నిన్ను అలా ఒంటిగా వదిలి వెళ్ళేవాణ్ణి కాను" అన్నాడు.

"కూర్చో వసంత్ నాకు మాటరావడంలేదు సంతోషంలో. నేను బతికి ఉండగా మళ్ళీ నిన్ను చూస్తానని అనుకోలేదు. వసంత్ ఏమయ్యావు ఇన్నాళ్ళు?" అడిగింది దీనంగా.

"మొదట్లో నీ మీద కోపం వచ్చింది. నన్ను మోసం చేశావనీ, నాకు ముందే చెప్పలేదనీ. కావలసి, ఆలోచించి నన్ను నీ వలలో వేసుకున్నావని నిన్ను తిట్టుకున్నాను. తర్వాత, రోజులుదొర్లిపోయాక తెలిసి వచ్చింది మీనా నీ ప్రేమలో గొప్పతనం! నాకోసం నీలో ఉన్న ఇంకో ప్రాణాన్ని! నీ కడుపులో పాపాయిని బలి ఇవ్వడానికి సిద్ధపడ్డావు. ఇక్కణ్ణించి వెళ్ళిపోయి నాలో నేను బాధపడుతూ తర్కించుకుంటూ మధనపడ్డాను. అప్పుడు తెలిసింది నీ ప్రేమలో గొప్పదనం, నిస్వార్థం.

"అప్పుడే ఎందుకు రాలేదు?"

"అభిమానం వల్ల నువ్వు నన్ను చీదరించుకుని పొమ్మంటావనే భయంవల్ల" అన్నాడు వసంత్ తలవంచుకుని.

"పిచ్చి వసంత్! నిన్ను నేను ఎన్నడయినా చీదరించుకోగలనా?" అన్నది అతని జుట్టు నిమురుతూ.

"మీనా! ఇంకా నువ్వు నన్ను ప్రేమిస్తున్నావా?"

"అదేం ప్రశ్న వసంత్? నిన్ను ప్రేమించడం ఎలా మానగలను? నా మీద ప్రేమకొద్దీ నువ్వు తప్పంతా నీమీద వేసుకుంటున్నావు కానీ, వసంత్ నీకు నేను అనర్హురాలిని."

"మీనా, ప్రేమకి అర్హతార్హతలు లేవు" అన్నాడు.

మీనాక్షి సంతోషంతో నవ్వుతోంది. కళ్ళల్లో నీళ్ళు. ఏడుపు కాదు; సంతోషం.

"మీనా వీలయినంత త్వరలో మనం పెళ్ళిచేసుకుందాం"

"పెళ్ళా! ఈ స్థితిలోనా"

"అది ఇప్పుడు నాకు అభ్యంతరం లేదు మీనా పెళ్ళిచేసుకోకుండా మనం కలిసివుంటే మాన బాంధవ్యం నీతిరహితంగా తోస్తుంది. అటువంటి బాంధవ్యం నేను సహించలేను."

"కాన్పు కానీ -" అన్నది నెమ్మదిగా.

"ఎందుకు అంతవరకూ కాచుకోవాలి? ఈ క్షణాన్నించీ నిన్ను వదలను వీల్లేదు మీనా? మనం పెళ్ళిచేసుకోవాలి."

"నా పాపాయి!" అడిగింది దీనంగా.

"నీది కాదు మన పాపాయి అవుతుంది. నువ్వు నా దానివి. నీ పాపాయి నా పాపాయి అవుతుంది. ఇక వాదించకు" అన్నాడు.

****

## 24

**పదిహేను రోజుల తర్వాత రిజిస్ట్రార్ ఇంటికి వచ్చి మీనాక్షికీ,** వసంత్‌కీ వివాహం చేశాడు. నిండు చూలాలు అయిన మీనాక్షిని విచిత్రంగానూ, వసంత్‌ని కొంచెం అసహ్యంతోనూ చూశాడు. మీనాక్షి స్థితికి అతనే కారకుడని అనుకున్నాడు.

వివాహం అయిన రెండు రోజుల తర్వాత మైలాపూరులో చిన్న ఇల్లు అద్దెకి తీసుకుని అక్కడికి మారారు. వసంత్ రాసిన రెండు నవలలకి పబ్లిషర్స్ వచ్చి డబ్బు ఇచ్చి తీసుకెళ్ళడంతో అతని చేతినిండా డబ్బు ఉంది. టేబుల్ ఫ్యాన్ కొన్నాడు. మెత్తని పరుపు, దిళ్ళు కొన్నాడు.

మీనాక్షిని పక్క మీదనుంచి కదలనివ్వడు. మంచినీళ్ళు కావలసినా తనే అందిస్తాడు. బజారుకి వెళ్ళి బిస్కట్లు, చాక్‌లెట్లు ఇంకా ఎన్నో రకరకాల తీపి వస్తువులు తెస్తాడు. తల నొప్పిగా ఉందంటే తలరాస్తాడు. తోచడంలేదంటే కథలు చెపుతాడు. విసుగ్గా ఉందంటే టాక్సీలో బీచ్‌కి తీసుకెళతాడు.

"వసంత్! పోయిన జన్మలో నువ్వు నాకేదో రుణపడి ఉండాలి!" అన్నది మీనాక్షి.

"ఏం?"

"నీకు నేను ఏం ఇవ్వగలుగుతున్నాను? గట్టిగా కావలించుకోవడానికి కూడా వీల్లేదు. ఇటువంటి పరిస్థితిలో నన్ను పెళ్ళిచేసుకుని, నన్ను పసిపాపని చూసినట్లు చూసుకుంటున్నావంటే ఇది పూర్వజన్మ రుణానుబంధం కాకపోతే ఏమిటి?" అన్నది

"పోయిన జన్మ విషయం మనకేం తెలుసు? ఎవరు ఎవరికి రుణపడి ఉన్నారో! నాకేం ఇస్తున్నావా? నీ పక్కన కూర్చోవడం చాలు. నీ కళ్ళల్లోకి చూడడం స్వర్గం. నీ నవ్వు నాకు వెలుగు, నీ వేళ్ళ స్పర్శ ఎంత సుఖం? నీ పెదిమల తడిలో ఎంత తీపి? ఇంతకన్నా నాకేం కావాలి? మీనా, నువ్వు ఆనందంగా ఉండి నన్ను ప్రేమిస్తే చాలు" అన్నాడు ఆమె చెంపలు నిమరుతూ.

"ఆనందంగా నా వసంత్! ఇంత ఆనందం నేను ఎన్నడూ ఎరగను. నాకు అసలు ఈ ప్రపంచంలో ఆనందం వస్తుందనుకోలేదు. వాంఛ లేకుండా ఇలా మనం ఒకళని ఒకళ్ళం ప్రేమించ గలుగుతున్నామంటే - మనం గొప్ప వాళ్ళమా? లేక మన ప్రేమ గొప్పదా!"

"మన ప్రేమ - ప్రేమించగలిగే వాళ్ళంతా గొప్పవాళ్ళే మీనా!"

"వసంత్? నాకు భయమేస్తోంది"

"ఎందుకు?"

"ఈ ఆనందం ఉండదని. నాకు అంత అదృష్టం లేదు."

"ఛ! అలా అనక. నా మాట నమ్ము. నేను ఈ జీవితంలో నిన్ను వదిలి ఎక్కడికీ వెళ్ళను."

"నువ్వు వెళ్ళవు - కాని నేను వెళ్ళిపోతానేమో వసంత్!"

"నువ్వు ఎక్కడికి వెళతావు? నేను వెళ్ళనివ్వను"

జాలిగా నవ్వింది "వసంత్! నువ్వు వెళ్ళిపోయిన తర్వాత నేను జీవితం భరించలేక ప్రతిక్షణమూ భగవంతుణ్ణి ప్రార్థించేదాన్ని." అన్నది.

"నాకు బతకాలని లేదనీ, నన్ను తీసుకువెళ్ళమనీ, ఈ ప్రపంచంలో నేనిక ఉండలేననీ."

ఆమె గెడ్డం పట్టుకుని "ఇప్పుడు?" అడిగాడు.

"భగవంతుడా! తెలియక అప్పుడు అలా కోరాను. క్షమించు, నన్ను తీసికెళ్ళక. నేను వసంత్‌ని ఒదిలి రాలేను. నేను లేనిదే అతను ఉండలేడు. అని ప్రక్షణమూ భగవంతుడికి చెప్పుకుంటున్నాను."

"వింటాడు."

"ఏమో! వసంత్! నా ఈ ముప్ఫయ్యేళ్ళ జీవితంలో నాకు అన్నీ కష్టాలే అంతా దురదృష్టమే! ఎప్పుడు ఏవి జరగకూడదో సరిగా అప్పుడు అవి జరిగాయి; నా అవివేకమో, నా ఖర్మో నాకు తెలియదు. ఇప్పుడు ఇంత స్వర్గానుభవం వస్తే నిజం కాదేమో ఎప్పుడు పోతుందో అని భయం వేస్తోంది!"

"మీనా! పిచ్చిగా అలా భయాలు పెట్టుకోక నువ్వు పడవలసిన కష్టాలన్నీ పడ్డావు ఇక సుఖమూ, ఆనందమూ, తృప్తి తప్ప నీకు ఈ జీవితంలో కష్టాలుండవు."

"నీ మాట నమ్మాలనే ఉంది. కానీ నేను పిరికిదాన్ని అయిపోయాను వసంత్!"

లేచి కూర్చోవాలంటే, రెండు భుజాలు పట్టుకుని కూర్చోపెట్టేవాడు.

"నువ్వు వేసుకోలేవు జడ నేను దువ్వుతాను."

"ఛ! నువ్వేమిటి"

"ప్రయిత్నిస్తాను" అని నూనె పూసి, తలదువ్వి జడ వేసేవాడు పళ్ళు వొలిచి తొనలు నోట్లో పెట్టేవాడు. సబ్బుతో ఒళ్ళు రుద్ది స్నానం చేయించేవాడు. పౌడర్ వేసేవాడు బట్టలు తెచ్చి ఇచ్చేవాడు. అన్నం మంచం దగ్గరికి తెచ్చిపెట్టేవాడు.

"పసిపాపని చూసుకుంటున్నట్లు చూసుకుంటున్నావు?"

"అవును. నువ్వు నా పాపవే! నాకు అన్నీ నువ్వే!"

"నన్ను మరీ గారాబం చేస్తున్నావు. రేపు కన్నాక కూడా వంట చేయ్యలేను నువ్వు ఇలా చేస్తే"

"నువ్వు చెయ్యవద్దు. నువ్వు నన్ను చూడు. నాకు కనబడు అంతే చాలు!"

మీనాక్షి వసంత్ ప్రేమని తలుచుకుని ఆశ్చర్యపోయేది. తన తండ్రి కూడా తనని అంత గారాబంగా, అంత ప్రేమగా చూడలేదు. తనకి నీళ్ళుపోస్తూ, సబ్బు రుద్దుతున్నప్పుడు కూడా అతనికి ఆవేశం రాదు. ఎంతో అనురాగంతో, నిర్మలమైన ప్రేమతో తనని ముట్టుకుంటాడు. ఇదా ప్రేమ! ఎంత గొప్పది!

వసంత్ బజారుకి వెళ్ళితే అతను తిరిగి వచ్చేటంతవరకూ మీనాక్షికి ఏమీ తోచేది కాదు. అతని చింపి జుట్టు, అతని చీకి కళ్ళు, సుఖమైన అతని నవ్వు అతని బిగువయిన పెదిమలు చూస్తుంటే కానీ తను బతికి ఉన్నట్లు అనిపించేది కాదు.

"వసంత్! నేను చచ్చిపోతే నువ్వు ఏమయిపోతావో అని బెంగగా ఉంది"

"అలా మాట్లాడక మీనా! నువ్వు చచ్చిపోతే నేనూ చచ్చిపోతాను. రోజూ కొన్ని వందలమంది, కాదు కొన్ని వేలమంది స్త్రీలు కంటున్నారు పిల్లల్ని."

"అందరి విషయం వేరు, నా విషయం వేరు."

బుజ్జగించేవాడు ధైర్యం చెప్పేవాడు.

"వసంత్! ఒకవేళ నేను చచ్చిపోతే మన ఈ ప్రేమ ఇక్కడితో, ఈజీవితంతో అంతం అవుతుందా లేక మళ్ళీ ఎప్పుడో ఎక్కడో మనం కలుసుకుంటామా?"

"మీనా! అలా మాట్లాడక. నా గుండె పగిలిపోతుంది."

"అవును వసంత్! నాకు నమ్మకం ఉంది. మనం మళ్ళీ ఎప్పుడో ఎక్కడో కలుసుకుని మళ్ళీ ఇలా ప్రేమించుకుంటాం. అది జ్ఞాపకం పెట్టుకో! అప్పుడు నీ రుణం నేను తీర్చుకుంటాను వసంత్!" అని అతనికి చెప్పేది.

****

రాత్రి పన్నెండు గంటలకి మీనాక్షికి నెప్పులు వచ్చాయి. వసంత్ మీనాక్షిని నర్సింగ్ హోంకి తీసుకెళ్ళాడు టాక్సీలో.

లేడీ డాక్టర్, నర్సు మీనాక్షిని డెలవరీ రూంలోకి తీసుకెళ్ళి పడుకోపెట్టారు. పది నిమిషాల తర్వాత లేడీ డాక్టర్ బయటికి వచ్చింది.

"మిష్టర్ వసంత్!"

"యస్ డాక్టర్!"

"కాంప్లికేటెడ్ కేసులా ఉంది. నేను ఒక్కతెనీ చెయ్యలేను. పెద్ద డాక్టర్ని పిలవాలి. లేదా ఆస్పత్రికి తీసికెళ్ళాలి!"

వసంత్ మొహం పాలిపోయింది. "మీ సలహా ఏమిటి?" అడిగాడు.

"అంబులెన్స్ పిలిపించి ఆస్పత్రికి తీసుకెళ్ళండి. నెత్తురు ఎక్కించవలసి రావచ్చు. అక్కడ అన్ని వసతులూ ఉంటాయి!"

"సరే!" అన్నాడు వసంత్.

"నేను టెలిఫోన్ చేస్తాను అంబులెన్స్ కోసం. ఆస్పత్రిలో నాకు తెలిసిన డాక్టర్‌కి ఫోన్ చేసి చెపుతాను. ఇంకా ఇప్పుడప్పుడే కాన్పు రాదు. మీరు లోపలికి వెళ్ళి ఆమె పక్కన కూర్చుని ధైర్యం చెప్పండి!" అన్నది డాక్టర్.

వసంత్ కాళ్ళు వణుకుతున్నాయి, కళ్ళు చీకట్లు కమ్ముతున్నాయి. ఊపిరి ఆడడం లేదు లోపలికి వెళ్ళాడు. మీనాక్షి మూలుగుతోంది.

వసంత్‌ని చూడగానే చెయ్యిజాపింది. అతను ఆమె చేతిని గట్టిగా పట్టుకుని "భయం లేదు మీనా! ఆస్పత్రికి తీసుకెళతాను" అన్నాడు.

అంత బాధలోనూ మీనాక్షి చిన్నగా నవ్వింది.

"భయంలేదా వసంత్! నాకు తెలుసు. నేను బతకను. చెప్పానుగా! భగవంతుడికి నా మొదటి ప్రార్థన వినిపించింది తర్వాత ప్రార్థన వినిపించలేదు."

"మీనా! అధైర్యపడక!"

"ధైర్యంగానే ఉన్నాను. నేను పోతానని నాకు తెలుసు. నువ్వేమవుతావు? నిన్ను వొదిలి ఎలా వెళ్ళను? నన్ను నీలా అక్కడ ఎవరు చూసుకుంటారు? నువ్వు లేనిదే నేను ఎలా ఎక్కడికి పోగలను?"

కళ్ళల్లో నీళ్ళు నిండాయి.

"మీనా! ఊరుకో, నువ్వు ఎక్కడికీ వెళ్ళవు."

"నీ రుణం తీర్చుకోకుండానే వెళ్ళిపోవాలా వసంత్? నా వసంత్! ఇది మాత్రం జ్ఞాపకం పెట్టుకో. నేను పోయినా మళ్ళీ వస్తాను. ఈ శరీరాన్ని ఈ కలుషితమైన శరీరాన్ని, ఒదల్చుకుని, ఆ నాగరాజు ముట్టుకున్న ఈ తోలుని విప్పేసి, మళ్ళీ ఇంకో ఆకారంలో వస్తాను. జ్ఞాపకముంచుకో! నిన్ను కలుసుకుంటాను, నిన్ను ప్రేమిస్తాను."

"మీనా! ప్లీజ్!"

"నువ్వు ఈ రూపంలో ఉన్నా, ఈ శరీరం వదిలి ఇంకో రూపంలో ఉన్నా నిన్ను కలుసుకుంటాను కలుసుకుని తీరతాను లేకపోతే మన ఈ ప్రేమకి అర్థం లేదు."

"ఇలాగే ఈ రూపంలోనే ఉంటాం మనం!"

"ఉండకపోతే మళ్ళీ ఎప్పుడో ఎక్కడో కలుసుకుంటాము వసంత్! అది జ్ఞాపకముంచుకో!" అంటున్నది మీనాక్షి. అంతలో అంబులెన్స్ వాళ్ళు స్ట్రెచ్చర్‌తో వచ్చారు.

## 25

తెల్లవారపోతోంది, దూరాన రోడ్ మీద మోటారు కార్ల ఇంజన్‌ల హోరు, ఆస్పత్రి ఆవరణలో చెట్లమీద పక్షుల కిచకిచలు వసంత్‌కి వినపడడంలేదు.

అతని మనస్సంతా డెలివరీ రూంలో మీనాక్షితో ఉంది. బయట తలుపు దగ్గర తారాట్లాడుతున్నాడు.

నర్సులు వెళుతున్నారు; డాక్టర్లు వెళుతున్నారు; వస్తున్నారు. ఎవర్ని అడిగినా "క్రిటికల్‌గా ఉంది కండిషన్!" అంటున్నారు.

సూర్యుడు పైకి ఎగపాకుతున్నాడు. ఎనిమిది గంటలు దాటింది.

పెద్ద డాక్టర్, చిన్న డాక్టరు ఇద్దరూ వచ్చారు డెలవరీ గదిలోంచి. వసంత్ భుజం మీద చెయ్యిపడింది.

"డాక్టర్! ఎలా ఉంది?" అడిగాడు వసంత్.

"సారీ! మాశాయశక్తులా ప్రయత్నించాము. కనీసం తల్లి ప్రాణాన్నయినా కాపాడుదామని; వీలులేకపోయింది. తల్లీ పిల్లా ఇద్దరూ పోయారు దైవసంకల్పం. మనుష్యులం మనం ఏం చెయ్యగలం!"

వసంత్ తలమీద కొండపడినట్లయింది.

"ఏమిటి? ఏమంటున్నారు?" అడిగాడు అరుస్తూ.

"ఇంటర్నల్ హెమరేజ్ వచ్చింది. ఏం చెయ్యలేక పోయాం!" అంటున్నది డాక్టర్. అందర్నీ తప్పించుకుని ఒక్క పరుగు తీశాడు లోపలికి.

కాళ్ళనుంచి, మెడవరకూ దుప్పటి కప్పుకుని పడుకుని ఉంది.

మొహం వికృతంగా లేదు; శాంతంగా ఉంది.

"మీనా! మీనా!" అన్నాడు ఆమె చెంపలని అరచేతుల్లో పెట్టుకుని.

"మళ్ళీ ఎప్పుడో ఎక్కడో! కాచుకో!" అన్నట్లు వినిపించింది.

"అవును. మీనా! మనం మళ్ళీ ఎప్పుడో ఎక్కడో కలుసుకుంటాం. మాట తప్పవుకదూ! కలుసుకుంటావు కదు! మళ్ళీ ఎప్పుడో ఎక్కడో!" అంటూ ఆపరేషన్ టేబుల్ మీద తలపెట్టి భోరున ఏడ్చాడు.

***(సమాప్తం)***